www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2015-17
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 66 సంచిక : 198 | సోమవారం 08-01-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | వెల: రూ.3.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ



కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న అమర్‌జిత్ కౌర్, పక్కన మహాదేవన్, విజయలక్ష్మి, కల్పన, ఓబులేసు, రవీంద్రనాథ్, వెంకట సుబ్బయ్య, కిర్ల కృష్ణారావు తదితరులు



జీవీ కృష్ణారావు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

· కార్మికోద్యమాలకు

దిక్సూచి కావాలి

ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయం జోశ్యభట్ల సత్యనారాయణ భవన్ ప్రారంభోత్సవ సభలో వక్తలు

- ఆంగ్లేయుల బాటలో మోడీ ప్రభుత్వం : అమర్‌జిత్‌కౌర్
- ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్న కేంద్రం : మహాదేవన్

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : కార్మికులు తమ హక్కులను కాపాడుకునేందుకు నిర్వహించే ఐక్య ఉద్యమాలకు జోశ్యభట్ల సత్యనారాయణ భవన్ దిక్సూచిగా, కార్యకేంద్రంగా నిలవాలని పలువురు వక్తలు ఆకాంక్షించారు. నవ్యాంధ్ర రాజధానిలో కార్మికోద్యమాల దిశాదశలను ఈ భవనం నుంచే నిర్దేశించాలని అభిలాషించారు. జెండాలెన్ని ఉన్నప్పటికీ ఒకే అజెండాతో ఐక్యతగా పోరాటాలను సాగించాలన్నారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలన్నారు. గొల్లపూడిలో నూతనంగా నిర్మించిన ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి కార్యాలయభవనాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై భవనాన్ని ప్రారంభించిన ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్‌కౌర్ మాట్లాడుతూ దేశ పరిస్థితులు చాలా క్లిష్టంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బ్రిటీష్ పాలకులు దేశాన్ని విడిచి వెళ్లిపోయి ఏడు దశాబ్దాలు గడచినా ఇంకా వారి బాటనే ప్రస్తుత పాలకులు అనుసరిస్తున్నారని తెలిపారు. ఒకవైపు విభజించు-పాలించు ధోరణిని అవలంబిస్తూనే, మరోవైపు ఎలా జీవించాలి.. ఏం తినాలో ప్రజలను శాసించే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం పెనుప్రమాదంలో చిక్కుకున్నాయన్నారు. మైనార్టీలు, దళితులు, వామపక్ష మేధావులపై దాడులు పెరిగిపోతున్నాయని తెలిపారు. మోడీ ప్రభుత్వం కార్మికులు, కర్షకులు, ఉద్యోగులను కట్టుబానిసలుగా మార్చే విధంగా ఆయా చట్టాల్లో మార్పులకు శ్రీకారం చుడుతోందన్నారు. సమ్మెచేసే హక్కులను కాలరాసే విధంగా కార్మిక చట్టాల్లో భారీ మార్పులు తెచ్చేందుకు యత్నిస్తోందన్నారు. కార్మికులు రేయింబవళ్లు చమటోడ్చి సృష్టించిన సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టాలని ప్రయత్నిస్తోందన్నారు. పెద్దనోట్లరద్దు, వస్తు సేవల పన్ను (జీఎస్టీ) వల్ల దేశంలో తయారీరంగంతోపాటు అన్ని రంగాలు కుదేలయ్యాయని తెలిపారు. గుజరాత్ ఎన్నికల్లో - మిగతా 2 లో

సర్వం సిద్ధం

- నేటి నుంచి సీపీఐ జాతీయ సమితి సమావేశాలు
- నగరానికి చేరుకున్న జాతీయ నాయకులు
- బ్యానర్లు, కటౌట్లతో స్వాగత ఏర్పాట్లు



జాతీయ సమితి సమావేశాలకు ముస్తాబైన దాసరి భవన్, (ఇన్‌సెట్‌లో) స్వాగత కటౌట్

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ సమితి సమావేశాలు విజయవాడలో సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు ఈ సమావేశాలు జరుగనున్నాయి. సోమవారం ఉదయం కార్యవర్గదర్శివర్గం, కార్యవర్గ సమావేశాలు అనంతరం సాయంత్రం 4 గంటలకు కౌన్సిల్ సమావేశాలు ప్రారంభమవుతాయి. హనుమాన్‌పేట దాసరి నాగభూషణరావు భవన్‌లోని 'తమ్మిన పోతరాజు హాలు' ఈ సమావేశాలకు వేదిక కానుంది. ఇప్పటికే జాతీయ నాయకులు సురవరం సుధాకరరెడ్డి, కె నారాయణ సహా 29 రాష్ట్రాల నుంచి రాష్ట్ర సమితి కార్యదర్శులు, పలువురు కౌన్సిల్ సభ్యులు నగరానికి చేరుకున్నారు. మరికొందరు సోమవారం ఉదయానికి చేరుకుం టారు. గన్నవరం విమానాశ్రయం, రైల్వేస్టేషన్, పండిట్‌నెహ్రూ బస్టేషన్‌లో పార్టీ కార్యకర్తలు నేతలకు స్వాగతం పలికి ప్రత్యేక వాహనాల్లో బస ఏర్పాటు చేసిన ప్రదేశాలకు తరలిస్తున్నారు. సమావేశాలను పురస్కరించుకుని నగరవ్యాప్తంగా ఫ్లెక్సీ బ్యానర్లు, కటౌట్లను ఏర్పాటు చేశారు. పార్టీ పతాకాలు, తోరణాలతో - మిగతా 2 లో

హెచ్1బి వీసాలపై కేంద్రం జోక్యం అవశ్యం

నారాయణ డిమాండు

11లో

చివరి దాకా నీరు..



- భూగర్భ జలాలను నిల్వ ఉంచాలి
- సిద్ధాపురం ఎత్తిపోతల ప్రారంభించడం నా పూర్వజన్మ సుకృతం
- ముఖ్యమంత్రి చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు : రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి చివరి ఆయకట్టు వరకు నీరు అందించే లక్ష్యంగా కృషి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఆదివారం శ్రీశైలం నియోజకవర్గంలోని సిద్ధాపురం ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించి జలహారతి ఇచ్చారు. అనంతరం బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ ప్రతి ఒక్కరు బ్యాంకులో డబ్బు దాచుకుని అవసరమైన సమయంలో తీసుకుని ఖర్చు చేసినట్లుగా భూగర్భ జలాలను ఎక్కడికక్కడ ఆదా చేసి అవసరాలకు - మిగతా 2 లో

డీఎంకేకు రజనీ గుబులు



- వచ్చే ఎన్నికల్లో తలైవా ప్రభావంపై ఆందోళన
- ఈసారి గెలవకపోతే కష్టమే
- నేతల మథనం

9లో


బ్యూరోక్రాట్లపై ఖర్చెంత?



- ఐఏఎస్, ఐపీఎస్‌ల వల్ల పెరిగే ఆదాయమెంత?
- మూడు నెలల్లో వివరాలివ్వండి
- కేంద్రంపై పార్లమెంటరీ అంచనాల కమిటీ ఆగ్రహం

9లో

ఇదీ లోకం!



ప్రాణాలు తీసిన సరదా

- చెరువులో మునిగి నలుగురు ఇంజనీరింగ్ విద్యార్థులు మృతి
- పశ్చిమగోదావరి జిల్లా భోగాపురంలో ఘటన

విశాలాంధ్ర - పెదవేగి : సరదా కోసం చెరువులో దిగి నీటిలో మునిగి నలుగురు ఇంజనీరింగ్ విద్యార్థులు మృతి చెందారు. పశ్చిమ గోదావరి జిల్లా పెదవేగి మండలం భోగా పురం గ్రామం వట్లూరు చెరువు వద్ద ఈ విషాద ఘటన శనివారం రాత్రి జరిగింది. అయితే స్థాని కుల ద్వారా ఆదివారం ఈ విషయం బయటప డింది. చనిపోయిన నలుగురు విద్యార్థులు ఏలూ రుకి సమీపంలోని రామచంద్ర ఇంజనీరింగ్ కళా శాలలో ఇసిఇ, మెకానికల్ ఇంజనీరింగ్ చదువు తున్నారు. ఏలూరు డీఎస్పీ కె.ఈశ్వరరావు కథనం ప్రకారం.. కృష్ణాజిల్లా కలిదిండి మండలం తొండంగి గ్రామానికి చెందిన ఏఎస్‌కె పరశురామ్ (23) ఏలూరులో బంధువుల ఇంట్లో ఉండి రామచంద్ర ఇంజనీరింగ్ కాలేజీలో మెకానికల్ ఇంజనీరింగ్ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. చింతలపూడికి చెందిన కోట సాయి (22) అదే కళాశాలలో ఇసిఇ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. అదే గ్రామానికి చెందిన - మిగతా 2 లో

నలుగురు వెయిట్ లిఫ్టర్లు దుర్మరణం

- ప్రపంచ లిఫ్టరుకు గాయాలు
- ఢిల్లీ సమీపంలో కారు ప్రమాదం
- పొగమంచు వల్ల దుర్ఘటన

9లో

రాకుమారుల నిరసన - అరెస్టు

పేర్లను వెల్లడించని అటార్నీజనరల్

ఇస్తాంబుల్ : సౌదీ అరేబియాలో 11 మంది రాకుమారులను అరెస్టు చేశారు. వినియోగ బిల్లులైన నీటి, విద్యుత్ బిల్లులను ప్రభుత్వం చెల్లించకపోవడంతో వారంతా నిరసన చేపట్టారు. దీంతో వారిని అరెస్టు చేసినట్లు అటార్నీ జనరల్ ఒక ప్రకటనలో తెలిపారు. 2016లో హత్యకేసులో మరశిక్ష అమలు చేసిన సోదర రాకుమారుడికి నష్టపరిహారం చెల్లించాలని కూడా వారు డిమాండు చేశారు. అరెస్టులతో రాజ కుటుంబంలో ఉద్రిక్తతలు నెలకొన్నాయి. దేశ వ్యవహారాల్లో పట్టాభిషక్తుడైన యువరాజు మొహ్మద్ బిన్ సాల్మన్ పట్టు సాధిస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పరిపాలనా విభాగంలో సాల్మన్ పలుకుబడి ఉంది. తండ్రి, సౌదీ రాజు సాల్మన్ అతనికి వారసత్వ అధికారం అప్పగించగానే రాచకుటుంబంలోని వ్యతిరేక వాదులపై ఉక్కుపాదం మోపుతున్నారని విశ్లేషకులు చెబుతున్నారు. నవంబరులో యువరాజులతో సహా డజన్ల కొద్దీ మంత్రులను, వ్యాపార దిగ్గజాలను ,సౌదీవాసులను అరెస్టు చేయించిన విషయం తెలిసిందే. అవినీతికి వ్యతిరేకంగా అరెస్టులు జరిగాయని అధికారులు ప్రకటిస్తున్నప్పటికీ అధికారానికి సుస్థిరతకు అరెస్టులు జరుగుతున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. సైనికులకు, ప్రభుత్వ ఉద్యోగులకు బోనస్‌లు చెల్లించాలని రాజు సాల్మన్ ఆదేశించారు. రాజవంశీకులకు మాత్రం సబ్సిడీలు తగ్గిస్తూ, విద్యుత్ రేట్లు పెంచి వాటిపై వ్యాట్ ప్రవేశపెడుతున్నారు. అటార్నీ జనరల్ షేక్ సౌద్ అల్ మొజెబ్ అరెస్టయిన రాజకుమారుల పేర్లను మాత్రం ప్రకటించలేదు. రియాద్ రాజమందిరంలోఉచితాసనాల్లో కూర్చొని నిరసన తెలుపుతున్న వారిని అక్కడినుంచి వెళ్లిపోవాల్సిందిగా ఆదేశించినప్పటికీ వారు వెళ్లకపోవడంతో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని అరెస్టు చేశామని ప్రకటన తెలిపింది. చట్టానికి ఎవరూ అతీతులు కాదని సౌదీలోని ప్రతి పౌరుడు సమానమేనని ప్రకటన పేర్కొంది.





సింగిల్ మార్కెట్‌లో కొనసాగండి

బ్రిటన్ ప్రధానికి యూరప్ మంత్రుల లేఖ

లండన్ : సింగిల్ మార్కెట్ సభ్యదేశంగా కొనసాగాలని కోరుతూ యూరప్ మంత్రుల (ఎంఈపీలు) బృందం బ్రిటన్ ప్రధానికి లేఖ రాసింది. సోమవారం బ్రసెల్స్‌లో బ్రెగ్జిట్ మధ్యవర్తి మైఖెల్ బార్నియర్‌తో ముఖాముఖీకి యూరోపియన్ యూనియన్ సన్నద్ధమవుతున్న నేపథ్యంలో యూరప్ స్పందించింది. ఈ బ్లాక్ నుంచి బ్రిటన్ నిష్క్రమణను కాంక్షించే ఎంఈపీ నిగెల్ ఫరాగె 20ఏళ్ల క్రితం యునైటెడ్ కింగ్‌డమ్ ఇండిపెండెన్స్ పార్టీ (యూకేఐపీ) సహవ్యవస్థాపకులు. మధ్యవర్తితో సమావేశాన్ని ఫరాగె కోరారు. దీంతో ఆయనతో యూరోపియన్ కమిషనర్ కేంద్రకార్యాలయంలో సోమవారం భేటీ అవుతారు. వెస్ట్‌మినిస్టర్‌కు చెందిన బిటిష్ అనుకూలురైన నాయకుల బృందం అర్నియర్‌ను కలిసిన నేపథ్యంలో ఈ తాజా పరిణామం చోటుచేసుకుంది. ప్రో-ఈయూ గ్రూప్ 'ఓపెన్ బ్రిటన్' ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జేమ్స్ మెక్‌గోరీ మాట్లాడుతూ 'నిగల్ ఫరాగెను బ్రెగ్జిట్ చర్చల కోసం బ్రసెల్స్‌కు పంపడమంటే ఇంటిని తగలబెట్టిన వ్యక్తిని మంటలు ఆర్పమని పంపినట్లు ఉంటుంది' అని అన్నారు. బ్రెగ్జిట్ వ్యయం, ఇబ్బందుల గురించి ఆయనకు ఏమీ తెలియదన్నారు. ప్రజాభిప్రాయం



వెలువడి బ్రెగ్జిట్‌పై చర్చలు దాదాపు చివరిదశలో ఉన్న తరుణంలో నిజాయితీ, వాస్తవికతలున్న కలిగివుండడం ముఖ్యమని, నిగెల్ ఫెరాగెలో అవి లేవని ఆయన వ్యాఖ్యానించారు. దీనిపై ఫరాగె స్పందిస్తూ బార్నియర్.. బ్రెగ్జిట్‌ను నిపివేయాలి లేదా జాప్యం చేయాలనే వ్యక్తుల మాటలను వింటున్నారని అన్నారు. 52-48 మార్జిన్‌ని వదలాలంటూ 2016, జూన్‌లో రిఫెరెండం ద్వారా తమ అభిప్రాయాన్ని వెల్లడించిన 17.4మిలియన్ మంది బ్రిటన్‌ప్రజల తరపున తాను ప్రాతినిధ్యం వహిస్తున్నట్టు తెలిపారు. బ్రిటన్, ఈయూ మధ్య భవిష్యత్ వాణిజ్యం నేపథ్య చర్చలకు సమయం దగ్గరపడుతుండడంతో వాతావరణం వేడెక్కుతోంది.బ్రిటన్ నిష్క్రమణను కోరుకునేవారు, వ్యతిరేకించేవారి మధ్య మాటలయుద్ధం తీవ్రతరమవుతోంది. కాగా, 2019, మార్చి నాటికి ఈయూ నుంచి బ్రిటన్ నిష్క్రమిస్తుందని ప్రధాని థెరిసా మే స్పష్టంచేశారు. అలాగే ఈయూ సింగిల్ మార్కెట్, కస్టమ్స్ యూనియన్ నుంచీ వైదొలుగుతామని తెలిపారు. యూరోపియన్ సింగిల్ మార్కెట్ అండ్ కస్టమ్స్ నుంచి నిష్క్రమించవద్దని బ్రిటిష్ క్రాస్-పార్టీ ఎంఈపీలు థెరిసా మేను కోరుతున్నట్టు గార్డియన్ పత్రిక పేర్కొంది. మా సరిహద్దులపై నియంత్రణను తీసుకొని, యూరోపియన్ కోర్టు ఆఫ్ జస్టిస్‌తో అధికార మీమాంసను ముగించుకొని సింగిల్ మార్కెట్, కస్టమ్స్ యూనియన్ నుంచి బయటకొస్తామని బ్రిటన్ ప్రభుత్వ అధికారి పేర్కొన్నట్టు గార్డియన్ వెల్లడించింది.

చైనా నౌకను ఢీకొన్న ఇరాన్ ట్యాంకర్

ఒలికిపోయిన చమురు : తగలబడిన నౌక
ఎగిసిపడ్డ మంటలు : 32 మంది సిబ్బంది గల్లంతు



బీజింగ్ : దేశానికి చెందిన అగ్రషిప్పింగ్ సంస్థకు ఆధ్వర్యంలో ఇరాన్ చమురును రవాణా చేస్తున్న ట్యాంకర్ నౌక ఈస్ట్ చైనా సముద్రంలో చైనాకు చెందిన భారీ నౌకను ఢీకొన్నట్టు చైనా ప్రభుత్వం వెల్లడించింది. ఈ ఘటన నేపథ్యంలో ట్యాంకర్‌లోని చాలా వరకు చమురు సముద్రంలోకి ఒలికిపోయింది. రవాణా నౌకలో మంటలు చెలరేగాయి. అంతేకాకుండా 32 మంది సిబ్బంది గల్లంతయ్యారు. పనామాలో రిజిస్ట్రరైన 'సాంచీ' ట్యాంకర్ షాంఘై తీరానికి 160 నాటికల్ మైళ్ల దూరంలో చైనాకు చెందిన సీఎఫ్ క్రిస్టల్‌ను ఢీకొన్నట్లు రవాణాశాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రమాదానికి గురైన ట్యాంకర్ నౌక ఇరాన్ నుంచి అత్యంత తేలికపాటి (అల్ట్రాలైట్) ముడిచమురుతో కూడిన మిలియన్ బ్యారెల్స్‌ను దక్షిణ కొరియాకు తరలిస్తోంది. ఈ సరుకు విలువ ప్రపంచ ముడిచమురు మార్కెట్‌లో 60మిలియన్ డాలర్లు ఉంటుందన్న అంచనా ఉంది. సాంచీ ప్రస్తుతం నీటిపైనే ఉందని, అయితే నౌక తగలబడి దట్టమైన పొగ వెలువడుతోందని, చమురు సముద్రంలోకి ఒలికిపోతోందని, సహాయక చర్యలు జరుగుతున్నాయని మంత్రిత్వశాఖ పేర్కొంది. ఇప్పటికే నాలుగు సహాయక నౌకలు, మూడు ప్రక్షాళన నౌకలను రంగంలోకి దించినట్టు వివరించింది. దక్షిణ కొరియా కూడా ఓ సహాయ నౌక, హెలికాప్టర్‌ను ఘటనాస్థలికి పంపింది. నౌక తగలబడిపోయిన ఫొటోలను స్థానిక ఛానళ్లు ప్రసారం చేశాయి. 2008లో తయారైన సాంచీ... నేషనల్ ఇరానియన్ ట్యాంకర్ కో (ఎన్ఐటీసీ) ఆధ్వర్యంలో బ్రైట్ షిప్పింగ్ లిమిటెడ్ యాజమాన్యం కింద నమోదై ఉన్నట్టు ర్యూటర్స్ షిప్ ట్రాకింగ్ డేటా వెల్లడించింది. 2016, ఆగస్టులోనూ ఎన్ఐటీసీ నేతృత్వంలోని రవాణా నౌక ఒకటి సింగపూర్ స్ట్రెయిట్‌లో ప్రమాదానికి గురైంది. అది ఆ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టంగానీ పర్యావరణానికి హానిగానీ జరగలేదు.

లిబియాలో కారుబాంబు పేలుడు



బెంగాజీ (లిబియా) : లిబియా తూర్పు ప్రాంతంలోని బెంగాజీలో కారు బాంబు పేలింది. శనివారం ఉదయం 10.45కు ఈ ఘటన జరిగిందని, అయితే ఎవరూ గాయపడ లేదని అధికార వర్గాలు తెలిపాయి. మున్సిపల్ కౌన్సిల్ ఆఫ్ సలౌక్ ఈ విషయాన్ని ధృవపరుస్తూ అధికారికి ఫేస్ బుక్‌లో పోస్టు చేసింది. ఈ ఘటనకు బాధ్యులమని ఏ సంస్థా తెలుపలేదు. రాజకీయ అస్థిరత, గందరగోళం, హింస, అభద్రత దేశంలో చోటు చేసుకున్నాయి.

బలూచిస్థాన్‌లో రాజకీయ సంక్షోభం



సీఎంపై వేటుకు రంగం సిద్ధం
14 విపక్షాల అవిశ్వాస తీర్మానం
ప్రశ్నార్థకంగా సెనేట్ ఎన్నికలు

బలూచిస్థాన్ : బలూచిస్థాన్‌లో రాజకీయ సంక్షోభం నెలకొంది. ముఖ్యమంత్రి సనావుల్లా జెహ్రీ ప్రభుత్వం రద్దు అయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికే 14 విపక్షపార్టీలు ఆయనపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. 65మందిలో 33 మంది ఆమోదిస్తే ప్రస్తుతం పదవిలో ఉన్న ముఖ్యమంత్రికి ఉద్వాసన తప్పబోదని డాన్ పత్రిక పేర్కొంది. త్వరలో సెనేట్ ఎన్నికలు జరగనున్న దృష్ట్యా ఈ తాజా పరిణామాలు కీలకమని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. మాజీ ప్రధాని, బహిష్కృత నేత నవాజ్ షరీఫ్‌కు విశ్వాసపాత్రుడిగా ఉండడం, ప్రాదేశిక వ్యవహారాల్లో ఫెడరల్ జోక్యం వంటి అంశాల దృష్ట్యా నేడు సీఎంపై వేటుపడొచ్చునని అభిప్రాయపడ్డారు. 2013లో పాకిస్థాన్ ముస్లిం లీగ్-నవాజ్ (పీఎంఎల్-ఎన్) మెజారిటీ సీట్లను కైవసం చేసుకొని సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. డాక్టర్ అబ్దుల్ మాలిక్ బలోచ్‌ను ముఖ్యమంత్రిగా నియమించింది. అబ్దుల్ మాలిక్ తప్పుకోవడంతో ప్రముఖ 'మర్రి ఒప్పందం' నేపథ్యంలో 2015లో సనావుల్లా జెహ్రీ ముఖ్యమంత్రిగా నియమితుల య్యారు. ప్రస్తుత జాతీయ భద్రత సలహాదారు (ఎన్ఎస్ఏ) గా ఉన్న సదరన్ కమాండ్ మాజీ లెఫ్టినెంట్ జనరల్ మహమ్మద్ నాసర్ ఖాన్ ఝానువా సీఎం పదవిలో డాక్టర్ బలోచ్ కొనసాగాలని కోరుకోగా, బలోచిస్థాన్ అసెంబ్లీలో మెజారిటీ సాధించిన జెహ్రీ వ్యతిరేకించినట్టు క్వెట్టాకు చెందిన విశ్లేషకులు పేర్కొన్నట్టు వార్తానివేదిక పేర్కొంది. సొంత పార్టీ మంత్రులకు.. జెహ్రీకి మధ్య సత్సంబంధాలు లేవని పీఎంఎల్-ఎన్ సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. అసెంబ్లీ సీనియర్ మంత్రి ఒకరు స్పందిస్తూ ' సొంత మంత్రులతో సనావుల్లా జెహ్రీ కటువుగా వ్యవహరిస్తారు. వారి వ్యవహారాలలో తలదూరుస్తారు' అని అన్నారు. బలోచిస్థాన్ నేషనల్ పార్టీ-మెంగల్ (బీఎన్‌పీ-ఎం) అధినేత సర్దార్ అక్తర్ మెంగల్, ఆయన పార్టీ మంత్రి మీర్ హమ్మద్ కల్మాతీలు ఈ అవిశ్వాస తీర్మానానికి సిగ్నెటరీలు (అధికార సంతకందారులు)గా వ్యవహరించారు. నవాజ్ షరీఫ్‌కు నమ్మినబంటుగా ఉన్నందుకే జెహ్రీకి ఈ శిక్ష అంటూ పష్టుంఖ్వా మిల్లి అవామీ పార్టీ (పీకేఎంఏపీ) చీఫ్ మహమూద్ ఖాన్ అచాక్‌జాయి వ్యాఖ్యానించారు. కొత్త మంత్రులు జెహ్రీని ఏకాకి చేస్తున్నారని పాకిస్థాన్ సీనియర్ జర్నలిస్టు సిద్ధీఖ్‌బలోచ్ తెలిపారు. 'అసెంబ్లీ రద్దు అయితే సెనేట్ ఎన్నికలు జరగవు' అని ఆయన హెచ్చరిం చారు. సనావుల్లా జెహ్రీ నుంచి ఇటీవల పోర్ట్‌ఫోలియోలు అందుకున్న మంత్రులు రాజీనామాలు చేస్తూ జెహ్రీని ఒంటరివారిని చేసినట్టు పేర్కొన్నారు. ఆయన వైపు వాదనలు వినిపించగల టీమ్ కూడా జెహ్రీ వద్ద లేదన్నారు. అయితే, గతంలోనూ బలూచిస్థాన్ ప్రభుత్వాలు రద్దు అయిన సందర్భాలు చాలానే ఉన్నాయి.

దిక్సూచి కావాలి

(మొదటిపేజీ తరువాయి)

చాలా కష్టంగా గెలిచిన బీజేపీ కేవలం 30 శాతం ఓట్లను మాత్రమే పొందడంతో డోలాయ మానంలో పడిందన్నారు. విభజన చట్టంలో హామీలపై మూడున్నరేళ్లుగా తాత్సారం చేసిన మోడీ గుజరాత్ ఫలితాలతో భయపడి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు అప్పాయింట్‌మెంట్ ఇచ్చారని ఆమె ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా టీడీపీ ఎంపీలు వాస్తవాలను గ్రహించి కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తేనే ఏపీకి న్యాయం జరుగుతుందన్నారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై భవిష్యత్తులో మరింత పెద్దఎత్తున ఐక్య ఉద్యమాలు చేసేందుకు కార్మికశ్రేణులు సిద్ధంగా ఉండాలని అమర్‌జిత్‌కౌర్ పిలుపునిచ్చారు.

ఏఐటీయూసీ కార్యాలయాన్ని ప్రారంభించిన వర్కింగ్ ప్రసిడెంట్ హరిహర మహాదేవన్ మాట్లా డుతూ సుదీర్ఘచరిత కలిగిన ఏఐటీయూసీ రెండో సెంచరీని ప్రారంభించిందన్నారు. ప్రధాని మోడీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆలోచనలు ఒకే విధంగా ఉన్నాయన్నారు. దేశంలో ప్రభుత్వ రంగసం స్థలను మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. కేవలం వేతనాల పెంపు కోసమే కాకుండా అన్ని రకాల సమస్యలపై పోరాటా లను సాగించేందుకు కార్మికశ్రేణులు సమాయత్తం కావాలన్నారు. ఐక్యంగా ఉంటే కార్మికశక్తిని ఎవరూ ఏమీ చేయలేరని ఆయన స్పష్టం చేశారు.

గౌరవ అతిథిగా హాజరైన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై కార్మిక సంఘాలు చేస్తున్న పోరాటాలు, ఉద్యమాల వల్లే కొంతవరకైనా న్యాయం జరుగుతోం దన్నారు. వామపక్షాలకు చట్టసభల్లో సరైన ప్రాతి నిధ్యం లేకపోవడంవల్లే ప్రభుత్వాలు బరితెగించి చట్ట సభల్లో బిల్లులు తెస్తున్నాయని తెలిపారు. ఎన్నికల్లో కోట్లను గుమ్మరించిన వారే గెలిచే పరిస్థితులున్నా యని, ఈ విధానంలో మార్పు రావాల్సి ఉందన్నారు. రాజకీయనాయకుల పిల్లలకే వారసత్వంగా పదవు లిచ్చే పరిస్థితులకు చరమగీతం పాడాలంటూ.. కార్మికులు, ఉద్యోగులు రాజకీయాల్లో క్రియాశీల కమైన పాత్రను పోషించాలని ఆయన కోరారు. జోశ్యభట్ల వెంకట సుబ్బమ్మ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ జె కల్పన మాట్లాడుతూ తన తండ్రి జోశ్యభట్ల సత్యనారాయణ కార్మికులకు అందించిన సేవలు, ఆయన నిరాడంబర జీవితాన్ని వివరించారు. నూతన భవనంలో జోశ్యభట్ల వెంకట సుబ్బమ్మ ట్రస్ట్ కార్యాలయాన్ని శ్రామిక మహిళా ఫోరం జాతీయ సమితి కన్వీనర్ బీవీ విజయలక్ష్మి, జీవీ కృష్ణారావు కాన్ఫరెన్స్‌హాలును ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పీజే చంద్రశేఖరరావు ప్రారంభించారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు స్వాగతం పలుకగా అధ్యక్షుడు చలసాని వెంకట రామారావు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఆలిండియా స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి డి ఆదినారాయణ, ఆలిండియా డిఫెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీవకుమార్, జాతీయ రోడ్డు రవాణా కార్మిక సమాఖ్య ఉప ప్రధాన కార్యదర్శి కె పద్మాకర్, ఆలిండియా బ్యాంకు ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యదర్శి బి రాంబాబు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ గఫూర్, తెలంగాణ తమిళనాడు, ఒడిశా రాష్ట్రాల ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శులు వి రత్నాకరరావు, ఎంఎల్ మూర్తి, శౌరి బందకర్‌తోపాటు రాష్ట్ర నాయకులు రావులపల్లి రవీంద్రనాథ్, కిర్ల కృష్ణారావు, మనోహర మాణిక్యం, వెలుగూరి రాధాకృష్ణమూర్తి, వెంకట సుబ్బయ్య, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, రావుల వెంకయ్య, పి హరినాథరెడ్డి, విశాలాంధ్ర పూర్వ సంపాదకుడు సి రాఘవాచారి, సీపీఐ కృష్ణాజిల్లా కార్యదర్శి అక్కినేని వనజ, గొల్లపూడి సర్పంచ్ నరసమ్మ, ఎంపీపీ జగన్మోహన్, ఎంపీటీసీ కిరణ్, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి దుర్గాభవానీ, ఏపీ ప్రజానాట్యమండలి ప్రధాన కార్యదర్శి పి చంద్రానాయక్‌తోపాటు వివిధ ప్రజాసంఘాల నాయకులు హాజరయ్యారు. తొలుత ప్రజానాట్యమండలి కళాకారులు విప్లవ, అభ్యుదయ గేయాలను ఆలపించారు.



సర్వం సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

ఆకర్షణీయంగా అలంకరించారు. ముఖ్యంగా ఈ సమావేశాల్లో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, పెద్దనోట్ల రద్దుతో పాటు జీఎస్టీ వలన ఆయా రంగాల్లో చోటుచేసుకున్న పరిణామాలు కీలకంగా ప్రస్తావనకు రానున్నాయి. అలాగే ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని అపహాస్యం పాల్జేజే పాలకపక్షాల తీరు, దళితులు, మైనార్టీలపై గణనీయంగా పెరిగిన దాడులు, గోసంరక్షణ దళాలు సాగిస్తున్న మారణ కాండ, మరోప్రక్క వామపక్షపార్టీల మేధావులు, రచయితలు, జర్నలిస్టులపై వరుసగా జరుగుతున్న హత్యలు, దాడులు, ఇంతర అంశాలపై సమగ్రంగా చర్చించనున్నారు. ఆయా రాష్ట్రాలకు సంబంధించిన సమస్యలు, పాలక పక్షాల వైఖరిపై కూడా లోతుగా విశ్లేషణలు, చర్చలు జరుపనున్నారు. భవిష్యత్తులో పార్టీని, ప్రజాసంఘాలను మరింత పటిష్టవంతం చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై కూడా ఈసమావేశం చర్చించనుంది. అలాగే గతంలో పాండిచ్చేరిలో నిర్వహించిన జాతీయ మహాసభలో చేసిన తీర్మానాలు, వాటి అమలుపై సమీక్షించుకొని అంతిమంగా ఒక నివేదికను రూపొందిస్తారు. దీనిని దేశంలోని అన్ని రాష్ట్రాలకు పంపి, ఆయా రాష్ట్ర మహాసభల్లో దానిపై చర్చించిన అనంతరం ఆ రాజకీయ ముసాయిదా తీర్మానాన్ని కేరళలోని కొల్లంలో ఏప్రిల్ 25వ తేదీ నుంచి 29వ తేదీ వరకు జరిగే పార్టీ జాతీయ మహాసభలో ప్రవేశపెట్టి ఆమోదం తెలియచేయనున్నారు. 23వ సీపీఐ జాతీయ మహాసభల్లో ప్రవేశపెట్టే రాజకీయ ముసాయిదా ఈ సమావేశాల్లో రూపొందించనుండడంతో విజయవాడలో జరిగే జాతీయ కౌన్సిల్‌కు అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. కాగా సమితి సమావేశాలు ముగింపు రోజైన బుధవారం స్థానిక జింఖానా గ్రౌండ్స్‌లో బహిరంగసభ జరగనుంది. ఈసభలో సీపీఐ జాతీయ ప్రధానకార్యదర్శి సురవరం సుధాకరరెడ్డితోపాటు, జాతీయ, రాష్ట్రనేతలు ప్రసంగించనున్నారు. దీంతో పార్టీ శ్రేణులను భారీగా సమీకరించి ఈ సభను విజయవంతం చేసేందుకు కృష్ణా జిల్లా, విజయవాడ నగర పార్టీలు కృషి చేస్తున్నాయి.

చివరి దాకా నీరు..

(మొదటిపేజీ తరువాయి)

ఉపయోగించుకోవాలని సూచించారు. 1922లో బ్రిటీష్ వారు సిద్ధాపురం చెరువును నిర్మించి వెయ్యి ఎకరాలకు సాగు నీటిని అందించడం జరిగిందన్నారు. మాజీ ఎమ్మెల్యే బుడ్డా వెంగళరెడ్డి ఈ చెరువును ఎత్తిపోతల పథకంగా మార్చి నీరందించేందుకు విశేషంగా కృషి చేశారన్నారు. గోదావరి నదిని కృష్ణాకు అనుసంధానం చేసిన విధంగా గోదావరిని పెన్నా నదికి అనుసంధానం చేసి సోమశిల ప్రాజెక్టుకు నీరు అందిస్తామన్నారు. సిద్ధాపురం ఎత్తిపోతల ద్వారా 25 వేల ఎకరాలకు సాగు నీరు, 12 గ్రామాలకు తాగునీరు అందే అవకాశాలు కల్పించినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో సూర్యారాధన కార్యక్రమాన్ని చేపడుతున్నామని, కర్నూలు జిల్లా, ఓర్వకల్లు మండలంలో వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను నిర్మించామని చెప్పారు. ప్రతి ఒక్కరూ వన సంరక్షణ చేపట్టాలన్నారు. సిద్ధాపురం ఎత్తిపోతలకు బుడ్డా వెంగళరెడ్డి ఎత్తిపోతల పథకంగా నామకరణం చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రంలో 40,817 చెరువులను అభివృద్ధి చేసి 5.75 లక్షల ఎకరాలకు నీటి భద్రత కల్పించామన్నారు. వర్షం నీరు వృథా కాకుండా 59,176 చెక్ డ్యామ్‌లు నిర్మించడంతోపాటు 6.32 లక్షల పంట కుంటలను తవ్వించి భూగర్భ జలాల సామర్థ్యాన్ని పెంచామన్నారు. గతేడాది 30 శాతం, ఈ ఏడాది 12 శాతం వర్షపాతం తక్కువగా నమోదైనప్పటికీ రాష్ట్రంలో 26.5 శాతం వృద్ధి రేటును సాధించడం అభివృద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణాలకు రూ.50 వేల కోట్లు ఖర్చు చేసినట్లు ఆయన తెలిపారు. ఇప్పటి వరకు 1.3 కోట్ల ఎకరాలకు నీటిని అందించామన్నారు. హంద్రి-నీవా నీటితో పత్తికొండ, ఆలూరు, డోన్ ప్రాంతాల్లోని చెరువులను నింపేందుకు ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించామన్నారు. జిల్లాలో సహజ ఖనిజ సంపద ఎక్కువగా ఉందన్నారు. కొలిమిగుండ్లను సిమెంట్ హబ్‌గా, నంద్యాలను సీడ్ హబ్‌గా, రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామని పేర్కొన్నారు. ఆత్మకూరు నగర పంచాయితీలో ముస్లిం మైనార్టీ బాలికలకు ఉర్దూ రెసిడెన్షియల్ పాఠశాలను ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. ఆత్మకూరుకు వెయ్యి గృహాలు మంజూరు చేస్తూ ఎన్టీఆర్ స్మృతివనం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. శ్రీశైలం క్షేత్ర అభివృద్ధికి కృషి చేస్తామని, ఓంకార క్షేత్రానికి రెండు వరుసల రహదారిని మంజూరు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్న చెంచు గిరిజనులకు గృహాలు, రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలు సక్రమంగా ఉండేందుకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి కేఈ క్రిష్ణమూర్తి, శాసన మండలి చైర్మన్ ఎన్ఎండీ ఫరూక్, పార్లమెంట్ సభ్యులు ఎస్పీవై రెడ్డి, బుట్టా రేణుక, జల వనరుల శాఖ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కాలవ శ్రీనివాసులు, భూమా అఖిల ప్రియ, ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖర రెడ్డి, బీవీ జయనాగేశ్వర రెడ్డి, బీసీ జనార్ధన్ రెడ్డి, మణిగాంధీ, భూమా బ్రహ్మానంద రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ మల్లెల రాజశేఖర్, ఎమ్మెల్సీ కేఈ ప్రభాకర్, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ మల్లికార్జున రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జిలు మీనాక్షి నాయుడు, కేఈ శ్యామ్‌బాబు, ఏరాసు ప్రతాప రెడ్డి, వీరభద్ర గౌడ్, గంగుల ప్రతాప రెడ్డి, లబ్బి వెంకట స్వామి, తుగ్గలి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.


'సినిమా' చూపిస్తున్నారు ....!

పండగల సమయాల్లో అధికంగా వసూళ్లు
అటకెక్కిన ఆకస్మిక తనిఖీలు..

విశాలాంధ్ర అమరావతి : సంక్రాంతికి పెద్ద హీరోల సినిమాలతో పాటు చిన్న హీరోల సినిమాలు థియేటర్లలో సందడి చేయనున్నాయి. ఏదో పండగకదా అని సినిమా కెళ్లామో అధిక ధరలతో బాదుడే. అంతమొత్తం చెల్లించి లోపలికి వెళ్లినా సౌకర్యాలు శూన్యం. విశ్రాంతి సమయంలో ఏమైనా తినాలన్నా.. తాగాలన్నా అధిక ధరలతో కళ్లు తిరగడం ఖాయం. వాహనం తీసుకెళ్తే జేబు గుల్ల అవుతుంది. ఇక మరుగుదొడ్ల వైపు వెళ్లకపోవడమే మంచిదనే రీతిలో అధ్వానంగా ఉన్నాయి. థియేటర్‌లోకి వెళ్లి అలా కూర్చున్నామో లేదో కాళ్ల పక్కనే ఆటలాడే మూషికాలు, చిరిగిన.. విరిగిన సీట్లు.. సినిమా చూడటం దేవుడెరుగు ఎప్పుడు బయట పడదామోనన్న పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో సగానికి పైగా థియేటర్ల పరిస్థితి. దీంతో అధికార యంత్రాంగం ఏం చేస్తున్నట్లని సామాన్యుడు వాపోవడం మామూలే. దీనిని నివారించే ఆకస్మిక తనిఖీలు, ధరల నియంత్రణ ఎక్కడ అమలవుతుంతో అధికారులకే తెలియాలి.

అధిక ధరలకు టికెట్ల విక్రయాలు

ఈ నేపథ్యంలో నిర్వహకులు వారి వ్యాపారం పెంచుకోవడం కోసం టిక్కెట్ల ధరలతో పాటు పార్కింగ్, క్యాంటీన్ ధరలు అమాంతంగా పెంచనున్నట్లు తెలుస్తోంది. టిక్కెట్‌పై రూ. 100 ఉంటే ప్రత్యేకంగా స్టాంప్‌తో రూ.150, 200లు ముద్ర వేసి ప్రేక్షకులను నిలువు దోపిడీ చేయడానికి నిర్వాహకులు సిద్ధమవుతున్నారు. కుటుంబంలో భార్య, భర్త ఇద్దరు పిల్లలతో సినిమాకు వెళితే పచ్చనోటు సరిపోవడం లేదు. విశ్రాంత సమయంలో క్యాంటీన్‌లో టీ, బిస్కెట్లు, సమోసాలు, శీతలపానీయాలు కొనుగోలు చేస్తే బయట లభిస్తున్న ధరలకు ఐదురేట్లు అధికంగా వసూళ్లు చేస్తున్నారు. థియేటర్లలో సైకిల్‌కు రూ.15, బైక్, కారు, ఆటోలకు రూ.30 వసూలు చేస్తున్నారు. పార్కింగ్ రుసుంలో



పేరిట ఇచ్చే రసీదులో ఎవరి సామాన్లలకు వారే బాధ్యులనే ఉంటుంది. థియేటర్ల అనుమతికి సంబంధించిన 5 విభాగాలకు నిరభ్యంతర పత్రం అందిస్తుండటంతో అధికారులు వాటికి అనుగుణంగా రెన్యువల్ చేస్తున్నామంటున్నారు. అధిక ధరల నియంత్రించేందుకు తనిఖీలు చేస్తున్నామని చెబుతున్నా , క్షేత్రస్థాయిలో మాత్రం అవి కన్పించడం లేదు. ఫిల్మ్ ఛాంబర్, ట్రాన్స్‌కో, ఆర్అండ్‌బీ, అగ్నిమాపక శాఖల నుంచి అనుమతులు తీసుకొస్తే రెవెన్యూ శాఖ థియేటర్లను నడుపుకునేందుకు అనుమతినిస్తుంది. భవన సామర్థ్యాన్ని తెలుపుతూ ఆర్అండ్‌బీ అభ్యంతరం లేదని ధృవీకరించాలి. అలాగే విద్యుత్ సరఫరాకు సంబంధించి అన్ని సక్రమంగా ఉన్నాయంటూ ట్రాన్స్‌కో, ఎలాంటి అగ్నిమాపక శాఖ, సినిమా ప్రదర్శించే తెరకు సంబంధించి ఫిల్మ్‌ఛాంబర్ అభ్యంతరం లేదని ధ్రువీకరిస్తే రెవెన్యూ శాఖ అనుమతిని రెన్యువల్ చేస్తుంది. ఆచరణలో మాత్రం చేయి తడిపారంటే అన్ని అనుమతులు ఇచ్చేస్తున్నారు. దీంతో ప్రేక్షకుడు తీవ్రంగా నష్టపోతున్నాడు.

ప్రాణాలు తీసిన సరదా

(మొదటిపేజీ తరువాయి)

గుమ్మి విజయశంకర్ (22) మెకానికల్ ఇంజనీరింగ్ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. కామవరపుకోట మండలం తడికలపూడి గ్రామానికి చెందిన కె.హరికృష్ణరాజు (21) మెకానికల్ ఇంజనీరింగ్ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. వీరు నలుగురు కలిసి తమ కళాశాల పక్కనే ఉన్న పట్లూరు చెరువు వద్ద గల తోటలో శనివారం రాత్రి వరకు విందు చేసుకున్నారు. అనంతరం సరదాగా పక్కనే ఉన్న చెరువులోకి దిగారు. ఇటీవలే చెరువులో పూడిక తీసినందున లోతు ఎక్కువగా ఉండడంతో ఈత రాక పరశరామ్, కోటసాయి, విజయశంకర్, హరికృష్ణరాజు నీటిలో మునిగి చనిపోయారు.

చీకటిగా ఉండడంతో ఈ విషయాన్ని గుర్తించలేదు. ఉదయం ఉదయం స్థానికులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. ఏలూరు డీఎస్పీ కె.ఈశ్వరరావు, ఏలూరు త్రీ టౌన్ సీఐ పి.శ్రీనివాసరావు, తమ సిబ్బందితో కలిసి ఘటనా స్థలికి చేరుకున్నారు. నీటి ఒడ్డున ఉన్న గుమ్మి విజయశంకర్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఫైర్ సిబ్బంది సహాయంతో మర బోటుతో వెతికి నీటిలో మునిగిపోయి ఉన్న మిగిలిన మూడు మృతదేహాలను ఒడ్డుకు చేర్చారు. మృతి చెందిన వారంతా రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులేనని ఘటనా స్థలంలో లభించిన ఐడీ కార్డులు, బ్యాగ్‌లు, పుస్తకాలు, ఇతర సామాగ్రిని బట్టి పోలీసులు ధృవీకరించారు. మృత దేహాలను ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


కోట సాయి


పరశురామ్


హరికృష్ణరాజు


జి.విజయ శంకర్



దళితులపై దాడుల్లో 4వ స్థానం సిగ్గుచేటు

దళిత హక్కుల పోరాట సమితి

విశాలాంధ్ర బ్యూరో- విజయవాడ : దళితులపై దాడుల్లో ఏపీ నాల్గవస్థానంలో వుండటంపై సీఎం చంద్రబాబు సిగ్గుపడాలని దళిత హక్కుల పోరాట సమితి అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు జే.ప్రభాకర్, కరవది సుబ్బారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ బుట్టి రాయప్ప సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో తీవ్రంగా విమర్శించారు. పాలకపక్షాల వివక్షత వల్లే దళితులపై దాడులు పెరుగుతున్నాయన్నారు. విశాఖపట్నం జిల్లా జెర్రిపోతుల గ్రామంలో దళిత మహిళని దుస్తులు చించివేసి గాయపరచటం, సాక్షాత్తూ మంత్రి భూమా అఖిల ప్రియ ప్రాతినిధ్యం వహించే కర్నూల్ జిల్లా నక్కల దిన్నెలో దళితులను వెలివేయటం పాలకుల నిరంకుశ వైఖరికి నిదర్శనమని వారు పేర్కొన్నారు. గ్రామంలో కరెంట్ కట్ చేసి,తాగు నీరు నిలిపివేసి,అంగడి సరుకులు అమ్మకుండా,పనులకు పిలవకుండా వెలివేసినా పాలకులకు చీమకుట్టినట్లు లేకపోవడం దుర్మార్గమని వారు ఆగ్రహం వ్యక్తంచేశారు. స్వాతంత్ర్యం వచ్చిన ఏడు దశాబ్దాల తర్వాత కూడా ఈవిధంగా జరగడం అగ్రకుల దురహంకారం సమాజంలో ఏవిధంగా వేళ్ళూనుకుందో స్పష్టమవుతోందన్నారు. ప్రజా సంక్షేమాన్ని, అభివృద్ధిని విస్మరించి దళితులపై దాడులను ప్రోత్సహించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పోటీ పడుతున్నాయన్నారు. ప్రధాని నరేంద్రమోడీ సొంత రాష్ట్రమైన గుజరాత్ లోని 'ఉనా' దమనకాండ, వేముల రోహిత్ ఆత్మబలిదానం,దేవరపల్లి భూ ఆక్రమణ,దొండపాడు రక్తపాతం తదితర అనేక ఘటనలు పాలకుల వివక్షతకి అద్దం పడుతోందన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో దళితులపై దాడుల విషయంలో ఏడువేల కేసులు నమోదై నాల్గవస్థానాన్ని దక్కించుకుందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం కనీసం అరెస్టులు సైతం చేయకపోవడం, దళితులని జన్మభూమి సభలకు రాకుండా అడ్డుకోవడం అమానుషమన్నారు. అమరావతి రాజధాని పరిధిలోని 29 గ్రామాల్లో దళితుల భూములు, నివాసాలు తీసుకొని వారిని నిరాశ్రయులుగా మిగుల్చుతున్నారని, పెత్తందారీ వ్యవస్థ రాజ్యమేలుతోందని విమర్శించారు. దళితులపై జరుగుతున్న దాడులని ఎదుర్కునేందుకు తాము ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని, వామపక్షాలు,ఇతర ప్రజాసంఘాలతో కలిసి పెద్ద ఎత్తున పోరాడేందుకు సమాయత్తం కావాలని వారు పిలుపునిచ్చారు.

సంక్రాంతికి ముందే బయలుదేరండి

- టోల్‌ప్లాజాల వద్ద ట్రాఫిక్ సమస్య
- గంటల తరబడి ప్లాజాల వద్దే నిరీక్షణ
- పండుగ రోజుల్లో సగటున 15,000 వాహనాలు
- ప్రత్యామ్నాయం చూపని ఎన్‌హెచ్‌ఏఐ



విశాలాంధ్రబ్యూరో - అమరావతి : సంక్రాంతి పండుగకు సొంతూరుకు రావాలనుకుంటున్నారా...అయితే పండక్కి కనీసం రెండు మూడు రోజులు ముందు బయలుదేరి రావటం మంచిది. ఎందుకంటే రాష్ట్రంలో జాతీయ రహదారులపై ఉన్న టోల్‌ప్లాజాల వద్ద ఎప్పటి మాదిరిగా విపరీతమైన రద్దీ నెలకొనే అవకాశం ఉంది. రాష్ట్రానికి చెందిన వారు హైదరాబాద్ ప్రాంతంలో అధికంగా ఉన్నారు. సంక్రాంతి కోసం భోగి రోజుగానీ, అంతకంటే ఒక్క రోజు ముందుగానో అందరూ సొంత వాహనాలు, బస్సులలో బయలుదేరి వస్తుంటారు. ఇదే టోల్‌ప్లాజాల వద్ద ట్రాఫిక్ జామ్‌కు దారితీస్తోంది. వేల సంఖ్యలో వాహనాలు టోల్‌ప్లాజాల వద్ద బారులు తీరుతాయి. కృష్ణా, గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన వారు హైదరాబాద్, విశాఖపట్నం, కోల్‌కతా, ఒడిషా ప్రాంతాలతోపాటు విదేశాల్లోనూ ఉన్నారు. విదేశాల్లోని వారు కొందరు హైదరాబాద్ మీదగా సొంతూళ్లకు వచ్చేందుకు ప్లాన్ చేసుకున్నారు. అక్కడ నుంచి సొంత వాహనాల్లో వస్తే ట్రాఫిక్ చిక్కుల్లో పడటం ఖాయం. విజయవాడ - హైదరాబాద్ 65వ నంబర్ జాతీయ రహదారిపై కీసర, చిల్లకల్లు, ఛేతేపల్లి, పంతంగి టోల్ ప్లాజాలు ఉన్నాయి. అలాగే విజయవాడ - కోల్‌కతా 16వ నంబర్ జాతీయ రహదారిపై పొట్టిపాడు, ఏలూరు, తణుకు, నక్కపల్లి తదితర ప్రాంతాల్లో టోల్‌ప్లాజాలు ఉన్నాయి. పండక్కి ఊరెళ్లు వారికి ఏటా టోల్ కష్టాలు తప్పటంలేదు. సంక్రాంత పండుగ సమయంలో ప్లాజాల వద్ద ట్రాఫిక్ సమస్యను అధిగమిం చేందుకు కనీసం స్థానిక పోలీసులతో కలిసి సమస్య పరిష్కారానికి టోల్‌ప్లాజా నిర్వాహకులు ఎలాంటి ఏర్పాట్లు చేయటంలేదు. ఒక్కసారిగా ట్రాఫిక్ స్తంభిస్తే సాధారణ ప్రజలతోపాటు పోలీసులు కూడా నానా అగచాట్లకు గురవు తున్నారు. ట్రాఫిక్ రద్దీన క్రమబద్ధీకరించేందుకు పోలీసులంతా టోల్‌ప్లాజాల వద్దే విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి కూడా ఉంది.

ఏ రూపంలో వచ్చిన చిక్కులే

బస్సెక్కినా, సొంత వాహనాల్లో వెళ్లినా టోల్ గేట్‌ల వద్ద ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కోవాల్సిందే. పండక్కి అందరూ ఒకేసారి రావటం వల్లే ఈ సమస్య ఉత్పన్నం అవుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు. సాధారణంగా రాష్ట్రంలోని టోల్‌ప్లాజాల వద్ద రోజుకు సగటున మూడు వేల వాహనాలు క్రాస్ అవుతుంటాయి. వారాంతాలు, సెలవు రోజుల్లో మరో రెండు వేలు పెరుగుతుంటాయి. ఇక సంక్రాంతి సమయంలో టోల్‌ప్లాట్‌లను దాటే వాహనాల సంఖ్య 10 వేల నుంచి 15 వేల వరకు ఉంటాయని అంచనా వేస్తున్నారు. దీంతో విపరీతమైన ట్రాఫిక్ రద్దీ నెలకొం టోంది. ఏటా ఈ సమస్య ఉత్పన్నమవుతున్నా, అధిగమిం చేందుకు జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ)గానీ, టోల్‌ప్లాజా నిర్వాహకులుగానీ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయటంలేదు. భోగీ పండుగ ముందు రోజు నుంచే వాహనాల రద్దీ పెరుగుతుంది. కాని ఇందుకు తగ్గట్టుగా ఎలాంటి ఏర్పాట్లు లేకపోవటం శోచనీయం. విజయవాడ సమీపంలోని పొట్టిపాడు, ఏలూరు సమీపంలోని కలపర్రు టోల్‌ప్లాజాలు, చిల్లకల్లు, కీసర టోల్‌గేట్‌ల వద్ద ట్రాఫిక్ కష్టాలు అన్నీ, ఇన్నీ కాదు. గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించటంతో పిల్లలతో సొంతూళ్లకు బయలుదేరిన వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కొన్ని సందర్భాలలో తాగునీరు కూడా అందని పరిస్థితి నెలకొంటోంది.

కంప్యూటర్లు మొరాయిస్తే అంతే...

టోల్‌ప్లాజాల్లో ఒక వైపున ట్రాఫిక్ జామ్ నెలకొంటే, మరోవైపు ప్లాజాల్లోని కంప్యూటర్లు మొరాయించటం మరిన్ని ఇబ్బందులకు దారితీస్తోంది. సంక్రాంతి సమయంలో ఒత్తిడి పెరిగితే ఈ ఇబ్బందులు మరింత పెరిగే అవకాశం ఉంది. సంక్రాంతి పండుగకు వచ్చే ముందు, వెళ్లేముందు కూడా టోల్‌ప్లాజాల వద్ద వాహనదారులు నానా బాధలు పడుతున్నారు. వాహనదారులతోపాటు ప్లాజా ప్రాంతాల్లోని గ్రామస్తులకు కూడా ఈ ఇక్కట్లు తప్పటంలేదు. గత ఏడాది టోల్‌ప్లాజాలు దాటటానికి కనీసం రెండు గంటల సమయం పట్టిందంటే ఏమేర ట్రాఫిక్ స్తంభించిందో అర్థం చేసుకోవచ్చు. చిల్లకల్లు, కీసర, ఏలూరు టోల్‌ప్లాజాల వద్ద అయితే అరగంట నుంచి గంట వరకు కూడా ట్రాఫిక్ సమస్య తీరకపోవటం గమనార్హం. ఎన్‌హెచ్‌ఏఐ సూచించిన సెమీ ఆటోమెటిక్ విధానాన్ని అనుసరిస్తే గంటకు 240 వాహనాలకు మాత్రమే రసీదు ఇవ్వగలరు. అదే ఎలక్ట్రానిక్ టోల్ వసూలు (ఈటీసీ) వదిధానంలో గంటకు 1,200 వాహనాలు వెళతాయి. ఈటీసీపై వాహనదారులకు అవగాహన కల్పిస్తే తప్ప టోల్‌ప్లాజాల వద్ద సమయం వృధాకాదు. అయితే ఈ విషయంపై అటు ఎన్‌హెచ్‌ఏఐగానీ, టోల్‌ప్లాజా నిర్వాహకులుగానీ ఏమాత్రం దృష్టి పెట్టకపోవటం వల్లే ఏటా టోల్‌వద్ద ట్రాఫిక్ కష్టాలు తప్పటంలేదని వాహనదారులు వాపోతున్నారు. సంక్రాంతికి ఊళ్లకు వచ్చేందుకు మరో వారం రోజుల సమయం ఉంది. ఈ లోగా టోల్‌ప్లాజాల వద్ద ట్రాఫిక్ కష్టాలు తీర్చేందుకు ప్రభుత్వంగానీ, ఎన్‌హెచ్‌ఏఐగానీ ఏదైనా ప్రత్యామ్నాయం ఆలోచించాలని వాహనదారులు కోరుతున్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శరద్‌యాదవ్

అభద్రతా భావంలో బడుగువర్గాలు

విశాలాంధ్ర-విశాఖ : కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం దళితులు, రైతులు, ముస్లింలపై దాడులకు దిగుతోందని, దీంతో వీరంతా అభద్రతాభావంతో బతుకునీడుస్తున్నారని కేంద్ర మాజీ మంత్రి, జనతాదళ్ సీనియర్ నేత శరద్‌యాదవ్ అభిప్రాయపడ్డారు. ఆదివారం విశాఖలోని ఉడా చిల్డ్రన్ థియేటర్‌లో రాజ్యాంగం రాసిన ప్రజాస్వామ్యం పరిరక్షణ అనే అంశంపై జరిగిన పి శివశంకర్ స్మారక ఉపన్యాస కార్యక్రమానికి శరద్‌యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మోడీ ప్రభుత్వం రాజ్యాంగ పరిస్థితులకు విరుద్ధంగా నడుస్తోందన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా బడుగు, బలహీనవర్గాలు నిత్యం భయంతో గడుపుతున్నాయన్నారు. ఇలాంటి ప్రభుత్వం దేశ ప్రజలకు సరైంది కాదన్నారు. గతంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు మాతో కలిసి పనిచేశారని, కాని ఈవేళ మోడీతో జతకట్టి ఎంత గొప్పగా పాలన చేస్తున్నారో అందరికి తెలిసిందేనన్నారు. కేంద్ర న్యాయశాఖా మంత్రిగా శివశంకర్ అనేక సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. సాధారణ స్థాయి నుండి కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగిన ఆయన జీవితాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. యూపీఎస్సీ మాజీ సభ్యులు ఆచార్య కెఎస్ చలం మాట్లాడుతూ వెనుకబడిన కులాల్లో ఐక్యత లేకపోవడం వల్ల దేశంలో రాజకీయాలు అగ్రకులాల చుట్టే తిరుగుతున్నాయన్నారు. శివశంకర్‌ను స్మరించుకోవాలంటే బడుగు, బలహీనవర్గాలు ఏకమై రాజ్యాధికారంలోకి వచ్చి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. దేశంలో ద్విజ కులాలతో పాటు అగ్రకులాల చుట్టూ రాజ్యాధికారం తిరుగుతున్నదన్నారు. ఎన్ఎండీఏ పూర్వ వైస్‌చైర్మన్ మర్రి శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ ఉభయ రాష్ట్రాల గవర్నర్ ఆ పదవిని అపహాస్యం చేసేవిధంగా ప్రవర్తిస్తున్నారన్నారు. రెండు రాష్ట్రాల్లో ప్రభుత్వానికి అనుకూలంగా నడుస్తూ ప్రజల సమస్యలను పట్టించుకోవడంలేదన్నారు. కాంగ్రెస్ నాయకులు బొలిశెట్టి సత్యనారాయణ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జాతీయ నాయకులు వీవీ రామారావు, శివశంకర్ సతీమణి డాక్టర్ పి లక్ష్మీబాయి, కమర్షియల్ టాక్స్ జాయింట్ కమిషనర్ టి. శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కోడెల, కామినేని తదితరులు

ఎయిమ్స్ తాత్కాలిక పరిపాలనా భవనానికి భూమిపూజ

- రూ.600 లక్షలతో వసతి, తరగతి గదులు
- పూర్వ విద్యార్థుల సహకారంతో జిమ్ ఏర్పాటు
- ప్రారంభోత్సవంలో అసెంబ్లీ స్పీకర్ కోడెల, మంత్రి కామినేని

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైద్య విద్యార్థుల కోసం ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఏఐఎమ్ఎస్) తాత్కాలిక పరిపా లనా భవనం, తరగతిగదులను అందుబాటు లోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని అసెంబ్లీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు వెల్లడించారు.

ఆదివారం విజయవాడ సిద్ధార్థ మెడికల్ కళాశాల ప్రాంగణంలో రూ. 600 లక్షల వ్యయంతో నిర్మించనున్న తాత్కాలిక పరిపాలనా భవనం, పూర్వ విద్యార్థుల సహకారంతో ఏర్పాటుచేసిన జిమ్ ప్రారం భోత్సవం, తరగతి గదుల శంకుస్థాపన కార్యక్ర మాల్ని నిర్వహించారు. రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కోడెల మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ వైద్య విద్యార్థులకు ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలోనే అత్యాధునిక సదుపా యలను కల్పిస్తోందన్నారు. రూ.90 కోట్లతో ప్రభుత్వాస్పత్రిని అభివృద్ధి చేశామని, త్వరలోనే ఎయిమ్స్‌కు చెందిన 50 మంది వైద్య విద్యార్థులకు బోధించేందుకు తరగతి గదులను, పరిపాలనా భవనాలను సిద్దార్థ కళాశాలలో ఏర్పాటుకు మంత్రి కామినేని చర్యల్ని అభినందించారు. 1981లో ప్రారంభమైన సిద్ధార్థ మెడికల్‌కాలేజీ ప్రాంగణంలో ప్రస్తుతం పీజీ, గ్రాడ్యుయేషన్ మెడికల్ సీట్లు 250 అందుబాటులోకి తీసుకొస్తున్నామని చెప్పారు.

హాస్టల్ నుంచి కళాశాలకు ప్రత్యేక బస్సు: మంత్రి కామినేని

వైద్యారోగ్య శాఖా మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ వైద్య కళాశాలలో చదివే విద్యార్థుల కోసం హాస్టలు నుంచి కళాశాలకు చేర్చేందుకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మూడున్న రేళ్ల క్రితం ప్రభుత్వాస్పత్రి నిర్వహణ లేమితోఉందని, తమ హయంలో ఇప్పటివరకూ రూ.90 కోట్లు వెచ్చించి ఆస్పత్రిని అభివృద్ధి చేశామన్నారు. త్వరలో రూ.150 కోట్లతో నిర్మించిన సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రి సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.ఈ కార్యక్ర మంలో పూర్వ వైద్య విద్యార్థులు, బోధనా సిబ్బంది, డాక్టర్లు, సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ఎస్ శశాంక్ పాల్గొన్నారు.

మత్స్యకారులకు సీఎం క్షమాపణ చెప్పాలి

మాజీ మంత్రి మోపిదేవి వెంకట రమణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : మత్స్యకారులను ఘోరంగా అవమానించిన సీఎం చంద్రబాబు తక్షణమే వారికి క్షమాపణ చెప్పాలని మాజీ మంత్రి, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మోపిదేవి వెంకట రమణ డిమాండు చేశారు. విజయవాడ వైసీపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశంలో గుజారాత్, గోవా రాష్ట్రాలలో మత్స్యకారులు ఎస్టీలుగాను, ఉత్తరప్రదేశ్, వెస్ట్ బెంగాల్, ఢిల్లీ, మధ్యప్రదేశ్, ఒరిస్సా, మణిపాల్, నాగాలాండ్, అరుణాచల్‌ప్రదేశ్, త్రిపుర, మేఘాలయ రాష్ట్రాలలో ఎస్సీలుగాను కొనసాగుతున్నారని వివరించారు. తమిళనాడు, పాండిచ్చేరిలలోనే బీసీలుగా పరిగణలో ఉన్నారని పేర్కొన్నారు. 1970లోనే మత్స్యకారులను దేశవ్యాప్తంగా ఎస్టీలుగా గుర్తించేందుకు ప్రయత్నించారని చెప్పారు. 1972లో అప్పటి సీఎం కాసు బ్రహ్మానందరెడ్డి హయాంలో అసెంబ్లీలో ఎస్టీలను మత్స్యకారులుగా చేర్చాలంటూ తీర్మానించి పార్లమెంటుకు పంపారని, సాంకేతిక కారణాలతో ఆ బిల్లు వెనక్కి వచ్చిందని గుర్తుచేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో చంద్రబాబు శ్రీకాకుళంలో పర్య టించిన సమయంలో మత్స్యకారులను ఎస్టీలుగా పరిగణిస్తానని బహిరంగ హామీ ఇచ్చారని వెల్లడించారు. కాపులను బీసీలలోను, బోయ,వాల్మీకీలను ఎస్టీలలో చేరుస్తూ ఇటీవల అసెంబ్లీలో తీర్మానించిన సమయంలో మత్స్యకారులను విస్మరించారని వివరించారు. దీంతో మత్స్యకారులతో సీఎం చంద్రబాబును కలిసి ఎస్టీలలో చేర్చాలని కోరారని , వారిని అవమానించేలా సీఎం వ్యాఖ్యానించడం దారుణమన్నారు. రాష్ట్రంలో అధికారం నిలబెట్టుకు నేందుకుగాను కులాల మధ్య చిచ్చు రేపి చోద్యం చూస్తున్న చంద్రబాబుకు వచ్చే ఎన్నికల్లో ప్రజ లు తగిన బుద్ధిచెబుతారని ప్రకటించారు. ఈ సమావేశంలో వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పైలా సోమినాయుడు పాల్గొన్నారు.

కదిలొచ్చిన కార్మికలోకం

- ఉత్సాహంగా సాగిన ఏఐటీయూసీ భారీ ర్యాలీ
- పెద్ద ఎత్తున పాల్గొన్న కార్మికవర్గం
- ఎర్రజెండాలతో నిండిపోయిన జాతీయ రహదారి



ఏఐటీయూసీ కార్యాలయ ప్రారంభోత్సవ ర్యాలీలో పెద్ద ఎత్తున కార్మికులు

విశాలాంధ్రప్రతినిధి-విజయవాడ : 'ఏఐటీయూసీ జిందాబాద్.. క్యాపిటలిజం డౌన్‌డౌన్.. జిందాబాద్ కమ్యూనిజం.. కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి..' అంటూ పెద్దపెట్టున కార్మికులు చేసిన నినాదాలతో విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి మార్మోగింది. ఎర్ర జెండాలతో జాతీయ రహదారి నిండిపోయింది. గొల్లపూడిలో నూతనంగా నిర్మించిన ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయ ప్రారంభోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గొల్లపూడి వన్ సెంటర్ నుంచి మైలురాయి సెంటర్ సమీపంలోని జోశ్యభట్ల సత్యనారాయణ భవన్ (ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయం) వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి ఏఐటీయూసీ అనుబంధ సంఘాల కార్మికులు తరలివచ్చి ర్యాలీలో పాల్గొన్నారు. సుమారు కిలో మీటరు మేర సాగిన ఈ ర్యాలీలో కార్మికులు ఎర్ర జెండాలు చేతబూని పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ముందుకుసాగారు. ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్, ఉపాధ్యక్షుడు డి.ఆదినారాయణ, రాష్ట్ర అధ్యక్షుడు చలసాని రామారావు, ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, ఉప ప్రధాన కార్యదర్శి ఆర్.రవీంద్రనాథ్, కృష్ణాజిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ కోటేశ్వరరావు, జరబన నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు పల్లా సూర్యారావు తదితరులు ర్యాలీలో పాల్గొని కార్మికుల్లో ఉత్సాహం నింపారు. వీరితోపాటు ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్, ముఠా కార్మిక సంఘం, విద్యుత్, భవన నిర్మాణ, ముఠా, మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ వంటి అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పోలవరం, ప్రత్యేక హోదాపై రాజీలేని పోరు

- పుదుచ్చేరి సీఎం నారాయణస్వామి
- కాంగ్రెస్ మహాపాదయాత్ర ప్రారంభం



విశాలాంధ్ర- రాజమహేంద్రవరం : పోలవరం ప్రాజెక్టు, ప్రత్యేక హోదాతో సహా విభజన హామీల అమలు కోసం కాంగ్రెస్‌పార్టీ రాజీలేని పోరాటం కొనసాగిస్తుందని పుదుచ్చేరి ముఖ్యమంత్రి నారాయణస్వామి పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టును త్వరగా పూర్తిచేయాలనే డిమాండుతో ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన మహాపాదయాత్రను ఆయన ఆదివారం ఉదయం ధవళేశ్వరంలో ప్రారంభిం చారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పోలవరం ప్రాజెక్టు జీవనాడి అని, ప్రాజెక్టుకు వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రాణం పోశారని, రాష్ట్ర విభజన నేపథ్యంలో సోనియా గాంధీ, మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌ల వలనే పోలవరానికి జాతీయ ప్రాజెక్టు హోదా దక్కిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్ద నటుడని, పబ్లిసిటీపైనే ఆంధ్రప్రదేశ్‌లో పాలన సాగుతున్నదని విమర్శించారు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక హోదా లాగే పోలవరం ప్రాజెక్టును కూడా కేంద్రానికి తాకట్టు పెడతారనే అనుమానం కలుగుతున్న దన్నారు. పోలవరం ప్రాజెక్టు కాంగ్రెస్ మానస పుత్రిక అని, ఆ ప్రాజెక్టును సాధించుకు తీరుతామన్నారు. పోలవరం విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోబూచులాడుతున్నాయని, జరుగుతున్న పనులను బట్టి చూస్తే ఈ ప్రాజెక్టు ఇప్పట్లో పూర్తయ్యే పరిస్థితి కనబడటం లేదన్నారు. ప్రాజెక్టు సాధనకు రైతుల భాగస్వామ్యంతో ఈ మహాపాదయాత్ర చేపట్టామన్నారు. పాదయాత్రకు మాజీ ఎంపీలు ఉండవల్లి అరుణ్‌కుమార్, జీవీ హర్షకుమార్ సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు కేవీపీ రామచంద్రరావు, కేంద్ర మాజీ మంత్రులు ఎంఎం పల్లంరాజు, జేడీ శీలం, పనబాక లక్ష్మి, కనుమూరి బాపిరాజు, మాజీ మంత్రి వట్టి వసంతకుమార్, శైలజానాథ్, కొండ్రు మురళి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పంతం నానాజీ, పీసీసీ ప్రధాన కార్యదర్శులు గిడుగు రుద్రరాజు, ఎస్ఎన్ రాజా, నగర అధ్యక్షులు ఎన్వీ శ్రీనివాస్, పీసీసీ అధికార ప్రతినిధి బాలేపల్లి మురళీధర్, రూరల్ ఇన్‌చార్జి రాయుడు రాజవల్లి, కార్పొరేటర్ రాయుడు సతీష్, ఆకుల భాగ్య సూర్య లక్ష్మి, పలువురు రాష్ట్ర నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



సరిహద్దు వెంబడి 14 వేల బంకర్లు

జమ్మూ : జమ్మూ డివిజన్‌లో పాకిస్తాన్ దాడులు ఎదుర్కొంటున్న సరిహద్దు నివాసితుల కోసం నియంత్రణ రేఖ(ఎల్‌వోసీ), అంతర్జాతీయ సరిహద్దు(ఐబీ) వెంబడి 14 వేల కమ్యూనిటీ, వ్యక్తిగత బంకర్ల నిర్మాణం చేపట్టనున్నట్లు అధికారులు ఆదివారం తెలిపారు. రాజౌరీ, పూంచ్ జిల్లాల్లో ఎల్‌వోసీ వెంబడి 7,298 బంకర్లను, జమ్మూ, కతువా, సాంబ జిల్లాలలోని అంత ర్జాతీయ సరిహద్దు వెంబడి 7,162 అండర్ గ్రౌండ్ బంకర్లను నిర్మించనున్నట్లు వారు చెప్పారు. రూ. 415,73 కోట్ల వ్యయంతో 14,460 కమ్యూనిటీ, వ్యక్తిగత బంకర్ల నిర్మాణాన్ని కేంద్ర ప్రభుత్వం ఇటీవల మంజూరు చేసింది. ఇందులో 13,029 వ్యక్తి గత బంకర్లు, 1,431 కమ్యూనిటీ బంకర్లను నిర్మించనున్నట్లు అధి కారు లు వివరించారు. 160 చదరపు అడుగులలో 8 మంది కోసం వ్యక్తిగత బంకర్, 800 చదరపు అడుగుల విస్తీర్ణంలో 40 మందికి కమ్యూనిటీ బంకర్ నిర్మాణం ఉంటుందని పేర్కొన్నారు. పాకిస్తాన్‌తో 3,323 కిలోమీటర్ల పొడవున సరిహద్దును భారత్ కలిగి ఉంది.



పాకాల సభలో ప్రసంగిస్తున్న జగన్

మోసం చేయడమే చంద్రబాబు నైజం

విశాలాంధ్ర - పాకాల : మోసం చేయడమే చంద్రబాబు నైజమని వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి వెల్లడించారు. ప్రజాసంకల్ప యాత్ర ఆదివారం పాకాల మండలంలోని దామలచెరువు మీదుగా సాగింది. ఈ సందర్భంగా స్థానిక ఉన్నత పాఠశాల సమీపంలోని గేట్ వద్ద రచ్చబండను నిర్వహించారు. ఈ సభలో జగన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు మోసం చేయడం, వెన్ను పోటు పొడవడం వెన్నతో పెట్టిన విద్య అని, 2014 ఎన్నికల్లో రైతు రుణాలు, డ్వాక్రా మహిళల రుణాలు మాఫీ చేస్తామని, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి హామీ ఇచ్చి మోసం చేశారని విమర్శించారు. పస్తుతం రాష్ట్రంలో అవినీతి పాలన సాగుతోందని చివరకు మరుగుదొడ్ల నిర్మాణంలోనూ అవినీతి జరుగుతోందన్నారు. స్వంత గ్రామంలో సీఎం చదువుకున్న పాఠశాల శిధిలావస్తకు చేరినా దానిని పట్టించుకోలేదని అటువంటి వ్యక్తి రాష్ట్రాన్ని సింగపూర్‌లా తయారు చేస్తానని చెప్పడం హాస్యాస్పద మన్నారు. స్వంత జిల్లాలో ప్రతి ఏటా ఏనుగులు పంటను నష్టం చేస్తున్నా ఒక్క ఏడాది కూడా నష్ట పరిహారం ఇవ్వలేదన్నారు. విశ్వసనీయత కలిగిన రాజకీయాలు రావాలంటే వచ్చే ఎన్నికల్లో వైసీపీని గెలిపించాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాల డెయిరీ, సహకార చక్కర ఫ్యాక్టరీని తెరిపించాలని రైతు నాయకులు కోరగా తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే తెరిపిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిలు విజయసాయిరెడ్డి, మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, రోజా, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నాయకులు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, నంగా బాబురెడ్డి, మునీర్, సురేష్, హసీనా, పద్మజ, వనజ పాల్గొన్నారు.

వేదగిరి రాంబాబు - సమగ్ర వ్యక్తిత్వం

కాటూరు రవీంద్రత్రివిక్రమ్
✆ : 9849568901

రచయితగా, కథానిక ఉద్యమ ప్రధాననేతగా, మరుగునపడిన ఎందరో పూర్వ రచయితల రచనల్ని పాఠకులకు పరిచయం చేసిన సాహిత్య ప్రేమికుడిగా, స్వంతంగా తమ రచనల్ని ప్రచురించుకోలేని రచయితల కథానికలకు పుస్తకరూపం కల్పించిన సన్మిత్రునిగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగానే వేదగిరి రాంబాబు అందరికీ తెలుసు. వేదగిరిలో మరొక కోణం ఉంది. అది మానవీయ కోణం.

సాహిత్యంలోని ప్రధాన ప్రక్రియల్లో సమర్థవంతంగా కృషిచేసిన వారిది సమగ్ర సాహిత్య వ్యక్తిత్వంగా చెప్పవచ్చు. అయితే రచనలు గొప్పగా ఉంటే చాలదు. రచయిత కూడా గొప్ప వ్యక్తిగా ఉన్నప్పుడు మాత్రమే అతడిది సమగ్ర వ్యక్తిత్వం అవుతుంది. మానవత్వంలేని వ్యక్తికి విలువేముంటుంది? అతడిది వ్యక్తిత్వమెలా అవుతుంది?

సాహిత్యానికి రచయిత వ్యక్తిత్వానికి సంబంధం ఉండనవసరంలేదని కొందరు, ఉండాలని కొందరు వాదిస్తుంటారు. రచనలు రచయిత మానసిక పుత్రికలు. జీవిత పరిచ్ఛేదాల అనుభవాలు, అనుభూతుల ప్రభావం రచనల మీద అనివార్యంగా ఉంటుంది. ఆ ప్రభావాన్ని ఏ మేరకు వినియోగించుకోవడమన్నది రచయిత ప్రజ్ఞమీద ఆధారపడి ఉంటుంది. రాంబాబు బహుమతి కథానిక. 'సముద్రంలో' ఇలాంటి ప్రజ్ఞకనిపిస్తుంది. ఒక ఇతివృత్తాన్ని ఎంపిక చేయడంలో ఎంత ప్రతిభ చూపాలో, దానిని కథానికగా రూపొందించడంలో అంతకుమించిన ప్రతిభ చూపాల్సి ఉంటుంది. లేకపోతే ఏదో ఒక అవయవలోపం కథానికలో కొట్టవచ్చినట్టు కనిపిస్తుంది.

రాంబాబు ఇలాంటి పొరబాట్లు చేసిన కథానికలు మనకి కనిపించవు. కొన్ని ఇతివృత్తాలు స్ఫురిస్తాయి. మరి కొన్ని మనసులో ఉద్భవిస్తాయి. ఇవి రెండూ కథానిక నిర్మాణానికి ఉపకరిస్తాయి. కథానికని పరిశీలనగా చూసినప్పుడు విమర్శకులు దాని జన్మరహస్యాన్ని పసిగట్టగలుగుతారు. ఆ కథానిక పుత్తడి, ఇత్తడిలో ఏ కోవకి చెందుతుందో నిగ్గుతేల్చగలుగుతారు.

సామాన్య అంశాలతో అసాధారణంగా కథానికను చెప్పడం, అసాధారణ అంశాలతో అద్భుతంగా చెప్పడం అన్నది రచనా నైపుణ్యానికి సంబంధించిన అంశం. తనదంటూ ఒక 'సొంతముద్ర' (రావి శాస్త్రి, బీనాదేవి, చలం మాదిరి) ఏర్పరచుకున్నప్పుడు రచయిత 'జీవన సాఫల్యాన్ని' సాధించినట్లవుతుంది.

వేదగిరి రాంబాబు ఈ ఘనత సాధించాడు. ఇప్పుడు రాంబాబు గురించి సాహిత్య ప్రపంచంలో తెలియని వారులేరంటే అతిశయోక్తి కాదు. కేవలం తను ఎదగడం లక్ష్యం చేసుకోకుండా, తనతోబాటు ఇతర సాహిత్య కృషీవలురు కూడా కృషిఫలాలు పొందడానికి సహృదయంతో ప్రోత్సహించి, వారికి సముచిత గౌరవం, అవార్డులు, రివార్డులు పొందడానికి అదృశ్యహస్తంతో సహాయపడిన సంఘటనలు చాలా ఉన్నాయి. ఆ విధంగా పెద్దలతో తనకుగల పరిచయాలు, పరపతిని తనకోసంగాక పరులకోసం ఉపయోగించిన ఉపకారి. ఇది రాంబాబు ఉన్నత వ్యక్తిత్వానికి ఉదాహరణ. గొప్పదనం, గౌరవం, ఆదిశంకరులు అన్నట్టు 'ధనజనయౌవన' గర్వంతో కలుగదు. నిస్వార్థబుద్ధితో పరోపకారం చేసినప్పుడే ఇహపరాల ఘనతలో సమోదవుతుంది. భగవంతుని పూజించకపోయినా, మానవత్వాన్ని దేశలక్షణంగా 'పరోపకారమిదంశరీరమ్' అన్నట్లు జీవించేవారిని భగవంతుడు ప్రేమిస్తాడు. రాంబాబు తన దేహశక్తికి ఎన్నోరెట్లు కేవలం ఆత్మశక్తితో, అనారోగ్యాన్ని పట్టించుకోకుండా అక్షరమే శ్వాసగా చేస్తున్న కృషి అమోఘం. అనితరసాధ్యం.

ఈ విషయంలో రాంబాబుని గురజాడతో పోల్చవచ్చు. రవీంద్రనాథ టాగూర్‌తో పోల్చవచ్చు. వీరిద్దరూ ఆరోగ్యం సహకరించకపోయినా ఆఖరిక్షణం వరకూ అక్షర తపస్సు ఆపలేదు. ఈ లక్షణమే వారిని సాహిత్య ప్రపంచంలో చిరంజీవుల్ని చేసింది. రాంబాబుది కూడ శాశ్వతకీర్తి. గురజాడని తెలుగువారి గుండెల్లో పునర్జీవింపజేయడానికి రాంబాబు చెయ్యని కృషిలేదు. కాలవాహినిలో కనుమరుగవుతున్న గురజాడ గుర్తుల్ని చెరిగిపోకుండా, చెదరనీకుండా కాపాడిన ఘనత వేదగిరి రాంబాబుది. శిథిలమైపోతున్న గురజాడ గృహానికి తన స్వంత ధనంతో మెరుగులుదిద్దించి, తగిన వసతులు కల్పించి, ఒక సాహిత్యయుగ పురుషునికి తనతోబాటు తెలుగుజాతి యావత్తు, అధికారగణంతో సహా నివాళులు శాశ్వత ప్రాతిపదికమీద అర్పించేందుకు రాంబాబు కారణభూతుడయ్యాడు. గురజాడ గృహాన్ని స్మారకచిహ్నంగా మార్చడంలో రాంబాబు దీక్ష, దక్షత, అవిశ్రాంత కృషీ ఉన్నాయి. ఇది అందరూ ప్రత్యక్షంగా చూసిన సత్యమే. గురజాడ గృహంలోని గ్రంథాలయానికి పుస్తకాలు కూడా బహూకరించాడు.



రాంబాబు గురజాడ సాహిత్య వ్యక్తిత్వాన్ని, సంస్కరణాతత్వాన్ని ఎంత ప్రేమించాడో కథక చక్రవర్తి శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి సాహిత్యాన్ని, ఆయన నిరాడంబర సాహిత్య దీక్షను అంతే ప్రేమించాడు. దీనికి రుజువులుగా, ఆ మహా రచయితకి శాశ్వత స్మృతి చిహ్నంగా, రెండు లక్షల రూపాయలకు పైగా తన ధనాన్ని వెచ్చించి, రాజమండ్రిలోని ప్రముఖ ప్రదేశంలో శ్రీపాదవారి విగ్రహాన్ని ప్రతిష్టించాడు. దీనికోసం వారంవారం రాజమండ్రి వెళ్లి, స్వీయపర్యవేక్షణలో పునాదుల నుండీ పైభాగం వరకు పటిష్టంగా నిర్మింపజేశాడు. విగ్రహ ఆవిష్కరణ తర్వాత ఒకరోజంతా సాహిత్య సదస్సు నిర్వహించాడు. ఆరోజు జరిగిన వేడుకల్లో ప్రముఖులెందరో పాల్గొన్నారు. రాంబాబు కృషిని మనసారా అభినందించారు. మరుసటి సంవత్సరం శ్రీపాదవారి జయంతిని పురస్కరించుకొని ఆయన శిలావిగ్రహానికి రక్షణగా పైకప్పును ఏర్పాటు చేశాడు. రాజమండ్రి పురప్రజలను, పురపాలక మండలిని తన కృషిలో భాగస్వాములను చేస్తూ ఇది రాజమండ్రి పురప్రజలకు అంకితం అని పెద్ద అక్షరాలలో ప్రస్ఫుటంగా రాయించాడు.

శ్రీపాదకి అపారమైన సాహిత్యసంపద ఉండేది తప్ప లక్ష్మీకటాక్షం లేదు. దుర్భర దారిద్ర్యంతో ఆయన చివరిరోజులు గడిచాయి. స్వంతిల్లు లేదు సరికదా, అప్పులతో జీవనయానం సాగేది. సున్నిత మనస్కుడైన శ్రీపాద ఈ దుస్థితికి ఎంతో తల్లడిల్లిపోయినట్లు ఆయన లేఖలు చెబుతాయి. అలాంటి సాహిత్య కుచేలుడికి, తరగని సంపదగా ఆయన రచనలన్నిటినీ ఒక గ్రంథ సంపుటిగా, తన సంపాదకత్వంలో ప్రచురింపజేసి, అజరామరమైన కీర్తిని కానుకగా సమర్పించాడు రాంబాబు. ఇలాంటి కానుకలను గురజాడ, గిడుగులకు కూడా సమర్పించిన ఘనత వేదగిరిది.

ఆవిధంగా గురజాడ, గిడుగు, శ్రీపాదలనే సాహిత్య తేజోమూర్తి త్రయాన్ని తను ఆరాధించడమేగాక, తెలుగు వారందరి చేత ఆరాధింపజేసి తన జీవితానికి రాంబాబు ధన్యత చేకూర్చుకున్నాడు. ఇవన్నీ ఒక ఎత్తు అయితే, బహు కొద్దిమందికి తెల్సిన వేదగిరి రాంబాబులోని మానవీయ కోణాన్ని నేనిప్పుడు ఆవిష్కరిస్తున్నాను.

ఆత్రేయ అన్నట్టు "పుట్టిన దెందుకో తెలిసేది ఎందరికి" అనే భావనతో, ఆత్మ విమర్శ చేసుకుని తనవంతుగా సమాజానికి 'గట్టి మేల్ తలపెట్టి,' గుప్తంగా అనేక సత్కార్యాలు చేశాడు రాంబాబు. తన పుట్టినరోజు పండుగని కథానిక వేడుకగా జరుపుకోవడం ఒక విశిష్ట ఆనవాయితీగా చేసుకోవడం అటుంచి, ప్రతి అయిదు సంవత్సరాలకు పెద్దమొత్తాన్ని ఒక సమాజహిత కార్యక్రమానికి శాశ్వతనిధిగా సమర్పించడం చాలామందికి తెలియదు.

25ఏళ్ల సాహిత్య కృషికి అభినందనగా జరిగిన సాహిత్య రజతోత్సవ కార్యక్రమంలో రాంబాబు ఆత్మీయులు, సన్నిహితులు కీ.శే.వాకాటి పాండురంగారావు, ప్రముఖ ఐ.ఏ.ఎస్ అధికారి. సాహిత్య ప్రేమికుడు కె.వి.రమణాచారి, ప్రస్తుత సభాపతి డా॥ కోడెల శివప్రసాదరావువంటి మహామహులు పాల్గొన్నారు. ఆ సభలో ఛలోక్తిగా వాకాటి పాండురంగారావుగారు "నలభైఏళ్ల వయసు దాటాక ఒక వ్యక్తికి సుగర్‌వ్యాధి వచ్చిందంటే, అతను తనరంగంలో అపారమైన కృషిచేసినట్లు రుజువు. వేదగిరి రాంబాబు సుగర్‌పేషెంటుగా ఆ కోవలోకి వస్తాడు"అన్నారు.


దానికి స్పందించిన డా॥ కోడెల "రాంబాబు ఆరోగ్యం సాహిత్యరంగానికి ఎంతో అవసరం. అందుకోసం నేను పదివేల నూట పదహారు రూపాయలు బహుకరిస్తున్నాను" అని అప్పటికప్పుడు ప్రకటించారు. అశ్వినీ సుబ్బారావుగారు వేల రూపాయిలు ప్రకటించారు. అదేరీతిలో ఏల్చూరి విజయరాఘవరావు గారు ఇరవై అయిదువేల రూపాయలు ప్రకటించారు. ఇలా దాదాపు లక్షరూపాయల దాకా బహుమతుల ధనంపోగయింది. వారి ఆత్మీయతకు, అభిమానానికి రాంబాబు చలించిపోయాడు. ఈ ధనం తనకోసం కాదు. తనలాంటి సుగర్ వ్యాధి పీడితులకు, మెరుగైన మందుల పరిశోధనకు వినియోగించడం సబబు అని భావించి నిమ్స్‌లోని డయా బెటిక్ రీసెర్చ్ సెంటర్ నిర్వాహకులు డా॥పి.వి. రావుగారికి ఆ ధనాన్ని అప్పగిస్తు" ఇది కువలం గుర్రపునాడా మాత్రమే! గుర్రాన్ని మీరు సిద్ధం చేసుకోండి" ఛలోక్తిగా అంటూ పునాది వేశారు. అలాగే, తన సీరియల్ 'పాపం! పసివాళ్ళు'కి లభించిన ప్రతిష్టాత్మక బంగారు నంది బహుమతి మొత్తానికి మరికొంత కలిపి, నిమ్స్‌లోని హీమోఫీలియా వార్డుకి, సంబంధిత సంస్థతో కలిసి అంద జేశారు. ఆధ్యాత్మిక సేవల పరంగా మాచర్లలో సత్రశాల, చుండూరులో సత్రం గదిని, తమ తల్లి దండ్రుల స్మృతిగా భక్తులకు ఉచిత అన్న దాన వితరణకు ఉపయుక్తంగా ఉండేలా నిర్మింపజేశారు. ఆవిధంగా రాంబాబు తల్లి దండ్రులు కీ.శే. వేదగిరి భార్గవి, పూర్ణచంద్రరావుగార్లు ధన్యులు.

రాంబాబు కష్టాల రుచి తెలిసినవాడు. కష్టాల కోసం రాళ్ళ మీద నగ్న పాదాలతో నడిచినవాడు. విద్య, విజ్ఞానాన్ని మించిన సంపదలేదనే సత్యం తెల్సిన విజ్ఞుడు. అందుకే బీదవిద్యార్థులకు తనవంతుగా ఎన్నో విధాల ఆపన్నహస్తం అందించాడు. ఇస్తూనే ఉన్నాడు. ఇప్పుడు మనం వేదగిరి రాంబాబు జీవితగ్రంథాన్ని ఆమూలాగ్రం చదివితే, అతని విలక్షణలక్షణరేఖలన్నీ కలిపితే, అది సమగ్ర వ్యక్తిత్వ చిత్రంగా రూపొందటం స్పష్టంగా కనిపిస్తుంది.

(6-1-2018న అప్పాజోస్యులవారి జీవనసాఫల్య పురస్కార సందర్భంగా)









4 విశాలాంధ్ర సోమవారం 08, జనవరి 2018

సాహితి

పిల్లల మదిని తెలిపే శాస్త్రం



పిల్లల మనస్తత్వ శాస్త్రం
-డా॥ దూర్జటి సుబ్బారావు
పేజీలు:126, వెల: రూ. 110/-
ప్రతులకు:
విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్,
33-22-2, చంద్రబిల్డింగ్స్,
చుట్టుగుంట,
విజయవాడ-520004,
ఫోన్: 0866-2430302
మరియు విశాలాంధ్ర బుక్‌హౌస్,
అన్ని బ్రాంచీలలో

పిల్లలు భావి భారత నిర్మాణకర్తలు. వారి మనసులు వెన్నంత సున్నితంగా ఉంటాయి. సహజంగానే వారి ప్రవర్తన సరళంగా ఉంటుంది. బాలబాలికలకు ఒక విశిష్టమైన వ్యక్తిత్వం ఉంటుంది. పిల్లల ఆలోచనారీతులను గమనించుకోకుండా కొంతమంది తల్లిదండ్రులు తమ ఇష్టాఇష్టాలను వారిపై రుద్దటానికి ప్రయత్నిస్తారు. సాధారణంగా వారి వయసును బట్టి ప్రవర్తన మారుతుంటుంది. మొక్కై వంగనిది మానై వంగుతుందా అని ఒక సామెత ఉంది. చిన్నప్పటి నుండి సరియైన వాతావరణం కల్పించి వారిని పెంచితే పెద్దయ్యాక వారు మంచి పౌరులుగా తయారవుతారు. మొక్క చిన్నగా ఉన్నప్పుడే దానికి చక్కగా కుదురు చేసి సరియైన పోషకాలు అందజేస్తే అది ఏ తెగుళ్ళూ సోకకుండా మంచి ఫలసాయాన్ని ఇస్తుంది. అలాగే పిల్లల విషయంలో కూడా జరగాలి.

డా॥ దూర్జటి సుబ్బారావు గారు రచించిన పిల్లల మనస్తత్వ శాస్త్రంలో ఆయన చక్కగా వివరించారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల ఎలా ప్రవర్తించాలో ఆయన వివరించారు. శైశవదశ నుంచి యుక్తవయసు వచ్చేవరకు బాలల్లో ఎలాంటి మార్పులు వస్తాయో వాటికి అనుగుణంగా ఎలా పెద్దల ప్రవర్తన ఉండాలో విశదంగా తెలియజేశారు. మనశ్శాస్త్రంపై అందునా పిల్లల మనస్తత్వం మీద పుస్తకాలు లేవనే అనాలి. శ్రీ సుబ్బారావుగారు అనుభవజ్ఞులైన మనశ్శాస్త్రజ్ఞులు. పిల్లల పసిపాప దశ నుంచి యుక్తవయసు వరకు వారి మనస్తత్వాలను, పెరుగుదలను ఆరోగ్యాన్ని, విద్యతోపాటు వారికి ఏ వయసులో ఎలాంటి వ్యాక్సిన్‌లను అందించాలో చక్కగా ఈ పుస్తకంలో తెలిపారు. పిల్లల్లో కనిపించే లక్షణాలను చూసి కొంతమంది తల్లిదండ్రులు అన్నీ నీకు మీ అయ్య బుద్ధులు, నీ మేనమామ లక్షణాలు అంటూ పిల్లలను ఎద్దేవా చేస్తుంటారు. కానీ పిల్లలలో తల్లిదండ్రుల ఇద్దరి లక్షణాలుంటాయని ఈ పుస్తకం ద్వారా తెలిపారు సుబ్బారావుగారు.

యుక్తవయసులో పిల్లల్లో శారీరక, మానసిక మార్పులు వస్తాయి. అలాంటి సందర్భాలలో పిల్లలను చాలా సున్నితంగా చూడాలి. ఈ వయసులో పిల్లలకు అంతా తమకే తెలుసుననే అహం ఉంటుంది. ఎవరి మాటా వినటానికి ఇష్టపడరు. చదువు విషయంలో కూడా వారు కొంత నిర్లక్ష్యం ప్రదర్శిస్తారు. నాకు నచ్చిన పనే చేస్తాను అనే ధోరణిలో ఉంటారు. తల్లిదండ్రులేమో వారి ధిక్కార ధోరణిని భరించలేరు. ఫలితంగా వారిని అలా చేయకూడదు, ఇలా ఉండాలంటూ నిర్దేశిస్తూ ఉంటారు. ఈ వయసులో పిల్లలు అది భరించలేరు. తల్లిదండ్రులు కూడా వారితో వాగ్వాదానికి దిగకుండా వారికి మంచిగా నచ్చచెప్పాలి. దానికి తల్లిదండ్రులకు కొంత సహనం, ఓర్పు, సంయమనం తప్పనిసరిగా ఉండాలి. తల్లిదండ్రులు కూడా పిల్లలతో సమానంగా ఆవేశపడకూడదు. ఎటువంటి పరిస్థితులలోను పిల్లలను యుక్తవయసులో దండించకూడదు. అలా చేస్తే వారు మానసికంగా కుంగుబాటుకు గురై ఆత్మహత్యలు చేసుకోడానికి కూడా వెనుకాడరు. తమ పిల్లలు సక్రమంగా పెరిగి, మంచి ఆలోచనలు కలిగి కుటుంబానికి, దేశానికి ఉపయోగపడేలా తయారవ్వాలని కోరుకోవాలి. దేశానికి కావలసింది మంచి నాయకత్వం. అలాంటి నాయకత్వాన్ని తమ పిల్లల ద్వారా అందించాలని ప్రతి తల్లిదండ్రీ అనుకోవాలి. పిల్లలలో వయసును బట్టి వారి ప్రవర్తన అందుకు అనుగుణంగా తల్లిదండ్రుల వారితో ఎలా మెలగాలో చక్కగా వివరించారు రచయిత. తమ పిల్లల అభివృద్ధి, వారితో దేశం చక్కని ప్రగతి పథంలో సాగాలంటే పరిఢవిల్లాలంటే ప్రతి తల్లీదండ్రి చదవదగిన పుస్తకం అనటంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ప్రస్తుత కాలంలో పిల్లల మనస్తత్వంపై పుస్తకాలు రావటంలేదు. అందునా తెలుగు భాషలో లేవనే అనాలి. ఈ సందర్భంలో ఇది అరుదైన పుస్తకమనే అనాలి. తమ పిల్లలను మంచి పౌరులుగా చూడాలనుకునే ప్రతివారు కొంత సమయాన్ని కల్పించుకొని ఈ పుస్తకాన్ని చదివి రచయిత తెలియజేసిన అమూల్యమైన విషయాలను ఆకళింపు చేసుకొని ఆదర్శవంతమైన తల్లిదండ్రులుగా మారాలి.


-యోగిత

నూతనోత్తేజానికి వెలుగుల సవ్వడి



అంతర్నిహితమైన భావజాలమంతా కార్యరూపంలోకి వస్తుంది
ఆశలు, ఆశయాలు సఫలీకృతం అవుతున్నాయి
సంతోషం ఓ ఉత్తేజమే అది వ్యసనమైతే దు:ఖమే సుమా!
మత్తులో ఆనందముందని ఎవరు చెప్పారు?
కలిగించుకొనేదేది నిలబడదుకదా!
అవును! పోయిన ఏడు కత్తివాదర మీద నడిచినట్టేవుంది
గుండె చీరేసిన ఘటనలెన్నో చరిత్రలో లిఖించబడ్డాయి
సత్యం రాసినందుకే వధ, సత్యం మాట్లాడినందుకు చెర
అవును! ఆంక్షలు ఆశయాలకు గట్టులేయగలవా!
నెత్తుటిబాటలో పాలకులయాత్ర అన్ని నదులు కల్మషమౌతున్నాయి
నగరాలకు ఊపిరాడడంలేదు
అతడు తిరోగమనవాదే పురోగమనాన్ని ఎవరు ఆపగలరు!
నిర్వ్యాపకం మనిషిని కుదిస్తుంది
ఇతరులు మెచ్చుకోవడం కోసం జీవిస్తే
అంతరంగం తగ్గి బాహ్యత పెరుగుతుంది
అతడు కీర్తిని కాంక్షిస్తున్నాడు
తన బొమ్మను పదే పదే ముద్రణ వేసుకొంటున్నాడు
సూర్యోదయానికి బదులు తన బొమ్మను తానే వీక్షిస్తున్నాడు
అవును! బొమ్మలో ఏముంది? దానికి గుండె ఉండాలి
దానికి రక్త ప్రసరణ కావాలి అవి అతనికి లేవు
దానికి మెదడూ కావాలి, దానికి ఆలోచనా కావాలి
అవును! ఆమె ముఖం పీక్కుపోయింది
మైపూతలు ముఖానికి పట్టడం లేదు
కండభాగం బాగా తరిగిపోయింది ఎముకలు బయటపడ్డాయి
ముఖానికిరంగులు పూయగలంకాని కండలు అంటించలేముకదా!
వారు ప్రతి విగ్రహానికి పూలదండలు వేస్తున్నారు
కంటనీరు తడారాక ఆర్ద్రత ఎక్కడ నుండి వస్తుంది?
మానవత ఎక్కడ వర్ధిల్లుతుంది
కార్యాచరణ లేని మనుషులు ఉనికికోసం ఆరాట పడుతున్నారు
వ్యక్తిత్వ విధ్వంసానికి శిథిల విన్యాసాలు చేస్తున్నారు
నిర్మాణదక్షతలేనిపాలకుడు కక్షను,కార్పణ్యాన్ని సిద్ధాంతీకరిస్తున్నాడు
ఆ కొండ చుట్టూ మనుషులు మందలు మందలు..
ఏదో దర్శనంకోసం పడిగాపులు వీక్షణం వీగిపోతుంది
విగ్రహానికి అలంకరించినపూలు వాడిపోతున్నాయి
ఆ మెట్లమీద ఎవరో తిండిలేక స్పృహతప్పి పడిపోయారు
'బొందితో వైకుంఠానికి వెళ్ళారని చెప్పుకొంటున్నారు'
మతిలేని మనుషులు అని విగ్రహాలు విసుక్కుంటున్నాయి
"మనం నిద్రలేపితే కాని లేవని దేవుళ్ళకు
మనం మొక్కటం ఏమిటి?" అని పిల్లోడు ప్రశ్నించినందుకు
వాడి తలకాయమీద మొట్టికాయబడింది
ఏదైనా ఆలోచనను చంపడమే నేటి క్రియ
ఆలోచన, వివేచనలేనూత్న ఆవిష్కరణలకు జీవం
ఆమె తన జీవితాన్నంత తన బిడ్డలకు ధారబోసింది
సూర్యునిముందు తాను ఒంటరిగానే నిలబడింది
వారు నిద్రలో ఉన్నారు
ఇతరుల బాధ్యత మోసినంతకాలంవారిలో చైతన్యం రాదు కదా!
ఇకనైనా కొత్తగా ఆలోచించండి
కొత్తయేడు ఓ కొత్తపురుడు నూతనోత్తేజానికి వెలుగుల సవ్వడి

-డాక్టర్ కత్తి పద్మారావు, ✆ : 9849741695



నిజం

దు:ఖమెంత వెల్లువలైనా
కళ్ళ నుంచి కారేది కన్నీరే గాని రక్తంకాదు!
ఎన్ని కోట్లధనం సంపాదించినా..తినేది చాలినంతే- అనేది సత్యం!
ఇల్లు ఎంత విశాలంగా ఉన్నా- నీవు నిల్చునేది గజం చోటే!
నీవు తయారించిన యంత్రమే ఐనా-
పరాకుతో తప్పు చేస్తే నిన్ను క్షమించదు!
నీవు ఆశతో ఎన్ని కలలు కనినా-
నీకు ప్రాప్తమున్నంతే దుక్కుట తథ్యం!
నీవు సత్క్రియా సంపన్నుడివైతేనే-
సజ్జనుల మన్ననా పాత్రుడౌతావు!
నీవు సమానత-మైత్రీ భావివి ఐతేనే-
నీకు అనుయాయుల సఖ్యం లభ్యమౌను!

-ఆచంట హైమవతి సెల్: 09739441057

Dwaraka

విశాలాంధ్ర

బతుకు

The Life

సోమవారం
08 జనవరి 2018



ఓణీ వేసిన సంక్రాంతి!

పండగ అనగానే సంప్రదాయమే గుర్తుకొస్తుంది. నిండైన వస్త్రధారణ, నిండుగా నగలు, పొడవాటి జడ, ఆ జడకు కుప్పెలు, తలనిండా పూలు, నుదుటున పాపిడిబిళ్ళ, కంఠాభరణం, నడుముకి వడ్డాణం, చేతుల నిండుగా గాజులు ఇవే కళ్ళముందు కదలాడుతాయి. వీటన్నింటికీ తోడు పడుచు పిల్లలు లంగా, ఓణీలు వేస్తే పండగ అంతా వాళ్ళల్లోనే కనిపిస్తుంది. ఈ పాత ట్రెండే మళ్ళీ సరికొత్త ఫ్యాషన్‌గా మారింది ఇటీవలకాలంలో. ఈ చిత్రాలు చూస్తే అది నిజమే అనిపిస్తోంది కదూ ! మరి ఈ సంక్రాంతికి మీ పిల్లల్నీ ఇలా రెడీ చేస్తారా మరి!

తొలి నేచురలిస్ట్ రత్నసింగ్

వైల్డ్ లైఫ్... అడవిలో క్రూర జంతువులతో సహవాసం.. అలాంటి వైల్డ్‌లైఫ్ కెరీర్‌లో అమ్మాయిలు నెగ్గుకురావడం ఓ సవాల్! ఇక క్రూర మృగాలను టాకిల్ చేయడం అమ్మాయిలతో అయ్యే పనికాదనే భావన.. ఇలాంటి ఎన్నో సందేహాలను పటాపంచలు చేసింది రత్నసింగ్! దేశంలో శిక్షణ పొందిన మొట్టమొదటి నేచురలిస్ట్, వైల్డ్‌లైఫ్ గైడ్. సవాళ్లతో కూడిన కెరీర్‌లో విజయవంతంగా సాగిపోతున్న ఆమె ప్రయాణం గురించి...



'మధ్యప్రదేశ్‌లోని ఓ మారుమూల గ్రామంలో దట్టమైన అడవికి దగ్గరగా ఉండేది మా ఇల్లు. దాంతో గ్రామీణ వాతావరణం అలవాటు పడింది. నేను రకరకాల జంతువుల మధ్య పెరిగాను. పెద్ద పెద్ద కోతులు, అడవి పందులు, జింకలు తరచూ కనిపించేవి. అప్పుడప్పుడు చిరుతలు, ఎలుగుబంట్లు, పులులు వచ్చేవి. వీటికితోడు మా అమ్మ చిరుత పిల్లలను ఇంట్లో పెంచింది. వాటితోపాటు గాయపడ్డ జంతువులన్నింటికీ మా ఇంట్లోనే చికిత్స చేసేది. అదే నేను ఈ ప్రొఫెషన్‌లోకి రావడానికి దోహదపడింది' అని తన వైల్డ్‌లైఫ్ ఎంట్రీ గురించి వివరిస్తుంది రత్న.

బాధ్యతతో...

ఆమె బాల్యం కోల్‌కతాలోని లా మార్టినేర్ బోర్డింగ్ స్కూల్లో గడిచింది. హిస్టరీలో గ్రాడ్యుయేట్ అయిన రత్న, ఇంటర్నేషనల్ లాలో డిప్లొమా చేసింది. చదువైపోగానే రెడ్‌క్రాస్, యునైటెడ్ నేషన్స్ హై కమిషనర్ ఫర్ రెఫ్యూజీలో కొన్నాళ్లు పనిచేసింది. అయితే జంతువుల మీద ఉన్న ప్రేమ ఆమెను మళ్లీ వెనక్కు లాగింది. ఆ సమయంలోనే ఇంటర్నేషనల్ ఎకోటూరిజం కంపెనీ వైల్డ్‌లైఫ్ గైడ్స్ ట్రెనింగ్ ఆఫర్ చేసింది. దేశంలో అది మొట్టమొదటిది. మరేం ఆలోచించకుండా అందులో చేరిపోయింది రత్న. వైల్డ్‌లైఫ్ గైడ్... వినడానికి చాలా బాగుంది. కానీ దినదిన గండం. ఔత్సాహికులను తీసుకుని రోజుకు 8 నుంచి 9 గంటలు అడవిలో సఫారీలో ప్రయాణం. శీతాకాలంలో జీరో డిగ్రీల ఉష్ణోగ్రత, వేసవిలో కాల్చేసే ఎండలు. వీటిన్నింటికి తోడు వచ్చిన పర్యాటకులను అడవిలో ఉన్న గ్రామాల్లోకి తీసుకెళ్లాలి. ఎంతో బాధ్యతతో కూడుకున్న పని. అంతేకాదు నేచురలిస్ట్‌గా వెళ్లిన ప్రాంతంలో జంతువులు, పక్షులు, మొక్కల గురించి తెలిసి ఉండాలి. జంతువుల అరుపులు, ప్రవర్తన, అక్కడి వాతావరణంపైనా పూర్తిగా అవగాహన ఉండాలి. ఇవన్నీ ఎలా వచ్చాయంటే.. 'మాకు ఆస్ట్రానమీతోపాటు, మెకానిక్స్, ఫస్ట్ ఎయిడ్, వెహికిల్ మెయింటెనెన్స్‌లో శిక్షణ ఇచ్చారు. వీటన్నింటితోపాటు వచ్చిన పర్యాటకులకు అర్థమయ్యేలా అక్కడి విశేషాలను చెప్పేందుకు స్టోరీ టెల్లింగ్ ఆర్ట్‌ను నేర్పించారు' అంటుంది.

మరిచిపోలేని ఘటన...

బాంధవగఢ్ నేషనల్ పార్క్‌లో మొదలు పెట్టిన ఆమె కెరీర్‌కు ఇప్పుడు పదేళ్లు. ఈ పదేళ్లలో ఎన్నో మరచిపోలేని సంఘటనలు. 'ఓ రోజు రాత్రి నా కాటేజ్‌కు వస్తున్నాను. కటిక చీకటి. దగ్గర టార్చ్ కూడా లేదు. మార్గమధ్యంలో ఓ చిరుత నా ముందుకు వచ్చింది. ఆకారం మాత్రమే కనబడుతోంది. వెంటనే నన్ను భయం ఆవరించింది. అక్కడినుంచి ఎలాగైనా తప్పించుకోవాలని చూశాను. కానీ అప్పుడు నాకు గుర్తొచ్చింది 'అడవిలో ఉన్నప్పుడు ఏ జంతువైనా ఎదరైనా, ఏదైనా జరిగినా వెంటనే అక్కడినుంచి పరుగెత్తొద్దు' అని శిక్షణ సమయంలో చెప్పిన విషయం. పరుగెడితే ఆ చిరుత భయాన్ని వాసన పట్టేస్తుంది. వెంటనే మీదికి ఎగబడుతుంది. అందుకే అది వెళ్లిపోయేంతవరకు కదలకుండా అక్కడే శిలలా నిలబడిపోయాను. తరువాత ఆకులా వణికిపోతూ కాటేజ్‌కు చేరుకున్నాను' అని ఆ భయానక ఘటనను గుర్తు చేసుకుంది రత్న.

సవాళ్లకు ఎదురీది...

కెరీర్ ప్రారంభంలో ఆమె అనేక విమర్శలను ఎదుర్కోవాల్సి వచ్చింది. 'మగాళ్లలాగా ఆ ప్యాంట్ వేసుకోవడమేంటి? మగాళ్ల మధ్య ఉద్యోగం చేయడమెందుకు?' అన్నారు ఇరుగుపొరుగు. బంధువుల సూటిపోటిమాటలు తప్పలేదు. ఇక సహోద్యోగులు అందరూ మగవాళ్లే. ఆమె దగ్గరగా ఉన్నప్పుడు అసౌకర్యంగా ఫీలయ్యేవారు. ఆమెతో మాట్లాడేవాళ్లే కాదు. ఆమె సరిగ్గా డ్రైవ్ చేస్తుందోలేదోనని సందర్శకులు కూడా సందేహపడేవాళ్లు. అన్నింటికీ చిరునవ్వుతో సమాధానం చెప్పింది రత్న. ఏళ్లు గడిచాయి. చాలా మార్పు వచ్చింది. ఇప్పుడామెను ఓ మహిళ అని ఎవరూ తక్కువగా చూడరు. సహజంగానే మహిళల్లో స్పందించే గుణం ఎక్కువ. జంతువులపై ప్రేమ ఉన్న రత్న గాయపడ్డ జంతువులను చూస్తే కదిలిపోతుంది. ఓ సారి చిరుత దాడిలో గాయపడ్డ ఎద్దు రక్తమోడుతూ కనిపించింది. వెంటనే స్టాఫ్ విలేజ్‌కు తీసుకెళ్లి గాయాన్ని శుభ్రం చేసి, ప్రథమ చికిత్స చేసింది. గాయాలకు టర్పెంటైన్ ఆయిల్ రాసింది. నెల రోజుల తరువాత ఆ ఎద్దు కోలుకుంది. 'అప్పుడు చాలా సంతోషమేసింది' అని ఉద్వేగంతో చెబుతుంది రత్న. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా ఎన్నో అడవుల్లో తిరిగిన రత్న... శ్రీనగర్ సమీపంలోని దాచిగామ్ (హిమాలయాలు), దక్షిణ భారతదేశంలో వెస్ట్రన్ ఘాట్స్‌లో పనిచేయడం మంచి అనుభూతినిచ్చింది అంటుంది.

అడవుల్లోనే విలాసం...

ఈ పదేళ్ల ఎక్స్‌పీరియెన్స్‌తో మనిషి జీవించడానికి అడవులే శ్రేయస్కరం అంటుంది రత్న. ఎందుకంటే.. 'అక్కడి జంతువులు మనుషుల్లా గేమ్స్ ప్లే చేయవు. చివరికి పులులు కూడా ఆహారం కోసమే వేటాడతాయి. నగరాల్లో కంటే అడవుల్లోనే విలాసముంది. ఎంతో ఓపెన్ స్పేస్. ఎలాంటి భయం లేకుండా నడుచుకుంటూ వెళ్లొచ్చు. ట్రాఫిక్ జామ్స్ ఉండవు. ఇక వర్క్‌లో డెడ్‌లైన్స్ అసలే లేవు. ఈ ప్రయాణంలో నా భర్త వసీం అందించిన సహకారం మరువలేనిది. ఇక జంతువుల మధ్య ఉంటూ నేను పొందిన సంతోషం, ప్రశాంతత వెలకట్టలేనివి' అని గర్వంగా చెబుతుంది రత్న.



పొడి చర్మం సమస్యకు వెన్నతో చెక్..!

మనలో అధిక శాతం మందికి ఎప్పుడూ పొడి చర్మం ఉంటుంది. తేమ సరిగ్గా లేకపోవడంతో చర్మం పొడిగా మారుతుంది. ఇందుకు అనేక కారణాలుంటాయి. ఇక చలికాలం వచ్చిందంటే ఎవరికైనా చర్మం పొడిగానే తయారవుతుంది. అయితే ఈ సమస్య నుంచి బయట పడాలంటే అందుకు వెన్న బాగా ఉపయోగపడుతుంది. వెన్నతో పొడి చర్మం సమస్యను ఎలా తగ్గించుకోవచ్చో ఇప్పుడు తెలుసుకుందాం.



- ఒక టీస్పూన్ వెన్న, ఒక టీస్పూన్ మీగడలను కలిపి ముఖానికి రాసి 5 నిమిషాల పాటు మసాజ్ చేసి 20 నిమిషాలు ఆగాక చల్లని నీటితో కడిగేయాలి. దీంతో చర్మం మృదువుగా మారుతుంది. ముఖం కాంతివంతమవుతుంది.
- ఒక టీస్పూన్ వెన్నను ఒక టీస్పూన్ అరటి పండు గుజ్జులో కలిపి ముఖానికి రాసి ఆరిన తర్వాత కడిగేయాలి. తరచూ ఇలా చేస్తే చర్మం మృదువుగా మారుతుంది. అంతేకాదు ముఖంపై ఉన్న ముడతలు కూడా పోతాయి.
- ఒక టీస్పూన్ వెన్నకు చిటికెడు పసుపు కలిపి ముఖానికి రాసి అరగంట తరువాత కడిగేయాలి. ఇలా రోజుకు రెండు సార్లు చేస్తే మంచి ఫలితం ఉంటుంది.
- అర టీస్పూన్ వెన్నలో రెండు స్పూన్ల ఉడికించిన క్యారెట్ గుజ్జును కలిపి ముఖానికి రాసి అరగంట అయ్యాక ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. దీంతో చర్మం మృదుత్వాన్ని పొందుతుంది.



- గుడ్డులోని తెల్ల సొన, అర టీస్పూన్ వెన్నని తీసుకుని మిక్సీలో వేసి బాగా మెత్తగా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి కొంత సేపటి తరువాత కడిగేయాలి. ఇలా చేయడం వల్ల చర్మం కాంతివంతమవుతుంది. మృదుత్వాన్ని కూడా పొందుతుంది



డాక్టర్ వుప్పల లక్ష్మణరావు



జరిగిన కథ

రాజాగారి తరఫున వకాల్తీకి శ్రీనివాస రాఘవయ్యగారు, బెన్సన్, వెంకటేశన్ అందరూ తంటాలు పడ్డారు. ఈవేళ మధ్యాహ్నం రాజాగారు స్వయంగా కబురుచేసి బెన్సన్‌కి సీనియర్ వకాల్తీని, నాకు రెండో వకాల్తీనీ ఇచ్చారు. అంతేకాదు ఈ ఖూనీకేసు వకాల్తీ ఇలావుండగా, హైకోర్టులో వున్న సివిలు కేసులన్నింటిలో నరసింహ్వాయ్యంగారికి, నాకూ జాయింటిచ్చారు.

"రిటైనరు క్రింద ఫీజు అడ్వాన్సు కింద నాకు వెంటనే రెండువేలు ముట్ట చెప్పేరు. ఆ రెండు వేలలోనూ నీకు ఐదు వందలీకట్నం" అని ఎంతో ఉత్సాహంతో చెప్పేరు. ఆ రెండు వేలలోనూ నీకు ఐదువందలీకట్నం" అని ఎంతో ఉత్సాహంతో కౌగిలించుకున్నాడు ... అతని ప్రేమ, ఉత్సాహం ఔదార్యం, నా హృదయానికి హత్తుకుని పోయాయి. కాని ఈ ఉంగరం నేనెట్లా తీసుకోను? ఎవరి డబ్బుతో వచ్చినది?

(నిన్నటి సంచిక తరువాయి)

నేను ఎల్లా చెప్పను? అతని ఉత్సాహానికి భంగం కలగించటం ధర్మమా? ఎప్పుడో ఒకసారి బయటికి రావలిందేగా... అతని మనస్సు నొప్పించకుండా చెప్పాలి.... "శాస్త్రీ! నువ్వీ కేసు పట్టకుండా వుంటే నా మనసుకెంతో శాంతి వుండునోయి. ఈ రాజాలు, యీ జమీందారులు, వీరి దుర్నయాలు, అత్యాచారాలు - వీటిలో మనం కూడా కలిగించుకోవడమెందుకోయి? ఈ వజ్రాలేమిటి - రైతులు రక్తపు చుక్కలు కావు? వాళ్ళ రక్త మాంసాలు పిండితే - పడిన చుక్కలు కావు? అటువంటివి నేనెలా ముట్టుకోగలను? నువ్వు ఎలా ముట్టుకోగలవు? నాకొద్దు శాస్త్రీ!" "ఇదేమిటి శాంతం, ఇల్లా అంటున్నావు? ఇదంతా నీ కోసం, పాపాయి కోసం గాదూ? అయినా - నేను బారిష్టరుని. ఎవరి తరఫున వాదించమంటే వాళ్ళ తరఫునే వాదిస్తాను. అంతేకానీ ఆ ఖూనీతో నాకేం సంబంధం - నాకేం సానుభూతి?" "నీకు సానుభూతి లేనిపనిలో నువ్వెందుకు కల్గించుకోవాలి?" "అదేమిటి? ఇంతకీ ఆ ఖూనీ ఎవరు చేశారో యింకా తేలందే. ఇలాంటి ధర్మ సందేహాలు పెట్టుకుంటే ప్రపంచంలో బతకడం ఎలా?" "అలాగని దొంగడబ్బు. ప్రజలని పీడించి సంపాదించిన డబ్బు, రైతులు పీక పిసిపి కక్కించిన డబ్బు, మన కెందుకు? ఈ డబ్బు లేకపోతే మనకీ బ్రతుకే గడవదా? అలాగు సంపాదించిన ధనం నిలవదంటారు మనవాళ్ళు. నువ్వు అంత ఆపేక్షతో ఈ వుంగరం ఇస్తుంటే నేను తోసెయ్యను. కాని నన్ను పెట్టుకోమని మాత్రం బలవంతం చెయ్యకు - చేతిలో చెయ్యిలో వెయ్యి" అన్నా. "అలాగేలే! కాని నువ్వు చదువుకున్న అర్థశాస్త్రం అంతా ఆచరణలో పెడితే ఎట్లా? ఈ శాస్త్రానికి నిలకడేమిటి? నీ రికార్డు, మిల్లు, బ్రెంటానో బాగా చదువుకో. ప్రపంచంలో అన్ని రకాల మనుష్యులూ వుండాలి!" అన్నాడు... నా ధోరణి శాస్త్రి పట్టించుకోలే. అతను ఎక్కడ చిన్నపుచ్చుకుంటాడో అని భయం వేసింది. వుంగరం పెట్టుకోమని బలవంతం చెయ్యలేదు. అదే పదివేలు....

48 అతడు

లింగాలపల్లి రాజాగారి ఫైలు ఇన్నాళ్ళకి నాకొచ్చింది. దీంతో నేను చెన్నపట్నం న్యాయవాదుల్లో మొదటి శ్రేణిలోకి వచ్చినట్టే! ఈ ఖూనీ కేసులో నా పేరు ఇంక నిలబడిపోవాలి. ఏముంది - ఇలాంటి మరిరెండు సివిలువి కూడా వస్తేనా - రెండు మూడేళ్ళలో ఎడ్వకేట్ జనరల్ గిరీ నాదే! యీ వకాల్తీకి - ఎంత పోటీ - ఎన్ని సిఫార్సులు - ఎన్ని రాయబారాలు జరిగేయి? నాకు వెనుకదన్ను లేకపోయినా జాతకబలమే పూర్తిగా సాయం చేసింది. కొంత ఆంధ్రాభిమానం కూడా నేమో - అబ్బే! అతని పీకల మీద కొస్తూంటే ఆంధ్రాభిమానమేమిటి - ప్రాణాలుదక్కి బయటికెలా పడడంరా భగవంతుడా అని యేడుస్తూంటే! ఈ దెబ్బతో షెవ్రలెటుకార్లు రెండూ అమ్మేసి ఒక బ్యూక్‌న్నూ, ఒక షేకార్డు కొనాలి. ఏమిటో - నే నిన్ని పేక మేడలు కడుతుంటే శాంతం వాటినన్నిటిని ఉఫ్ఫని ఊదేస్తూంటుంది ఎంతో సంబరంతో వుంగరము కొని తీసుకు వెళ్ళేనా - మొహంమీద పేడ నీళ్ళు కొట్టినంత చేసింది. సనేమిరా నేనా వుంగరం పెట్టుకోనంటూ - ఒక ఉపన్యాసం



కొట్టింది. మరి తను చదువుకున్న అర్థశాస్త్రం అంతా మర్చిపోయిందో - లేకపోతే కొత్త అర్థశాస్త్రం తయారు చేస్తోందో? జమీందార్లు దేశద్రోహులుట - రైతులు సాక్షాత్తూ దేవతాసంభూతులట - భూమి అంతా రైతులదేనట - జమీందార్ల డబ్బు ఎవడు తింటే వాడికి పుట్టగతులు వుండవట - అందుచేత నేను లింగాలపల్లి రాజాగారి తరఫున వకాల్తీ పట్టకూడదుట. ఇంకా ఏమిటో... ఏమిటో! నేనూ కాస్త ఎకనామిక్సు చదువుకున్నానుగా - కాని యీ ధోరణేమిటి? ప్రపంచం సాగాలా - వద్దా? అందులోనూ మనదేశంలో అనాదిగా వస్తూంది. ఈవేళ పోవాలంటేపోతుందా? రాజులు - ప్రజలు, గొప్ప - బీద ఇవి ఉన్నంతకాలం ఎక్కడ మెలగవలసిన వాళ్ళక్కడ మెలగకపోతే - యీ భూచక్రం తిరగడం ఎల్లా? మరి శాంతం ఉద్దేశాలు ఎల్లా మారుతున్నాయోకాని - అప్పుడు పాండుచేరీలోనూ అంతే. మహారాజులమీద, స్వదేశ సంస్థానాలమీద దారుణంగా చెక్కేసింది. అయినా రైతులు అంటే - చిన్న రైతూలూ వున్నారు. ఇనాందార్లున్నారు - జమీందారీలు కొనే తాహతుగల రైతూలూ ఉన్నారు. మేకల్ని గొర్రెల్ని కలిపేస్తే ఎలా? అయినా ప్రతీదానికిన్నీ అనుమానం అడ్డున్నా? విపరీతపు మిమర్శన పెట్టుకోవడమున్నూ - మనస్సు పాడుచేసుకోవడమున్నూ... అస్తమానూ ప్రపంచం మరామత్తే అని దేవుళ్ళాడితే ఇక మన తిండీ, మన తిప్పలూ, మన సంసారాలు - ఇవి జరగటం ఎల్లా?... నేనుకూడా కొంత మారుతున్నానా ఏమిటి చెప్మా? మునుపు నాకింత సుళువుగా చికాకు పడడం, కోపం రావడం వుండేది కాదు. సాయంత్రం పూరికేనే వచ్చింది వెంకన్నమీద. తమలపాకులు అయిపోయాయి. వెళ్ళి చప్పున తీసుకురారా - అని రెండుసార్లు చెప్పా. తీసుకురాలే. అరగంట అయిపోయాక ఎందుకు పిల్చారు అయ్యగారూ అంటూ వచ్చాడు. దానిమీద నాకు కోపం వచ్చి పట్టలేక రెండు చెంపకాయలు ఇచ్చా. నాడు ఏమీ అనకుండా కిందికి దిగిపోయి బజారు వెళ్ళిపోయాడు. ఆకులు తీసుకురావడానికి. మరి శాంతానికి ఎల్లా తెలిసిందో చిందులు తొక్కుతూ వచ్చింది మహా ప్రళయంలాగ, కాలభైరవి - ఇంక అదే నన్ను చీవాట్లు పెట్టడం... "నేనేమీ చెయ్యలేదు. ఎన్ని మాట్లు పిలిచినా రాకపోతే కోపం వొచ్చి - వో దెబ్బ వేశా" అన్నా. "అలా వాడిమీద చెయ్యి వెయ్యడానికి నీకేం అధికారం వుంది? నీ నవ్వుకరయినంత మాత్రాన్ని కొట్టడానికి నీకేం అధికారం? జీతం పుచ్చుకున్నంత మాత్రాన్న నీకు బానిసా వాడు - వాడికి మాత్రం అభిమానం అభిజాత్యంలేదా? యజమాని వైనంత మాత్రానికి - మర్యాదమించి ప్రవర్తించడమా?" అని ఏమిటేమిటో అంది. "నేను మాత్రం - ఎప్పుడూ నవుకర్లను కొడుతున్నానా? నాకు మాత్రం తెలీదా?" అన్నా - "ఏం మన నవుఖరుని - ఒక్కమాట వీపు చరిచినంత మాత్రాన్ని - ఏం అంత మహాపాపమూ, ఘోరమూ జరిగింది?" అన్నా. శాంతం వూరుకోలే. "ఇంతకీ వాడికో రూపాయి పారేస్తే పోయె - అంతేగా!" అన్నా. ఓహో! నీ దెబ్బ విలువ రూపాయన్నమాట"అంది. "అయినా వాడేమీ అనలేదుగా - ఎందుకీ హడావుడి?" అన్నా. "అలాంటప్పుడు కందకిలేని దురద బచ్చలికేల? అంటావు నువ్వు" అంది. "అయితే నువ్వేమిటంటావు?" అన్నా. వెంకయ్య రాగానే వాడికి క్షమాపణ చెప్పు!" అంది. "శాంతం - నువ్వు అంటే నాకు ఎంతో ప్రేమ - గౌరవం ఉంది. సాధారణంగా నీ మాట తీసేయను. కాని ఇందులో మాత్రం నాది తప్పువున్నా నౌఖరుకు మాత్రం నేను ప్రాణంపోతే క్షమాపణ చెప్పను. ఇంకా నయం!" అన్నా. దాంతో గిర్రున తిరిగి వెళ్ళిపోయింది... ఇహ - ఏం అనడం? రైతులకు వ్యతిరేకంగా నడవకూడదూ - రాజాగారి కేసు పట్టకూడదూ - జమీందారు దగ్గిర డబ్బు పుచ్చుకోకూడదూ - నవుఖరు ముందావాడిని ముట్టకూడదూ - బంట్రోతుగాణ్ణి నాయనా బాబూ అనే పనిచేయించుకోవాలీ! ఒకవేళ కోపం వచ్చి ఏదన్నా అంటే, వాడి కాళ్ళు పట్టుకుని వాడిని క్షమాపణ అర్పించుకోవాలి!... బొత్తిగా బోల్షివిక్కులా తయారువుతూందే... ఈవేళ ఇది - రేపు మరోటీ వస్తూందే-ఎల్లాగ?... మొన్న రెండు రోజులూ పెళ్ళిల్లులా వుండెను. శాంతం స్నేహితులందరూ గొప్పవాళ్ళయినా వాళ్ళతో సమాన తాహతుతో మసిలింది. శాంతం తక్కువేమిటి? నిజంగా వాళ్ళందరికంటే తెలివితేటలు గలది. బాగా చదువుకున్నదీని. వాళ్ళతో నా గురించి ఎంతో గొప్పగా చెప్పింది. నా ప్రాక్టీసు గురించి, నా సంపాదన గురించి, నా కళారాధన గురించి, నా ఆంధ్రాభిమానం గురించి ఏమిటేమిటో చెప్పింది. వింటూంటే నా మనస్సు పొంగిపోయింది. వాళ్ళుకూడా శాంతం కబుర్లు విని విరుచుకుపడిపోయారుగా! ఆవేళ రాత్రి విందు - హాస్యాలు - భోజన కాలపు ఉపన్యాసాలు - చెప్పేదేమిటి? శాంతం గురించి ఇంకా అందరికీ తెలియాలంటే నలుగురితో దోస్తీగా తిరుగుతుండాలి. లేడీ అయ్యంగారితో కలిస్తేనా? ఓ - ఇహ చెప్పటానికుందునా? అయితే నిజానికి శాంతం విజ్ఞానం, చదువు ఆవిడకెక్కడిది? లేడీ అయ్యంగారి లౌక్యం, చాకచాక్యం. చలాకీకూడా శాంతం నేర్చుకోవాలి.... అదిగో నేను ఆవిడనీ ఈవిడనీ త్రైపారవేసి చూడకూడదు. ఎప్పుడూ అలా చెయ్యను అనుకుంటూనే వుంటాను. మళ్ళీ మనస్సు అనుకోకుండా అలా వెళ్ళిపోతుంది. నేనుకూడా లేడీ అయ్యంగారిని గురించి కాస్త మర్చిపోవడానికి ప్రయత్నించాలి... ఇంతకూ శాంతానికి కొంత వ్యాపకం, వేలంబన వుండాలి. చేతినిండా ఏదో వక పని వుండాలి. ... పాపాయి వక్కర్తె అయిపోయింది కూడాను....

49 ఆమె

మొన్నరాత్రి "ఈస్టు ఎండ్ వెస్టు" క్లబ్బువాళ్ళ వార్షికోత్సవం కన్నిమేరాలో అయింది. క్లబ్బు ప్రెసిడెంటు జస్టిస్ జాన్సన్, వైస్ ప్రెసిడెంట్లు మిస్ జిన్‌వాలాన్నూ, శాస్త్రిన్నీ, శ్రక్రటరీ లేడీ అయ్యంగారున్నూ, సర్ గోవింద మీనను, నన్నూ రమ్మని చంపేదు శాస్త్రి. ఈ పల్నాదు ఖద్దరులోనే నెందుకుక్కడికి - నేనేం డాన్సు చెయ్యగలనా?

- ఇంకా వుంది.

TET Paper-II SYLLABUS



I. శిశు వికాసం - అధ్యాపనం (Child Development & Pedagogy) (marks :30)

1. శిశు వికాసం (DEVELOPMENT OF CHILD)

- వికాసం, పెరుగుదల మరియు పరిపక్వత - భావన ; స్వభావం
- వికాస సూత్రాలు మరియు విద్యలో వాటి అమలు.
- వికాసాన్ని ప్రభావితం చేసే కారకాలు - జైవిక, మనోవైజ్ఞానిక, సామాజికపరమైన, ఉద్వేగపరమైనవి.
- వికాసంలోని వివిధ అంశాలు ; వాటి పరస్పర సంబంధాలు - (భౌతిక, చాలక, సంజ్ఞాత్మక, ఉద్వేగాత్మక, సామాజిక, నైతికమైనవి). శైశవ, బాల్య, ఆరంభ, ఉత్తర బాల్య దశల్లో భాషాపరమైన అంశాలు.
- **వికాస అవగాహన** - పియాజే, కోహెల్‌బర్గ్, చోమ్‌స్కీ కార్ల్ రోజర్స్, ఎరిక్‌సన్.
- **వైయుక్తిక భేదాలు :** వైరుఖులు, సహజ సామర్థ్యాలు, ఆసక్తులు, అలవాట్లు, ప్రజ్ఞ మొదలైన అంశాలలో వ్యక్తిలో ఉండే; వ్యక్తుల మధ్య ఉండే భేదాలు - వాటిని అంచనా వేయడం.
- మూర్తిమత్వ వికాసం - భావన; మూర్తిమత్వాన్ని వికసింపజేసే కారకాలు, స్వీబ భావనలు
- సర్దుబాటు, ప్రవర్తన సమస్యలు, మానసిక ఆరోగ్యం, రక్షక తంత్రాలు
- శిశు వికాస అధ్యయన పద్ధతులు, ఉపగమాలు - అంత:పరీక్షణ, పరిశీలన, ఇంటర్వ్యూ (పరిపృచ్ఛ), కేస్ స్టడీ, ప్రయోగాత్మక పద్ధతి, అడ్డుకోత పద్ధతి, దీర్ఘకాల అధ్యయన పద్ధతి.
- వికాస కార్యక్రమాలు - ఆటంకాలు, విపత్తులు

2. అభ్యసనాన్ని అవగాహన చేసుకోవడం (UNDERSTANDING LEARNING)

- అభ్యసనం- భావన- స్వభావం, సాధనాలు- ప్రక్రియ, ఉత్పాదితాలు
- అభ్యసన కారకాలు - వ్యక్తిగత, పరిసరాలకు సంబంధించిన
- అభ్యసన ఉపగమాలు - వాటి ఆచరణాత్మక - (ప్రవర్తన వాదం- స్కిన్నర్, పావ్‌లోవ్, థార్న్‌డైక్), నిర్మితివాదం (పియాజే, వైగోట్‌స్కీ), సమగ్రాకృతివాదం (కోహెర్ల్, కోఫ్కో), పరిశీలనాత్మక వాదం (బండూరా)
- అభ్యసన విస్తృతి; సంజ్ఞానాత్మక, జ్ఞానాత్మక, నిష్పాదనపరమైన.
- ప్రేరణ - ధారణ అభ్యసనంలో వీటి పాత్ర
- స్మృతి - విస్మృతి
- అభ్యసన బదలాయింపు

3. బోధనశాస్త్ర సంబంధమైన అంశాలు (PEDAGOGICAL CONCERNS)

- బోధన - అభ్యాసకునితో మరియు అభ్యసనంతో దాని సంబంధం.
- వివిధ సన్నివేశాలలో అభ్యాసకులు - సామాజిక, రాజకీయ, సాంస్కృతిక సన్నివేశాలలో అభ్యాసకుడు.
- వివిధ సన్నివేశాలలో బాలలు - ప్రత్యేక అవసరాలు గల పిల్లలు, సంలీన విద్య (ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్)
- బోధనశాస్త్ర పద్ధతులను అర్థం చేసుకోవడం - అన్వేషణ, పరికల్పన, సర్వే, పరిశీలన, కృత్యాధార అభ్యసనం, సహకార మరియు భాగస్వామ్య అభ్యసనం
- వైయుక్తిక, సామూహిక అభ్యసనం : అభ్యసన అలవాట్లు, స్వీయ అభ్యసనం, నేర్చుకునే మెలకువలను నేర్చుకోవడం మొదలైన వాటికి సంబంధించిన అంశాలు, సవాళ్లు.
- అసమ సమూహాలలో అభ్యసనను నిర్వహించడం, సామాజిక, ఆర్థిక నేపథ్యం, సామర్థ్యాలు, ఆసక్తులు, అభిరుచులు
- **అభ్యసన నిర్వహణ సమూనాలు :** ఉపాధ్యాయ కేంద్రిత, పాఠ్య విషయ కేంద్రిత, అభ్యాసి కేంద్రిత పద్ధతులు.
- బోధన /శిక్షణా సిద్ధాంతం - బ్రూనర్
- ప్రణాళికాబద్ధమైన కార్యకలాపంగా బోధన; ప్రణాళికలోని మౌలికాంశాలు.
- బోధన దశలు - బోధనా పూర్వ, పరస్పర బోధనాంతర దశ.
- సాధారణ, విషయ సంబంధ నైపుణ్యాలు, బోధనకు కావలసిన మెలకువలు, ఉత్తమ సంధానకర్త లక్షణాలు.
- అభ్యసన వనరులు ; స్వీయ, కుటుంబ, సామాజిక, సాంకేతికపరమైనవి.
- తరగతి గది నిర్వహణ - విద్యార్థి, ఉపాధ్యాయుల పాత్ర; ఉపాధ్యాయుడి నాయకత్వశైలి, నిర్భయమైన అభ్యసన సన్నివేశాల కల్పన, ప్రవర్తన సమస్యల నిర్వహణ, మంత్రణ, మార్గదర్శకత్వాలు, దండన- చట్టబద్ధమైన అంశాలు, బాలల హక్కులు, సమయ నిర్వహణ.
- అభ్యసన కోసం మూల్యాంకనం - అభ్యసించిన అంశాల మూల్యాంకనం - వీటిమధ్య భేదాలు - పాఠశాల ఆధారిత మూల్యాంకనం, నిరంతర - సమగ్ర మూల్యాంకనం - దృక్పథాలు - ఆచరణలు.
- జాతీయ పాఠ్య ప్రణాళిక చట్రం - 2005, విద్యాహక్కు చట్టం- 2009 పరిధిలో బోధన అభ్యసనలను అర్థం చేసుకోవడం.

II. LANGUAGE-I TELUGU (CONTENT AND METHODOLOGY)

(Marks : 30)

ఎ. విషయం (మార్కులు - 24)

1. పఠనావగాహన (పద్యం, గద్యం రూపాలు)
2. తెలుగు సాహిత్యం, సంస్కృతి (ప్రాచీన, ఆధునికం, జానపదం)

- నూతన పాఠ్యపుస్తకాలలోని ఇతర తెలుగు కవులు, రచయితలు, పాత్రలు - నేపథ్యం ఇతివృత్తాలు - విశేషాంశాలు
- **ప్రక్రియలు - లక్షణాలు - వివరణలు**
- శతకాలు
- కళలు, కళాకారులు
- వేడుకలు
- గేయాలు / పాటలు

3. పదజాలం

- సామెతలు
- జాతీయాలు
- పొడుపు కథలు
- వ్యవహార రూపాలు
- అర్థాలు
- నానార్థాలు
- పర్యాయ పదాలు
- వుత్పత్త్యర్థాలు
- ప్రకృతి వికృతులు

4. భాషాంశాలు :

- ద్విత్వ, సంయుక్త సంశ్లేష అక్షరాలు, వాక్యాలు, వర్గయుక్కులు, పరుషాలు, సరళాలు, భాషాభాగాలు, లింగాలు, వచనాలు, కాలాలు, విభక్తులు, అవ్యయాలు, విరామ చిహ్నాలు, తెలుగు సంస్కృత సంధులు, సమాసాలు, క్రియలు (సమాపక, అసమాపక), వాక్యాలు రకాలు - ఆశ్చర్యార్థక, విధ్యర్థక, ప్రశ్నార్థక, సందేహార్థక, అనుమత్యర్థక, నిషేధార్థక, ప్రత్యక్ష పరోక్ష... కర్తరి- కర్మణి - ఛందస్సు, అలంకారాలు అర్థవిపరిణామం.

బి) బోధన పద్ధతులు : (మార్కులు : 6)

1. భాష, మాతృభాష, మాతృభాష బోధన లక్షణాలు
2. భాషా నైపుణ్యాలు / సాధించాల్సిన సామర్థ్యాలు, తరగతి గది అన్వయం
3. బోధన పద్ధతులు
4. ప్రణాళిక, రచన, వనరుల వినియోగం
5. బోధనాభ్యసన ఉపకరణాలు
6. నిరంతర సమగ్ర మూల్యాంకనం - నిర్మాణాత్మక మూల్యాంకనం - సంగ్రహణాత్మక మూల్యాంకనం.

III. LANGUAGE-II ENGLISH (CONTENT AND METHODOLOGY)

(Marks :30)

CONTENT (MARKS : 24)

1. Parts of Speech
2. Tenses
3. Active Voice & Passive voice
4. Prepositions and Articles
5. Degrees of comparison
6. Clauses
7. Verbs - Main Verbs- Auxulary Verbs- Phrasal Verbs
8. Adverbs - Types of Adverbs
9.Conjunction - coordinating conjunction-subordinating conjunction
10. Direct and Indirect speeches
11. Questions and question tags
12, Types of sentences - simple, compound and complex-synthesis of sentences
13. Phrases- uses of phrases.
14. Composition - letter writing - precis writing
15. Reading Comprehension
16. Vocabulary - Antonyms, Synonyms and Spellings
17. Correction of Sentences.
18. Idomatic Expression
19. Sequencing of the Sentences in Paragraph

Methodology (Marks : 06)

1. Aspects of English :(a) English language - History, nature, importance, principles of English as second language. (b) Problems of teaching / learning English.
2. Objectives of teaching English.
3. Phonetics/ Transcription
4. Development of Language skills :
(a) Listening, Speaking, Reading & Writing (LSRW)
(b) Communicative skills - Imparting values through Communication.
5. Approaches, Methods, Techniques of teaching English : (a) Introduction, definition & types of Approaches, Methods & Techniques of teaching English (b) Remedial teaching.
6. Teaching learning materials in English.
7. Lesson Planning.
8. Curriculum & Textbooks - Importance and its neeed.
9. Evaluation in English language.

IV. గణితం మరియు సైన్స్

(మార్కులు : 60)

(ఎ). గణితం కంటెంట్ (మార్కులు : 24)

1. **సంఖ్యావ్యవస్థ :** ప్రధాన సంఖ్యలు మరియు సంయుక్త సంఖ్యలు. భాజనీయతా సూత్రాలు, పూర్ణాంకాలు, పూర్ణసంఖ్యలు, భిన్నాలు, దశాంశ భిన్నాలు, క.సా.గు. మరియు గ.సా.భా., ఆకరణీయ సంఖ్యలు మరియు కరణీయ సంఖ్యలు, సంఖ్యా ధర్మాలు, వాస్తవ సంఖ్యలు, ఘాతాంక న్యాయాలు, వర్గాలు, వర్గమూలాలు, ఘనాలు, ఘనమూలాలు, చతుర్విధ పరిక్రియలతో కూడుకొన్న మరియు అక్షరాలతో చూపించబడిన తప్పిపోయిన సంఖ్యలను కనుగొనటం. సంఖ్యా నమూనాలు, సంఖ్యల పజిల్స్, యూక్లిడ్ భాగహార న్యాయం, సంవర్గమానం, భావన.
2. **అంకగణితం :** నిష్పత్తి మరియు అనుపాతం, బారువడ్డీ, చక్రవడ్డీ, కాలం-దూరం, వర్తకరుసుము, పన్ను, కాలం మరియు పని, లాభం-నష్టం.
3. **బీజగణితం :** బీజగణితం - పరిచయం, సమాసాలు, ఘాతాలు, మరియు ఘాతాంకాలు, కారణాంక విభజన, ప్రత్యేక లబ్దాలు మరియు విస్తరణలు, రేఖీయ సమీకరణాలు మరియు వాటి రేఖాచిత్రాలు, బహుపదులు, వర్గ సమీకరణాలు మరియు అనువర్తనాలు, శ్రేఢులు - భావన (అంకశ్రేఢి, గుణశ్రేఢి), అంకశ్రేఢిలో ఎన్ వ పదం మరియు ఎన్ పదాల మొత్తం. గుణశ్రేఢిలో ఎన్ వ పదం.
4. **సమితులు :** సమితి భావన, సమితి పరిభాష, శూన్య సమితి, బీపరిమిత మరియు అపరిమిత సమితులు, ఉపసమితి మరియు సమితుల సమానత్వం, సమితి కార్డినల్ సంఖ్య, సమితి పరిక్రియలు, సమితులను సూచించడం, వెన్ చిత్రాలు, వాటి ధర్మాలు.
5. **రేఖాగణితం :** రేఖాగణిత చరిత్ర, రేఖాగణితాభివృద్ధిలో భారతదేశ పాత్ర, యూక్లిడ్ రేఖాగణితం, రేఖలు మరియు కోణాలు, సరూప త్రిభుజాలు, పైథాగరస్ సిద్ధాంతం, త్రిబుజాల సర్వసమానత్వం, వృత్తాల ధర్మాలు, త్రిభుజాలు, చతుర్భుజాలు మరియు బహుభుజిలు, వృత్తభాగాలు: వృత్త నిర్మాణం, త్రిభుజాలలో రేఖల సమానత్వం మరియు చతుర్భుజాలు, వృత్తాలు మరియు త్రిభుజాలు, అనుషక్త రేఖలు, సౌష్టవం.
6. **నిరూపక రేఖాగణితం :** బిందువు నిరూపకాలు, బిందువులను గుర్తించడం, కార్టీసియన్ నిరూపక వ్యవస్థలో ($ax+by+c = 0$ రూపంలో) రెండు చరరాసుల రేఖీయ సమీకరణాలు, రేఖ యొక్క వాలు, రెండు చరరాశులలో రేఖీయ సమీకరణాలు, రేఖ యొక్క వాలుతలంలో రెండు బిందువులు, సెక్షన్ సూత్రం, త్రిభుజ వైశాల్యం, నిరూపక తలంలో సరేఖీయ బిందువులు, గురుత్వ కేంద్రం.
7. **క్షేత్రమితి :** చతురస్రం, మరియు దీర్ఘచతురస్రంల చుట్టుకొలతలు మరియు వైశాల్యాలు, త్రిభుజ వైశాల్యం, వృత్తం, మధ్య దూరం, వలయం మరియు చతుర్భుజాల వైశాల్యాలు, ఘనం, దీర్ఘఘనంల ఉపరితలాల వైశాల్యం మరియు ఘనపరిమాణం, స్థూపం, శంఖువు, గోళం అర్ధగోళం యొక్క ఉపరితల, ప్రక్కతల సంపూర్ణతల వైశాల్యం, ఘన పరిమాణాలను కనుగొనడం. ఒక రూపంలో ఉన్న ఘనాన్ని మరో రూపంలోకి మార్చడం, వివిధ ఘన సంయోగాల ఉపరితల వైశాల్యం, ఘన పరిమాణం కనుగొనడం.
8. **దత్తాంశ నిర్వహణ :** దత్తాంశ సేకరణ మరియు వర్గీకరణ, పౌన:పున్య విభాజన పట్టిక, గణన చిహ్నాలు, దిమ్మ చిత్రాలు, పటచిత్రాలు మరియు వృత్తరేఖా చిత్రాలు, వర్గీకృత అవర్గీకృత దత్తాంశాలకు సగటు, అంకమధ్యమం, మధ్యగతం, బాహుళకం కనుగొనడం, సంచిత పౌన:పున్యం పట్టిక, ఓగివ్ వక్రాలు, సంభావ్యత భావన. నిత్యజీవితంలో ఎదురయ్యే అంశాలపై సాధారణ సమస్యలు. ఏక ఘటనలు, పూరక ఘటనలు.
9. **త్రికోణమితి కోణాల కొలతల ప్రమాణం :** త్రికోణమితి పరిచయం, నిష్పత్తుల మధ్య సంబంధం, త్రికోణమితీయ నిష్పత్తుల విలువలు (00, 300, 450, 600 మరియు 900) త్రికోణమీతియ సర్వసమీకరణాలు పూరక కోణాలలో త్రికోణమితియ నిష్పత్తులు, ఊర్ధ్వకోణం, నిమ్నకోణం, సాధారణ సమస్యలు.

పెడగాజీ (మార్కులు : 6)

1. గణితం - నిర్వచనాలు- స్వభావం, గణితశాస్త్ర చరిత్ర
2. గణితశాస్త్రం ఉద్దేశాలు, విలువలు, బోధన లక్ష్యాలు
3. గణితశాస్త్ర బోధన పద్ధతులు
4. గణిత బోధనోపకరణాలు - బోధనాభ్యసన కృత్యాలు (టీఎల్ఎం)
5. బోధనా ప్రణాళిక
6. నిరంతర సమగ్ర మూల్యాంకనం (సీసీఈ) రూపన మరియు సంకలన మూల్యాంకన ప్రక్రియ మరియు విధానాలు
7. విద్యావిషయక సాధన పరీక్ష తయారీ, నిర్వహణ మరియు విశ్లేషణ
8. నిర్ధారణ, లోపపూర్వక మూల్యాంకనం
9. గణిత శాస్త్రోపాధ్యాయుడు
10. వనరుల సద్వినియోగం
11. విద్యా ప్రణాళిక, పాఠ్యపుస్తకం

IV (ఎ). సైన్స్

(మార్కులు : 30)

సైన్స్ కంటెంట్ (మార్కులు 24)

1. **సహజ వనరులు - గాలి, నీరు :** నీటి కాలుష్యం, నీరు వినియోగం, నీరు- స్థితులు, నీటి కాఠిన్యత, నీటి పీడనం

- గాలి కాలుష్యం, వాతావరణ పీడనం, గాలి పీడనం, ఆర్కిమెడిస్ సూత్రం, పాస్కల్ సూత్రం, బెర్నౌలి సూత్రం, హైడ్రోమీటరు, బారోమీటరు (భారమితి), ప్రవాహి ధర్మాలు, సాపేక్ష సాంద్రత, తలతన్యత ప్రవాహిగతి శాస్త్రం, ప్లవన సూత్రాలు, గురుత్వం, తలతన్యత, ప్రవాహి యాంత్రిక శాస్త్రం.

2. **మన విశ్వం :** సూర్యగ్రహణం, చంద్రగ్రహణం, నక్షత్రమండలం, రాశిచక్రం, అంతరిక్ష ప్రయాణం, సౌరవ్యవస్థ, ఉపగ్రహాలు, నక్షత్రాలు, తోకచుక్కలు, భూమి.
3. **సహజ దృగ్విషయం :** కాంతి, మన వస్తువులను ఎలా చూస్తాం. నీడలు కాంతి పరావర్తనం - పరావర్తన ధర్మాలు, సమతల దర్పణం మరియు ప్రతిబింబాలు, నిజ ప్రతిబింబం, పిన్ హోల్ కెమెరా, పెరిస్కోప్, కెలిడియోస్కోప్, గోళాకార దర్పణాలు మరియు ప్రతిబింబాలు, ఫెర్మట్ సూత్రం, కాంతి పరావర్తనం- అనువర్తనాలు, కాంతి వక్రీభవన ధర్మాలు, వక్రీభవన గుణకం, స్నెల్స్ నియమం, సంపూర్ణాంతర పరావర్తనం - అనువర్తనాలు, గాజు, పట్టకం, స్లాబ్‌ల గుండా కాంతి వక్రభవనం, వక్రతలాల వద్ద ప్రతిబింబం ఏర్పడే విధానం, కిరణ చిత్రాలు, మానవుని కంటి నిర్మాణం, సమదృష్టి, కనీస దూరం, దృష్టిలోపాలు, ఇంద్రధనుస్సు ఏర్పడటం, కాంతి- విక్షేపనం.

- **ధ్వని :** ధ్వనిని ఉత్పత్తి చేయు కారకాలు, ధ్వని ఉత్పత్తి మరియు మానవుని చెవి నిర్మాణం, పనిచేయు విధానం, ధ్వని లక్షణాలు, శ్రవ్య అవధి, ధ్వని కాలుష్యం, ధ్వని తరంగాలు - రకాలు, ధ్వని తరంగ లక్షణాలు, ధ్వని పరావర్తనం, ఏకో, అతి ధ్వనులు - ఉపయోగాలు, సంగీత పరికరాలు.
- **ఉష్ణం :** ఉష్ణం మరియు ఉష్ణోగ్రత, ఉష్ణోగ్రత భావన కొలవడం మరియు ఉష్ణమాపకం, **ఉష్ణం- స్థితి మార్పు :** ఉష్ణ సమతాస్థితి, ఉష్ణోగ్రతను కొలవడం, థార్మామీటర్లు- రకాలు, విశిష్టోష్ణం నిత్యజీవితంలో దాని అనువర్తనాలు, మిశ్రమాల పద్ధతి, భాష్పీభవనం, సాంద్రీకరణ, మరుగు స్థానం, ద్రవీభవన స్థానం.

4. **యాంత్రిక శాస్త్రం - శుద్ధగతిశాస్త్రం, గతి శాస్త్రం :** చలనం, నిశ్చల స్థితి - భావన, చలనంలో రకాలు, వడి, వేగం, తర్పణం, న్యూటన్ గమన నియమాలు, బలం, బలంలోని రకాలు, ఫలిత భవనం, ఘర్షణ, ఘర్షణలో రకాలు, ఘర్షణను ప్రభావితం చేసే అంశాలు, గురుత్వం, ప్రవాహి ఘర్షణ, గురుత్వాకర్షణ, న్యూటన్ గురుత్వాకర్షణ సిద్ధాంతం, గురుత్వ కేంద్రం, స్థిరత్వం, సమతాస్థితి, పని మరియు శక్తి, శక్తిలోని రకాలు, శక్తి మార్పులు.
5. **అయస్కాంతత్వం మరియు విద్యుత్తు :**

- **అయస్కాంతత్వం :** సహజ అయస్కాంతాలు మరియు కృత్రిమ అయస్కాంతాలు, అయస్కాంతాల ధర్మాలు, అయస్కాంత ప్రేరణ, అయస్కాంతాల ఉపయోగాలు, అయస్కాంతీకరణ పద్ధతులు, అయస్కాంత క్షేత్రం, అయస్కాంత బలరేఖలు.
- **విద్యుత్తు :** విద్యుత్ వలయం, ప్రాథమిక ఘటాలు, విద్యుత్ వాహకాల బంధకాలు, విద్యుత్ ఆవేశం ; విద్యుత్ క్షేత్రం, పొటెన్షియల్ భేదం, విద్యుత్ చాలక బలం, ఓమ్ నియమం, నిరోధం, విశిష్ట నిరోధం, నిరోధాన్ని శ్రేణి మరియు సమాంతర సంధానం, విద్యుత్ ప్రవాహం మరియు ఉష్ణ ఫలితాలు, విద్యుత్, సామర్థ్యం- విద్యుత్ ప్రవాహం అయస్కాంత ఫలతాలు, సోలినాయిడ్, ఫ్లెమింగ్ ఎడమచేతి నియమం, విద్యుత్ మోటార్, విద్యుత్ అయస్కాంత ప్రేరణ, ఎలక్ట్రిక్ జనరేటర్, ద్రవాల్లో విద్యుత్ వాహకత. ఎలక్ట్రో ప్లేటింగ్, ఫారడే విద్యుత్ అయస్కాంత ప్రేరణ నియమం.

6. **మనచుట్టూ ఉండే పదార్థాలు :** పదార్థం, పదార్థ స్థితులు, పదార్థాల ధర్మాలు, మిశ్రమాలు మరియు సమ్మేళనాలు, మిశ్రమాలను వేరుచేయు విధానం, దారాలు, కృత్రిమ దారాలు, వాటిలో రకాలు, ప్లాస్టిక్‌లు - వాటిలోని రకాలు, ప్లాస్టిక్ ఉపయోగాలు మరియు పర్యావరణం, ఆమ్లాలు, క్షారాలు మరియు లవణాలు, తటస్థీకరణ చర్య, లోహాలు, అలోహాలు, వాటి భౌతిక మరియు రసాయన ధర్మాలు, నేల బొగ్గు మరియు పెట్రోలియం, దహనం, దహనంలోని కరాలు, కెలొరిఫిక్ విలువ.

- ఇంకా వుంది





జేఎఫ్‌కే ఎయిర్‌పోర్టులో విమానాలు ఢీ

న్యూయార్క్ : జాన్ ఎఫ్ కెన్నడీ అంతర్జాతీయ విమానాశ్రయంలో శనివారం 2 విమానాలు ఢీ కొన్నాయి. శీతాకాలం మంచు దట్టంగా అలుముకోవడంతో చైనా సదరన్- కువైట్ ఎయిర్ వేస్ ఒకదానిని ఒకటి ఢీ కొన్నాయి. చైనా ఎయిర్ క్రాఫ్ట్ కుడి రెక్క, కువైట్ ఎయిర్ వేస్ తోకకు బలంగా తాకడంతో రెండు విమానాలకు నష్టం వాటిల్లిందన్నారు. చైనా విమానంలో ప్రయాణీకులు ఎవరూ లేరని కువైట్ విమానంలో నుంచి ప్రయాణీకులను జాగ్రత్తగా దగ్గర్లోని హోటళ్లకు తరలించారన్నారు. తుఫాను తాకడంతో గురువారం ఉదయం 11 గంటలకు జేఎఫ్‌కేను మూసివేసి మరుసటి రోజు ఉదయం 7 గంటలకు ప్రారంభించారు. దీంతో గంటలతరబడి ప్రయాణీకులు విమానాశ్రయంలో ఎదురు చూడవలసి వచ్చింది.

కొందరి లగేజ్ విమానం నుంచి దించడం కూడా అసాధారణ ఆలస్యానికి గురైంది. ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ తలెత్తలేదని సాయంత్రం 10.25 ల్యాండ్ అయిన విమానంలోంచి తెల్లవారు జాము 3.50కు కూడా దిగలేని పరిస్థితి తలెత్తిందని ఫ్రాన్స్‌కు చెందిన ప్రయాణీకుడు ట్వీట్ చేశారు.

అమ్మో... ఆధార్

80వేల మందిని పట్టించేసింది



న్యూఢిల్లీ: తమ అనుబంధ కళాశాలల్లో పని చేసే ఉపాధ్యాయులు, చదువుకునే విద్యార్థులు తప్పనిసరిగా ఆధార్‌ను సమర్పించాలని విశ్వవిద్యాలయ నిర్వాహకులు కోరారు. దీంతో వారంతా తమ ఆధార్‌ను అందజేశారు. తీగ లాగితే డొంక అంతా కదిలినట్లు.. ఈ ఆధార్ సమర్పణ ద్వారా నమ్మలేని నిజాలు బయటికి వచ్చాయి. సుమారు 80వేల మంది ఉపాధ్యాయులు ఒకటి కంటే ఎక్కువ చోట్ల పని చేస్తున్నట్లు ఇందులో తేలింది. డూప్లికేషన్‌ను తగ్గించాలన్న పథకంతో కేంద్రం.. దేశవ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాలకు తమ ఆధీనంలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తోన్న, చదువుతోన్న విద్యార్థుల ఆధార్‌ను తీసుకోవల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు తమ ఆధార్‌ను అందించారు. ఇందులో ఏమని తెలిసిందంటే.. సుమారు 80వేల మంది ఉపాధ్యాయులు ఒకటి కంటే ఎక్కువ చోట్ల విధులు నిర్వహిస్తున్నట్లు తేలింది. వీరిపై త్వరలోనే చర్యలు తీసుకుంటామని హెచ్ఆర్‌డీ మంత్రి ప్రకాశ్ జావడేకర్ తెలిపారు. 'కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో పని చేసేవారు ఎవరూ ఈ జాబితాలో లేరు. రాష్ట్రాలకు సంబంధించిన విశ్వవిద్యాలయాల్లో ఎక్కువ మంది ఉన్నారు' అని మంత్రి తెలిపారు. 'ఆధార్‌ను సమర్పించేందుకు అపోహల కారణంగా కొందరు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మీ మొబైల్ నంబర్ ఎలా ఇతరులతో పంచుకుంటున్నారో ఇదీ అంతే. ఆధార్ నంబర్ ఇస్తే మీ వ్యక్తిగత సమాచారం అంతా తెలుస్తోంది అన్నది అపోహ మాత్రమే. ఇలాంటివి నమ్మొద్దు' అని మంత్రి జావడేకర్ ఈ సందర్భంగా సూచించారు.

లాలూ రోజు కూలీ రూ.93!

రాంచీ: కుంభకోణాలతో కోట్లు గడించిన ఆర్జేడీ చీఫ్, బీహార్ మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్.. ఇప్పుడు రోజు కూలీ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దాణా కుంభకోణంలో మూడు న్నరేళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్న లాలూకు.. జైల్లో ఇప్పుడు రూ.93 రోజుకూలీ చెల్లిస్తున్నారు. రాంచీలోని బిర్సా ముండా జైల్లో ఉన్న లాలూ.. తోట మాలి పని చేయాల్సి ఉంటుంది. దీనికోసం ఆయనకు ఇచ్చే వేతనమిది. మరోవైపు ఈ కేసులో తాను దోషిగా తేలడం, శిక్షపై లాలూ ఓ ఓపెన్ లెటర్ రాసి ట్విట్టర్ ద్వారా ప్రజలతో పంచుకున్నారు. హిందీలో రాసిన ఈ లేఖలో.. తనకు విధించిన శిక్షతో తానేమీ భయపడటం లేదని, తన రాజకీయ సిద్ధాంతాలైన లౌకికవాదం, దళితులు, వెనుకబడిన వర్గాల హక్కుల పోరాటంలో ఎలాంటి రాజీ ఉండబోదని స్పష్టం చేశారు. బీజేపీ, ఆరెస్సెస్, మనువాదులు లక్ష్యంగా లాలూ విమర్శ నాస్త్రాలు సంధించారు. బీజేపీ తనపై చేతబడి చేయించిందని మరో ట్వీట్‌లో లాలూ ఆరోపించారు. మాతో కలిసి రండి.. లేదా మిమ్మల్ని ఇరికిస్తామన్న బీజేపీ రూల్‌ను పాటించడం కంటే.. తాను సామాజిక న్యాయం, సమానత గురించి పోరాడుతూ చనిపోతానని లాలూ స్పష్టంచేశారు. దాణా కుంభకోణంలో సీబీఐ ప్రత్యేక కోర్టు జడ్జి లాలూకు మూడున్నరేళ్ల జైలు, రూ.10 లక్షల జరిమానా విధించిన విషయం తెలిసిందే.

ఎయిరిండియా ప్రైవేటీకరణ ఇప్పుడే వద్దు

పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సలహా



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ విమానాయాన సంస్థ ఎయిరిండియాను ప్రైవేటీకరణ చేయడానికి ఇది సరైన సమయం కాదని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పేర్కొంది. అప్పుల ఊబి నుంచి బయట పడేందుకు ఆ సంస్థకు కనీసం ఐదు సంవత్సరాల సమయం ఇవ్వాల్సిందిగా సూచించింది. ఎయిరిండియాలో పెట్టుబడుల ఉపసంహరణపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని మరోసారి పునఃపరిశీలించాల్సిందిగా కమిటీ వెల్లడించింది. అప్పుల్లో కూరుకుపోయిన ఎయిరిండియాకు ఉపశమనం కలిగించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సిందిగా సూచించింది. దీనికి సంబంధించిన సవరణలు చేసిన ఓ ముసాయిదాను పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ రూపొందించింది. టర్న్ ఎరౌంట్ ప్లాన్(టీఏపీ), ఆర్థిక పునర్నిర్మాణ పథకం(ఎఫ్ఆర్‌పీ) కింద అప్పుల్లో ఉన్న ఎయిరిండియా కోలుకునేందుకు 2012 నుంచి 2022 వరకు సమయం ఇచ్చింది. అదే విధానాన్ని ప్రభుత్వం పరిశీలించాలి. ఆ గడువు ముగిసే లోపు ఎయిరిండియా ప్రదర్శన ఎలా ఉందనే దాన్ని పరిగణలోకి తీసుకొని నిర్ణయం తీసుకోవాల్సిందిగా ప్యానెల్ తన నివేదికలో పేర్కొంది. ఎయిరిండియా వాటాదారుల వాదనను ప్యానెల్ పరిశీలించింది. ఇప్పుడిప్పుడే ఎయిరిండియా లాభాలను ఆర్జించడం జరుగుతోంది, అటువంటి సమయంలో పెట్టుబడుల ఉపసంహరణ నిర్ణయం సరైనది కాదని ప్యానెల్ అభిప్రాయం వ్యక్తం చేసింది. ఎయిరిండియా అనుబంధ సంస్థలు ఎయిరిండియా ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ సర్వీసెస్ లిమిటెడ్(ఏఐఏటీఎస్ఎల్), ఎయిరిండియా ఎస్ఏటీఎస్ ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏఐఎస్ఏటీఎస్), అలియెన్స్ ఎయిర్ అండ్ ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ లాభాల్లో పయనిస్తున్నాయని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పేర్కొంది. అందువల్ల ఈ యూనిట్లను తొలగించడం సరైనది కాదని తెలిపింది. ప్రైవేటీకరణ నిర్ణయం వల్ల ఆయా సంస్థల్లో పనిచేస్తున్న పలువురు తమ ఉద్యోగాలను కోల్పోవలసి వస్తుందని ప్యానెల్ ఆందోళన వ్యక్తం చేసింది. ఒక వేళ ఎయిరిండియా వాటాలను అమ్మాలనుకున్నప్పుడు అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులకు వేరే మార్గం చూపించాల్సిందిగా ప్యానెల్ తన నివేదికలో పేర్కొంది. ఎయిరిండియాకు 2017 మార్చి వరకు రూ.48,877కోట్ల మేర అప్పులు ఉన్నాయి. వాటిలో ఎయిర్‌క్రాఫ్ట్ రుణాలు రూ.17,360కోట్లు కాగా.. వర్కింగ్ క్యాపిటల్ రుణం రూ.31,517కోట్లు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ఎయిరిండియాను ప్రైవేటీకరణ చేయడం వల్ల కొంతమేర అయినా అప్పుల నుంచి ఉపశమనం పొందే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గతేడాది ఎయిరిండియా ప్రైవేటీకరణకు కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది.

విస్తరణ దిశగా స్టోర్‌కింగ్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : గ్రామీణ భారతావనిలో విస్తరణే లక్ష్యంగా స్టోర్‌కింగ్ అభివృద్ధి ప్రణాళికలకు రూపకల్పన చేసింది. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి, స్థానిక యువతలో నైపుణ్యం పెంచడమే లక్ష్యంగా దేశవ్యాప్తంగా 44 వేల స్టోర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. క్సియోమీ, అమెజాన్, పతంజలి, హెచ్‌యూఎల్, పీఅండ్‌జీ, ఇండో నిస్సాన్, హిమాలయ, లెనొవో, శామ్‌సంగ్, గూగుల్ తదితర కంపెనీలతో కదుర్చుకున్న డీల్స్‌లో భాగంగా కస్టమర్లకు స్టోర్‌కింగ్ షాప్ కీపర్లు సహాయం చేసి, వారికి 48 గంటల్లోనే కోరుకున్న ఉత్పత్తులను అందజేస్తారని సంస్థ వ్యవస్థాపక సీఈఓ శ్రీధర్ గుండయ్య వెల్లడించారు. తెలుగు రాష్ట్రాల్లో నిరుద్యోగ యువతకు తాము ఉపాధి అవకాశాలను కల్పించనున్నట్లు ఆయన తెలిపారు.

స్టార్టప్‌ల కోసం బిజినెస్ యాక్సిలేటర్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: స్టార్టప్‌ల కోసం వాద్వానీ ఫౌండేషన్ అనే సంస్థ నేషనల్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో బిజినెస్ యాక్సలేటర్ డబ్ల్యుఎఫ్ వెంచర్ స్కేప్‌లను హైదరాబాద్, పూణే నగరాల్లో ప్రారంభించినట్లు వాద్వానీ సంస్థ సీఈఓ డాక్టర్ అజయ్ కేలా తెలిపారు. వినియోగదారులు, క్యాష్, కెపాసిటీపై కేంద్రీకృత కోచింగ్, కన్సెల్టింగ్‌ను అందిస్తున్నట్లు చెప్పారు. యూఎస్ కేంద్రంగా ఉన్న యూష్ మౌర్య స్టార్టప్‌తో వీడియో కాన్ఫరెన్సు లేదా వ్యక్తిగతంగా సంభాషించి ఈ కార్యక్రమాన్ని ప్రయోజనాన్ని తెలుపుతారన్నారు. భారతదేశంలో ఇప్పుడు 140 యాక్సలేటర్లు ఉన్నాయన్నారు. చైనాలో 1500 ఇంక్యుబేటర్లు, యాక్సలేటర్లు ఉన్నాయన్నారు. ఈ నెల 8వ తేదీలోపు డబ్ల్యుఎఫ్ఎన్ఈఎన్ ఆర్గ్‌వద్ద స్టార్టప్‌లను నమోదు చేసుకోవచ్చన్నారు.

హాఫీజ్ సయీద్ సంస్థలకు విరాళమిస్తే 10ఏళ్లు జైలు



ఇస్లామాబాద్: ముంబయి పేలుళ్ల ప్రధాన సూత్రధారి, అంతర్జాతీయ ఉగ్రవాది హాఫీజ్ సయీద్‌కు చెందిన సంస్థలకు విరాళాలిస్తే జైలు శిక్షను ఎదుర్కొవాల్సి వస్తుందని పాక్ అంతర్గత వ్యవహారాలశాఖ వెల్లడించింది. సయీద్‌కు చెందిన ఉగ్రవాద సంస్థ జమాత్-ఉల్-దవా(జేయూడీ), ఫలాఫ్-ఈ- ఇన్సానియత్ ఫౌండేషన్(ఎఫ్ఐఎఫ్) సంస్థలను బ్లాక్ లిస్ట్‌లోకి చేర్చింది. మొత్తం 72 నిషేధిత సంస్థల జాబితాను బ్లాక్ లిస్ట్‌లోకి చేర్చినట్లు పాక్ ఇంటీరియర్ మినిస్ట్రీ మీడియా ద్వారా నోటీసులు జారీ చేసింది. ఈ సంస్థలను అక్కడ ఛారిటీలుగా పరిగణిస్తారు. ఈ నిషేధిత సంస్థలకు విరాళాలు అందజేస్తే 10ఏళ్ల జైలు శిక్షను ఎదుర్కొవాల్సి వస్తుందని, దీంతో పాటు భారీ జరిమానా కూడా విధించనున్నట్లు నోటీసుల్లో పేర్కొన్నారు. దీనికి సంబంధించిన ప్రకటనలను పాక్ అన్ని మీడియా, పత్రికల్లోను విడుదల చేసింది. ఈ నిషేధిత సంస్థలకు విరాళాలు ఇవ్వడాన్ని నేరంగా పరిగణిస్తారు. అక్రమ దారుల్లో ఉగ్రవాద సంస్థలకు నిధులు చేరడాన్ని అడ్డుకునేందుకు ఈ చర్యలు చేపట్టారు. ఇప్పటికే సయీద్‌కు చెందిన జేయూడీ, ఎఫ్ఐఎఫ్ సంస్థల ఆస్తులను జప్తు చేసేందుకు పాక్ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. పాక్‌కు అమెరికా నుంచి అందే రక్షణ, భద్రతా సాయం నిలిపివేస్తున్నట్లు ప్రకటించిన తర్వాత పాక్ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఉగ్రవాదులపై చర్యలు తీసుకోవడం లేదన్న కారణంతో పాకిస్థాన్‌కు ఏటా ఇచ్చే 1.15 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.7,290 కోట్లు) భద్రత సాయాన్ని అమెరికా ప్రభుత్వం శుక్రవారం నిలిపివేసిన విషయం తెలిసిందే.ఇందులో 2016 సంవత్సరానికి కాంగ్రెస్ ఆమోదించిన 255 మిలియన్ డాలర్ల (రూ.1,616 కోట్లు) విదేశీ మిలటరీ నిధులు కూడా ఉన్నాయి. ఇదికాకుండా రక్షణ శాఖ సంకీర్ణ మద్దతు నిధులకింద 2017 సంవత్సరానికి కేటాయించిన మొత్తం 900 మిలియన్ డాలర్ల (రూ.5,703 కోట్లు)ను, ముందు సంవత్సరాల్లో ఖర్చుకాకుండా మిగిలిన నిధులను కూడా రద్దు చేసింది.

డమాస్కస్‌కు తిరిగివచ్చిన 1,500 కుటుంబాలు



డమాస్కస్ : లెబనాన్ యుద్ధం నేపథ్యంలో పట్టణాలను వదిలివెళ్లిన అనేక కుటుంబాలు మళ్లీ చేరుకుంటున్నాయి. ఆదేశ రాజధాని డెమాస్కస్‌లోకి 1,500 కుటుంబాలు తిరిగి వచ్చాయని న్యూస్ ఏజెన్సీ 'సన' తెలిపింది. తిరుగుబాటుదారులను ఈశాన్య సిరియాకు తరిమికొట్టి, జబదానిని సైనికులు స్వాధీనం చేసుకోవడంతో తరలివెళ్లిన 10 వేల కుటుంబాలు తిరిగి వస్తున్నాయి. యుద్ధంలో కూలిన భవనాల శిధిలాలను తరలించడానికి కాంట్రాక్టు ఒప్పందం జరిగిందని డమాస్కస్ గవర్నర్ అలా ఇబ్రహీం తెలిపారు. 2012 నుంచి జరుగుతున్న అంతర్యుద్ధంలో ఈ పట్టణం పూర్తిగా శిధిలమైంది. సిరియా-లెబనాన్‌ల సరిహద్దుల నుంచి తిరుగుబాటు దార్లు ఆయుధాలు సమకూర్చుకోవడంతో ఈ ప్రాంతాల ప్రజలంతా శరణార్థులుగా మారారు. డెమాస్కస్‌ను కాపాడటంలో లెబనాన్ హిజ్బుల్లా గ్రూప్ కీలక పాత్ర వహించింది.

పాక్‌పై విధానంలేని కేంద్రం

కపిల్ సిబల్ విమర్శ



న్యూఢిల్లీ : కాంగ్రెస్ నాయకులు కపిల్ సిబల్ ఆదివారం కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంపై విమర్శ నాస్త్రాలు సంధించారు. ఆ ప్రభుత్వానికి ఎటువంటి విధానం లేదన్నారు. ప్రత్యేకించి పాకిస్థాన్‌ను ఎదుర్కోవడానికి సంబంధించి నిర్దిష్ట విధానం ఏదీలేదని చెప్పారు. ఇక్కడ ఒక వార్తా సంస్థతో ఆయన మాట్లాడుతూ, "ప్రభుత్వం తన విధానాన్ని వెల్లడించాలి. లేదా ప్రతి రోజూ మన భద్రతా దళాలను చంపుకుంటూరా? పాకిస్థాన్‌కు సంబంధించిన ప్రభుత్వ విధానాన్ని నేను తెలుసుకోగోరుతున్నాను. ఒక పక్క పాకిస్థాన్ రోజుకొక హత్య చేస్తోంది. మనకేమో పాకిస్థాన్‌కు సంబంధించి ఎటువంటి విధానం లేదు" అని అన్నారు. అంతకుముందు ఈ రోజు ఉదయం సిబల్ ట్విట్టర్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. "మోడీ వాక్చాతుర్యం పడిపోయింది. సైనికులు, పోలీసులు నిత్యం అమరులవుతున్నారు. ప్రాణాలు కోల్పోవడాన్ని నిలువరించడం ఎప్పటికి సాధ్యమవుతుందో ప్రభుత్వం వివరించగలదా?" అని ప్రశ్నించారు. ఇదే అంశంపై ఆయన మాట్లాడుతూ, 2014 నుండి 2017 వరకు మృతి చెందిన పౌరులు, భద్రతా సిబ్బంది సంఖ్య రెట్టింపు అయిందని గణాంకాలను వివరించారు. "మనకు ఎటువంటి విధానం లేకపోవడం అత్యంత విచిత్రమైన చర్య. 2014 నుండి 2017 వరకు గణాంకాలను కనుక మీరు చూస్తే హత్యకుగురవుతున్న పౌరులు, భద్రతా సిబ్బంది సంఖ్య రెట్టింపు అయింది. అదేవిధంగా చనిపోతున్న తీవ్రవాదుల సంఖ్య కూడా పెరుగుతోంది" అని సిబల్ తెలిపారు. ఎన్డీయే ప్రభుత్వం తన విధానాన్ని ప్రజలకు వివరించాలని సిబల్ కోరారు. "పాకిస్థాన్ పట్ల వారు గట్టి, మెతక వైఖరిని అనుసరిస్తున్నారు. పెద్ద సంఖ్యలో సైనికులు హత్యకుగురవుతున్నా వారేమి చేస్తున్నారో అర్థం చేసుకోవడం కష్టంగా ఉన్నది" అని సిబల్ తెలిపారు.

ఢిల్లీలో 9రోజులు వెయ్యి విమానాలు రద్దు!

గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్ణయం




న్యూఢిల్లీ: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం సుమారు వెయ్యి విమాన సర్వీసులను రద్దు చేయనుంది. ఈ మేరకు అన్ని విమానయాన సంస్థలకు నోటీసులు అందాయి. జనవరి 18 నుంచి 26 వరకు రోజూ గంట 45 నిమిషాల పాటు ఎటువంటి విమాన సేవలు ఉండబోవు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.15 వరకు విమాన సేవలను నడపొద్దని నోటీస్ టు ఎయిర్‌మెన్ (ఎన్‌వోటీఏఎం) ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆయా సమయాల్లో వెళ్లాల్సిన విమాన సర్వీసులు రద్దు కానున్నాయి. ఏటా గణతంత్ర దినోత్సవం సమయంలో విమానాలను రీషెడ్యూల్ చేయడం జరుగుతుంది. కానీ, ఈ ఏడాది మాత్రం విమాన సర్వీసులను రద్దు చేశారు. ఏటా రిపబ్లిక్ డే వేడుకల సందర్భంగా ఆరు రోజులు మాత్రమే ఇలా విమాన సేవలకు అంతరాయం ఏర్పడేది. కానీ ఈ ఏడాది దాన్ని తొమ్మిది రోజులకు పెంచారు. రిపబ్లిక్ డే క్లోజర్ పీరియడ్‌గా దీన్ని పిలుస్తారు. స్వదేశీ విమానాలు ఆయా సమయాల్లో ఉన్న విమానాలను రద్దు చేసుకోవాల్సిందిగా ఎన్‌వోటీఏఎం ఆదేశాలు జారీ చేసింది. ఇక అంతర్జాతీయ విమానయాన సంస్థలు ఆ సమయంలో నడిచే విమానాలను రీషెడ్యూల్ చేశాయి. ఇలా విమాన సేవలను రద్దు చేయడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని విమానయాన సంస్థలు అభిప్రాయపడుతున్నాయి. రిపబ్లిక్ డే క్లోజర్ పీరియడ్ కారణంగా రోజుకు వంద విమానాల వరకు రద్దు కానున్నాయి. ఇప్పటికే పొగమంచు కారణంగా ఢిల్లీ విమానాశ్రయంలో గత వారం నుంచి పలు విమాన సేవలు రద్దవుతున్నాయి. దీనిపై విమాన సంస్థలతో చర్చించేందుకు దిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (డీఐఏఎల్) సోమవారం ప్రత్యేకంగా సమావేశం కానుంది.

ఖైదీలకు భలే ఉపాధి

స్టేషనరీగా మారనున్న రద్దయిన నోట్లు





చెన్నై: రద్దయిన పాత నోట్లు కొత్త రూపు సంతరించు కోనున్నాయి. ఎటూ కాకుండా పోయిన నోట్లు ఎట్టకేలకు జైలుకు చేరుకున్నాయి. అయితే ఇక్కడి పూజల్ కేంద్ర కారాగారంలోని జీవిత ఖైదీలు ఇపుడు రద్దయిన పాత నోట్లకు కొత్త రూపు ఇవ్వనున్నారు. ఆ నోట్లను రీసైకిలింగ్ చేయడం ద్వారా స్టేషనరీగా మార్పు చేసే ఉపాధి అవకాశం వారికి లభించింది. ఉన్నతాధికారి ఒకరు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ విభాగాలు, వాటి సంస్థలలో ఆ స్టేషనరీని వినియోగిస్తామని తెలిపారు. జైలులో జీవిత ఖైదీ అనుభవిస్తున్న సుమారు 25-30 మందితో కూడిన ప్రత్యేకంగా శిక్షణ పొందిన బృందం ప్రతి రోజూ హ్యాండ్ మేడ్ స్టేషనరీ తయారీ యూనిట్ వద్ద 'ఫైల్ ప్యాడ్స్'గా పిలవబడే స్టేషనరీని తయారు చేస్తారు. 'ఇందుకోసం భారత రిజర్వు బ్యాంకు 70 టన్నుల నిషిద్ధ నోట్లను అందించే ప్రతిపాదన చేయగా, పూజల్ జైలు అధికారులు ఇప్పటి వరకు 9 టన్నుల రద్దయిన నోట్లను తీసుకున్నారు. మిగతా వాటిని దశలవారీగా తీసుకుంటాం' అని తమిళనాడు జైళ్ల విభాగం డీఐజీ(ఇన్‌ఛార్జి) ఎ.మురుగేశన్ తెలిపారు. ఫైల్ ప్యాడ్స్ తయారీకి ఇప్పటి వరకు 1.5 టన్నుల రద్దయిన నోట్లను వినియోగించామన్నారు. ప్రతి రోజూ సుమారు 1,000 ఫైల్ ప్యాడ్స్‌కు నిషేధిత నోట్లను వినియోగిస్తున్నట్లు ఆయన వివరించారు. రద్దయిన నోట్లను తొలుత పల్ప్‌గా తయారు చేసిన తర్వాత డై-అచ్చులో పోయడం ద్వారా పటిష్టం చేస్తారు. అంతిమంగా చేతి తయారీ ప్రక్రియలో హార్డ్ ప్యాడ్స్‌గా రూపొందిస్తారు. నిషేధిత నోట్లతోపాటు ప్రత్యేకించి ఖాదీ నుంచి సేకరించిన హార్డ్ ప్యాడ్స్ వినియోగించి కూడా ఫైల్ ప్యాడ్స్‌గా తయారు చేస్తారని అధికారి చెప్పారు. ఎరుపు రంగు క్లాత్‌తో హార్డ్ ప్యాడ్, ఇక ముడుచుకున్న ఆకారంలోని ఫైల్ ప్యాడ్‌లను ప్రభుత్వ కార్యాలయాలలో వినియోగిస్తారు. వీటిలో అత్యవసర, సాధారణ గుర్తులతో కవర్ ట్యాగ్‌లు ఉంటాయి. ఫైల్ ప్యాడ్ తయారీకి నెలలో 25 రోజులపాటు ఖైదీలు పని చేస్తారు. నైపుణ్యానికి అనుగుణంగా వీరికి వేతనం ఎనిమిది గంటల పనికి రూ.160 నుంచి రూ.200 మధ్య ఉంటుంది. కాగా ఉత్పత్తిని పెంచేందుకు సెమీ ఆటోమేటెడ్ సదుపాయంతో పూజల్‌లోని చేతితో తయారు చేసే యూనిట్‌ను ఆధునీకరించే ప్రతిపాదన ఒకటి ఉంది. ఫైల్ ప్యాడ్స్ వంటి వాటి తయారీకి మదురై, సేలం, వెల్లూరుతో సహా తమిళనాడులోని మరో ఆరు జైళ్లు ఉన్నప్పటికీ, రద్దయిన నోట్లతో స్టేషనరీ తయారీ కేంద్రంగా పూజల్ కేంద్ర కారాగారం మాత్రమే ఉంది. తమిళనాడులో ప్రతి నెలా సుమారు 1.5 లక్షల ఫైల్ ప్యాడ్స్ తయారీ అవుతున్నాయి. పూజల్‌లో షూ పాలిష్ తయారీ విభాగం, వెల్లూరులో చర్మ ంతో బెల్టులు తయారీ చేసే విభాగం, తిరుచిరాపల్లిలో సబ్బుల తయారీ, కడలూరు యూనిట్‌లో టోపీల తయారీ విభాగాలు ఉన్నాయని పోలీసు ఉన్నతాధికారి చెప్పారు.



సినీవిస్టా స్టూడియోలో అగ్ని ప్రమాదం

ఒకరి మృతి, వంద మందికి తప్పిన ముప్పు

ముంబై: గత రాత్రి అగ్ని ప్రమాదం సంభవించిన ముంబైలోని సినీవిస్టా స్టూడియో నుంచి ఒక మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ప్రమాదం జరిగినపుడు స్టూడియోలో ఒక టీవీ సీరియల్ షూటింగ్ జరుగుతోంది. ఆ సమయంలో అక్కడ పని చేస్తున్న వంద మందికిపైగా ఉన్న సిబ్బంది తృటిలో ప్రమాదాన్ని తప్పించుకున్నారు. రెండు గంటలపాటు మంటలు కొన సాగాయి. అయితే ఎవరూ గాయపడినట్లు సమాచారం లేదు. కలర్స్ టీవీ చానల్ ప్రసారం చేసే బెపన: సీరియల్ షూటింగ్ జరుగుతున్న సమయంలో సుమారు 8 గంటలకు స్టూడియోలో అగ్ని ప్రమాదం సంభవించిందని స్టూడియో ఆఫీసు బేరర్ రాకేష్ కుమార్ తెలిపారు. మంటలను గుర్తించిన వెంటనే అగ్నిమాపక దళానికి సమాచారం అందించామన్నారు. అగ్నిమాపక అధికారి మాట్లా డుతూ రాత్రి సుమారు 8.10 గంటలకు సమాచారం అందగానే సంఘటనా స్థలికి చేరుకున్నామన్నారు. ఎనిమిదికిపైగా అగ్నిమాపక శకటాలు, ఆరు జంబో వాటర్ ట్యాంకర్లు, ఒక వైమానిక నిచ్చెన, అంబులెన్స్ స్టూడి యోకు వచ్చినట్లు వివరించారు. స్టూడియోకు చెందిన ఎయిర్ కండీషనర్‌లలో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగి ఉండవచ్చని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. కాగా రాత్రి 9.35 గంటలకు మంటలు అదుపులోకి వచ్చినట్లు వివరించారు. ప్రమాద ఘటనపై దర్యాప్తు జరుపుతున్నట్లు అగ్నిమాపక శాఖ ప్రధానాధికారి తెలిపారు. 1982లో ఏర్పాటు చేసిన సినీవిస్టా స్టూడియోను ఐదెకరాలకుపైగా విస్తీర్ణంలో నిర్మించారు.

ఇక అన్ని ఫోన్లకూ వైర్‌లెస్ ఛార్జింగ్!

వాషింగ్టన్: ఖరీదైన ఫోన్లకు మాత్రమే పరిమితమైన వైర్‌లెస్ ఛార్జింగ్ సదుపాయాన్ని ఇకపై అన్ని ఫోన్లు, పరికరాలకూ వాడుకోవచ్చు. ఫ్రాన్స్‌కు చెందిన ఓ అంకుర సంస్థ చేసిన ఎనర్జీస్క్వేర్ అనే ఆవిష్కరణతో ఇది సాధ్యపడింది. ఎనర్జీస్క్వేర్‌లో రెండు భాగాలుంటాయి.

ఒకటి లోహపు స్టిక్కర్. దీన్ని ఫోన్ వెనుకవైపు అతికించుకుని ఛార్జింగ్ పోర్ట్‌తో అనుసంధానించుకోవాలి. మరొకటి అతిసన్నని ఛార్జింగ్ ప్యాడ్. దీనికి విద్యుత్ సరఫరా అందించాలి. ఈ ప్యాడ్‌పై స్టిక్కర్‌తో సున్న ఫోన్ పెట్టగానే.. అది నేరుగా ఛార్జ్ అవుతుంది. ఇలా స్టిక్కర్ అంటించిన వివిధ పరికరాలను.. ప్యాడ్‌పై ఉంచి ఒకేసారి ఛార్జ్ చేసుకునే వీలుంది. ప్రస్తుతం వైర్‌లెస్ ఛార్జింగ్ కోసం విద్యుదయస్కాంత (ఎలక్ట్రో మ్యాగ్నెటిక్) ఇండక్షన్ విధానాన్ని ఉపయోగిస్తున్నారు. ఎనర్జీస్క్వేర్ మాత్రం విద్యుత్ వాహకత (ఎలక్ట్రిక్ కండక్షన్)పై ఆధారపడి పనిచేస్తుంది. సాధారణ పద్ధతిలో ఛార్జింగ్ అయ్యేంత వేగంతోనే.. ఎనర్జీస్క్వేర్‌తోనూ పరికరాలు ఛార్జ్ అవుతాయి.

నోట్ల రద్దు, జీఎస్‌టీతో నష్టపోయా..

- ప్రధాని మోడీ, సీఎం రావత్ నా గోడు పట్టించుకోలేదు
- విషం తాగి వ్యాపారి ఆత్మహత్యాయత్నం.. పరిస్థితి విషమం
- ఉత్తరాఖండ్ బీజేపీ కార్యాలయంలో కలకలం



న్యూఢిల్లీ : ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకున్న నోట్ల రద్దు, జీఎస్‌టీ వంటి చర్యలు సామాన్య ప్రజలను, వ్యాపారులను నిలువునా ముంచాయి. నోట్ల రద్దు సమయంలో డబ్బు మార్చుకోలేక పేదలు, రైతులు ప్రాణాలు కోల్పోయారు. కొంతమంది బ్యాంకుల వద్ద లైన్లలో గుండెపోటుకు గురికాగా, మరికొంతమంది ఆందోళనకు గురై ఆత్మహత్యకు పాల్పడ్డారు. మోడీ ప్రభుత్వ హడావుడి, అసంబద్ధ చర్యల ప్రభావం ఇంకా కొనసాగుతూనే ఉంది. తాజాగా ఉత్తరాఖండ్‌లోని హద్వానీ ప్రాంతానికి చెందిన ఒక వ్యాపారి నోట్ల రద్దు, జీఎస్‌టీలు తన జీవితాన్ని నాశనం చేశాయన్న ఆవేదనతో విషం తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ సంఘటన డెహ్రాడూన్ బీజేపీ కార్యాలయంలో చోటుచేసుకుంది. జనతా దర్బార్‌లో బీజేపీ మంత్రి సుబోధ ఉనియాల్ ప్రజా సమస్యలు వింటున్నారు. అదే సమయంలో పాండే అనే వ్యాపారి కార్యాలయంలోకి వచ్చి కేంద్ర ప్రభుత్వ విధానాల కారణంగా తన రవాణా వ్యాపారం దెబ్బతిన్నదని ఫిర్యాదు చేశాడు. నోట్ల రద్దు, అదే సమయంలో జీఎస్‌టీ అమలు కారణంగా వ్యాపారంలో నష్టపోయాయని, కేంద్రం, త్రివేంద్ర రావత్ నేతృత్వంలోని ప్రభుత్వాలను నిందించాడు. కెమేరాకు చిక్కిన ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. 'ముజే పరేషాన్ కర్ దియా హై సర్కార్ నే. మై కర్జ్‌దార్ హో గయా హూన్ జీఎస్‌టీ ఔర్ నోట్‌బందీ కా బాద్(ప్రభుత్వం నన్ను ఇబ్బందులోకి నెట్టింది. నోట్ల రద్దు, జీఎస్‌టీ కారణంగా నేను అప్పుల పాలయ్యాను) అని పాండే ఏడుస్తూ జనతా దర్బార్ సమావేశంలో మంత్రికి తన ఆవేదనను విన్నవించాడు. 'గత ఐదు నెలల నుంచి ప్రభుత్వాన్ని సంప్రదించేందుకు ప్రయత్నిస్తున్నా. కానీ ఫలితం లేదు. నా గోడు ఎవరూ వినలేదు. నాలాంటి వాళ్లు ఇంకా చాలా మంది ఉన్నారు. నాకు బతకాలని లేదు. అందుకే నేను విషం తీసుకున్నా' అని పాండే చెప్పాడు. గత ఐదేళ్లుగా రవాణా వ్యాపారం నిర్వహిస్తున్న పాండే, విషానికి సంబంధించిన ఒక ప్యాకెట్‌ను మంత్రి ఉనియాలకు చూపించి విషం సేవించినట్లు తెలిపాడు. ఈ హఠత్ పరిణామానికి బీజేపీ కార్యాలయంలో కలకలం రేగింది. వెంటనే పాండేను డూన్ ఆస్పత్రికి తరలించి ఐసీయూలో చేర్చారు. పాండే విషం తీసుకున్న విషయాన్ని ఆస్పత్రి ప్రధానాధికారి కె.కె.తమ్‌టా ధ్రువీకరించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉందని 24 గంటలు గడిస్తేగానీ చెప్పలేమని పేర్కొన్నారు. కాగా మంత్రి ఉనియాల్ మీడియాతో మాట్లాడుతూ నోట్ల రద్దు, జీఎస్‌టీ కారణంగా విషం సేవించినట్లు వ్యాపారి పాండే తనకు చెప్పాడని, వ్యాపారంలో నష్టం వ్యక్తిగత సమస్య కాదన్నారు. ఈ చర్య వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని మంత్రి పేర్కొన్నారు. రవాణా వ్యాపారి అయిన పాండే నష్టాలపాలైన విషయాన్ని ప్రధాన మంత్రి కార్యాలయానికి, ముఖ్యమంత్రి త్రివేంద్ర రావత్‌కు అనేక మార్లు ఫిర్యాదుల గురించి రాశారు.

పండ్లు, కూరగాయలతో ఆరోగ్యం పదిలం

కూరగాయలు.. చూడటానికి కనువిందే కాదు, మనకు దండిగా నిండుగా పోషకాల విందు కూడా చేస్తాయి. ప్రతి కూరగాయకూ ఓ ప్రత్యేకత ఉంది. రుచిలో దేనికదే సాటి. పోషకాల పరంగా దేనికదే ఓ నిధి. వీటికి మరేదీ సాటి లేదు. శాస్త్రపరిశోధనా రంగం ఈ విషయాన్ని స్పష్టంగా చెబుతోంది. కానీ వీటి విలువను మనమే సరిగా గుర్తించటం లేదు. కూరగాయల్లో పోషకాలకు కొరత లేదుగానీ.. మన పళ్లెంలో కూరలకే తగినంత చోటుండటం లేదు. మన దేశంలో ఎవ్వరూ కూడా రోజువారీ తినాల్సినన్ని పండ్లను, కూరగాయలను తినటం లేదని సర్వేల్లో స్పష్టమైంది. ఇది లేనిపోని రోగాలకు హేతువు అవుతుందనీ హెచ్చరిస్తు న్నాయి. అందుకే కూరగాయలు దండిగా తినాల్సిన అవసరం ఉంది.

రోజులో కూరగాయలు, పండ్లు కనీసం '5 పరిమాణాలు' తినాలన్నది ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫారసు చేస్తోంది. కానీ మన దేశంలో ఎంత మంది దీన్ని పాటిస్తున్నారు? ఎక్కడా లేదు. దేశంలో ఎక్కడా.. ఏ వయసు వారూ.. ఈ స్థాయిలో పండ్లు, కూరగాయలు తినటం లేదని 'భారతీయ వృక్షసంబంధ పోషకాహార నివేదిక' ఇటీవలే నిగ్గు తేల్చింది. ఎవరూ కూడా గరిష్టంగా మూడున్నర మోతాదులకు మించి పండ్లూ, కూరగాయలూ తినటం లేదని ఈ అధ్యయనంలో తేలింది. దీనర్థం మనం రకరకాల దీర్ఘకాలిక వ్యాధుల ముప్పులో చిక్కుకుని ఉంటున్నామనే. దీని ప్రభావం ఇప్పటికే కనబడుతోంది. మధుమేహం, అధిక రక్తపోటు, వూబకాయం, గుండె జబ్బులు, క్యాన్సర్ల వంటి వ్యాధులు మరెక్కడా లేనంతగా మన దేశంలో పెచ్చుమీరిపోతున్నాయి. దీనికి మన జీవనశైలితో పాటు ఆహారపుటలవాట్లు కూడా మారిపోతుండటమే ముఖ్య కారణం. ఒకప్పటి కంటే నేడు మన ఆహారంలో- అనర్థదా యకమైన కొవ్వు, తీపి, పిండిపదార్థాలు అధికంగా ఉండే చిరుతిండ్లు, ఫాస్ట్ ఫుడ్స్ పెరిగిపోతున్నాయి. ఆ మేరకు మన పళ్లెంలో ఆరోగ్యకరమైన పండ్లు, కూరగాయలు తగ్గిపోతు న్నాయి. మనం రోజూ కూరగాయలు, పండ్లు ఎంత ఎక్కువ పరిమాణంలో తింటే వ్యాధుల, మరణాల ముప్పు అంతగా తగ్గిపోతున్నాయని ఇటీవలే లండన్‌లోని యూనివర్సిటీ కాలేజ్ అధ్యయనంలో విస్పష్టంగా గుర్తించారు.

అంతా మంచే

చక్కటి ఆరోగ్యానికి ఏది అవసరమో సరిగ్గా అదే కూరగాయల్లో ఉంటుంది. కూరగాయల నుంచి మనకు అనవసర క్యాలరీలు రావు. వీటిలో కొవ్వు ఉండదు. కొలెస్ట్రాల్ అసలే ఉండదు. పిండి పదార్థం చాలా కొద్ది పరిమాణంలో ఉంటుంది. కాబట్టి వీటి నుంచి అనవసరంగా అదనంగా శక్తి రాదు.. అదే సమయంలో మన శరీరానికి అత్యవసరమైన విటమిన్లు, ఖనిజాలు దండిగా లభ్యమవుతాయి. మనకు మరెక్కడా లభించని సూక్ష్మపోషకాలు, పీచు వంటివన్నీ పండ్లు, కూరగాయల నుంచి లభిస్తాయి. అందుకే వీటిని 'పోషక గనులు'గా చెప్పుకోవచ్చు. మనకు కావాల్సిన పిండి పదార్థాల వంటివన్నీ- చాలా వరకూ ధాన్యాల నుంచి లభిస్తాయి. ఇక మాంసకృత్తులు- పప్పులు, మాంసం, పాల పదార్థాల వంటి వాటి నుంచి లభిస్తాయి. కానీ మన శరీరానికి అత్యవసరమైన విటమిన్లు, ఖనిజాల వంటి సూక్ష్మపోషకాలు, పీచు వంటివన్నీ దక్కాలంటే- అందుకు కూరగాయలు, పండ్లే ముఖ్యమైన ఆధారం. అందుకే మనం వీటిని ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించటానికి లేదు.

కూరలు.. పోషకాల గనులు

కూరగాయల్లో పీచుతో పాటు విటమిన్లు, ఖనిజాల వంటి సూక్ష్మ పోషకాలెన్నో ఉంటాయి. ఇవన్నీ సంపూర్ణ ఆరోగ్యానికి దోహదం చేస్తాయి.

ఇనుము : మన శరీరంలోని ప్రతి కణానికీ ప్రాణవాయువు (ఆక్సిజన్) కావాలి. ఈ ప్రాణవాయువును మోసుకుపోయేది రక్తంలోని ఎర్ర కణాలు, వాటిలో ఉండే హిమోగ్లోబిన్. ఈ హిమోగ్లోబిన్ తయారవ్వాలంటే ఇనుము అత్యవసరం. అందుకే మన ఆహారంలో ఇనుము లోపిస్తే.. రక్తంలో హిమోగ్లోబిన్ తగ్గి, 'రక్తహీనత' తలెత్తుతుంది. అందుకని ఆహారంలో ఇనుము దండిగా ఉండేలా చూసుకోవాలి. ఇందుకు రోజువారీ ఆహారంలో ఆకు కూరలు, కూరగాయలు తప్పనిసరి.

విటమిన్ ఎ : కంటి చూపు బాగుండటానికి, రక్తనాళాల లోపలి గోడలు, అవయవాల పైపొరలు ఆరోగ్యంగా ఉండటానికి విటమిన్-ఎ కీలకం. ఇది లోపిస్తే రకరకాల ఇన్‌ఫెక్షన్లూ వేధిస్తాయి. అందుకని విటమిన్-ఎ సమృద్ధిగా ఉండే పదార్థాలు తినటం అవసరం. ఇది ముదురు ఆకుపచ్చ, పసుపు, నారింజ రంగుల్లో ఉండే కూరల్లో దండిగా ఉంటుంది. ఆకు కూరలు, క్యారెట్లు, టమోటాలు, చిలగడదుంపలు, బొప్పాయి వంటివన్నీ కెరొటినాయిడ్స్‌ను దండిగా అందిస్తాయి, ఇవే శరీరంలో విటమిన్-ఎ రూపంలోకి మారతాయి.

విటమిన్ సి : ఎముకలు, దంతాల, చిగుళ్ల ఆరోగ్యానికి, రోగనిరోధక శక్తి చెక్కు చెదరకుండా ఉండటానికి ఇది అత్యవసరం. శరీరం ఇనుమును గ్రహించుకోవటానికీ ఇది తోడ్పడుతుంది. దీని లోపం రాకుండా ఉండేందుకు టమోటాల వంటి కూరగాయలు, తాజా ఉసిరి, పుల్లటి పండ్లు, జామ పండ్లు, అరటి పండ్ల వంటివి తప్పనిసరిగా తీసుకోవాలి. అయితే విటమిన్ సి తేలికగా వాతావరణంలోని ఆక్సిజన్ ప్రభావానికి గురై, వ్యర్థమైపోతుంది. కాబట్టి కూరగాయలు ఎండిపోకుండా తాజాగానే తినాలి, వాటిని కోసి పక్కన పెట్టకూడదు.

ఫోలిక్ యాసిడ్ : రక్త కణాల తయారీకి కీలకమైన పోషకం ఇది. ఇది లోపిస్తే రక్తంలో హెూమోసిస్టీన్ స్థాయిలు పెరిగి, గుండె జబ్బులు ముంచుకొస్తాయి. రక్తహీనత వేధిస్తుంది. అంతేకాదు, పిల్లల్లో పుట్టుకతో నాడీలోపాలు రాకుండా ఉండేందుకు గర్భిణులకు ఫోలిక్ యాసిడ్ చాలా అవసరం. ఆకు కూరలు, చిక్కుడు రకాలు, పప్పులు, ఎండు పప్పులు, కమలాలు, కార్జం వంటివాటిలో ఇది దండిగా ఉంటుంది.

క్యాలరీలు : కూరగాయల నుంచి లభించే క్యాలరీలు చాలా తక్కువ. అదే వీటితో ప్రత్యేక ప్రయోజనం. కాబట్టి వీటిని ఎక్కువగా తీసుకుంటూ అధిక బరువు, వూబకాయం నియంత్రణలో ఉండేలా చూసుకోవచ్చు. అయితే దుంపల నుంచి క్యాలరీలు అధికంగానే వస్తాయి కాబట్టి వాటిని కొంత పరిమితంగా తినాలి.

వృక్ష రసాయనాలు : కూరగాయల్లోని ఫైటోకెమికల్స్.. ముఖ్యంగా పీచు, యాంటీ ఆక్సిడెంట్ల వంటివి త్వరగా వృద్ధాప్యం ముంచుకు రాకుండా కాపాడతాయి. శుక్లాలు, గుండె జబ్బులు, మధుమేహం, కీళ్లనొప్పులు.. ముఖ్యంగా క్యాన్సర్ వంటి వ్యాధులు రాకుండా రక్షణ ఇస్తాయి.

పీచు : దాదాపు కూరగాయలన్నింటిలోనూ దండిగా ఉండే పీచు... తిన్న ఆహారం నిదానంగా జీర్ణమయ్యేలా చూస్తుంది. పేగుల కదలికలను మెరుగుపరచి మలబద్ధకం దరిజేరని వ్వదు. మొలలు, పెద్ద పేగుల్లో బుడిపెలు, క్యాన్సర్ కణుతుల వంటివి పెరగకుండా రక్షణ ఇస్తుంది. గుండె జబ్బు, మధుమేహం, వూబకాయం రాకుండా చూసుకోవటానికీ తోడ్పడతుంది. రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలూ తగ్గుతాయి.

పొటాషియం : ఇది రక్తపోటు నియంత్రణలో ఉండటానికి, కిడ్నీలో రాళ్ల ముప్పు తగ్గటానికి, ఎముక క్షీణత తగ్గటా నికి తోడ్పడుతుంది. అరటిపండు, పుచ్చ పండు, చిలగడదుం పలు, బంగా ళాదుంప, చిక్కుళ్లు, టమోటా, సోయాబీన్, పాలకూర, రాజ్మా వంటి వాటిల్లో ఇది దండిగా ఉంటుంది.

పళ్లెంలో సగం

తినే ముందు పళ్లెంలో ఏయే పదార్థాలు, ఎంత మొత్తంలో ఉన్నాయో చూసుకోవటం ఉత్తమం. పళ్లెంలో సగం కూరగాయలు, పండ్లు ఉండాలన్నది సిఫార్సు. పాల పదార్థాలు వెన్నతీసినవీ, ధాన్యాలు పొట్టు తీయనివీ ఉత్తమం.



మనం రోజూ తినాల్సినవి

ఆకు కూరలు	: 50 గ్రాములు
కాయ కూరలు	: 200 గ్రాములు
దుంప కూరలు	: 50 గ్రాములు
తాజా పండ్లు	: 100 గ్రాములు
రోజూ	: 400 గ్రాములు

ప్రపంచ ఆరోగ్య సంస్థ, భారత వైద్య పరిశోధన మండలి సిఫార్సుల ప్రకారం ప్రతి ఒక్కరూ రోజూ కనీసం '5 పరిమాణాల (5 సర్వింగ్స్) కూరగాయలు తినాలి. ఒక్కో పరిమాణం సుమారు 80 గ్రాములు అనుకుంటే రోజు మొత్తమ్మీద 400 గ్రాముల కూరగాయలు, పండ్లు తినటం తప్పనిసరి. ప్రతి రోజూ ఆహారంలో దుంప కూరలు, ఆకు కూరలు, కాయగూరలు- మూడూ ఉండేలా చూసుకోవాలి. అయితే ఇంతకు మించి కూరగాయలను ఎంత ఎక్కువగా తింటే అంత లబ్ధి చేకూరుతోందని చాలా అధ్యయనాలు చెబుతున్నాయి.

తేలికగా తీసుకోవద్దు

మనలో చాలామంది అన్నం, రొటీలకు ఇచ్చినంత ప్రాధాన్యం కూరగాయలకు ఇవ్వటం లేదు. అన్నంతో పాటు ఏదో పొడి, పచ్చడి వంటివి వేసేసుకుని పూట నడిపేస్తుంటారు. ఇది సరికాదు. ఆహారంలో బియ్యం, పప్పు, పాలు, నెయ్యి ఎంత ముఖ్యమో కూరగాయలు, పండ్లు కూడా అంతకంటే ముఖ్యం. వీటిని ఎంత ఎక్కువ తీసుకున్నా లాభమేగానీ నష్టం ఉండదు. ముఖ్యంగా ఇప్పుదున్న జీవనశైలీ సమస్యలను దృష్టిలో ఉంచుకుని చూస్తే కాయగూరలు ఎక్కువ తీసుకోవటం అవసరం కూడా. వీటిని ఉదయం టిఫిన్ నుంచీ ప్రతి పూటా, ప్రతి ఆహారంలోనూ ఏదో రూపంలో భాగం చేసుకోవటానికి ప్రయత్నించటం మంచిది.

ఈ తప్పులు చెయ్యొద్దు

ప్రతి కాయగూరనూ వండుకునే తినాలని లేదు. కొన్నింటిని సలాడ్ల రూపంలో.. పచ్చికూర ముక్కల్లా తీసుకుంటే మంచిది. ముఖ్యంగా దోస, కీర, టమోటా, క్యారెట్, బీట్‌రూట్, ముల్లంగి, క్యాప్సికం వంటివి ఇలా తీసుకోవచ్చు.

- క్యాబేజీ ఆకులు, గోబీ పువ్వు, పచ్చి బఠాణీ, బీన్స్ వంటివి ఒక్కసారి బాగా మరిగిన వేడి నీటిలో వేసి, రెండు నిమిషాలు ఉంచి, తీసుకుని తినొచ్చు.
- కాయగూరలను ఎక్కువగా ఉడకబెట్టెయ్యటం, బాగా వేపుడులా చేసెయ్యటం మంచిది కాదు. దానివల్ల పోషక నష్టం చాలా ఎక్కువగా ఉంటుంది. కాయగూరల్లో సహజంగానే నీరు ఉంటుంది, ఉడికించటానికి అది సరిపోతుంది. కూరలు వండే సమయం ఎంత తగ్గిస్తే పోషక నష్టాన్ని అంతగా తగ్గించొచ్చు.
- చిక్కుళ్లు, క్యారెట్లు, బీట్‌రూట్ వంటివి చాలామంది వేపుడు కూరల్లా నూనె వేసి చాలాసేపు వేయిస్తుంటారు. కానీ వాటిని ముందే ఒక్కసారి ప్రెజర్ కుక్కర్లో ఉడికించి, చాలా కొద్దినూనెలో తాలింపు పెట్టుకుంటే ఎక్కువ పోషకాలు పోకుండా ఉంటాయి.
- కూరగాయలను తరిగాక కడిగితే వాటిలోని పోషకాలు పోతాయి. కాబట్టి కూరగాయలను శుభ్రంగా కడిగాకే కోయాలి. అలాగే చిన్న ముక్కలుగా కొయ్యటం, మందంగా చెక్కులు తీసెయ్యటం సరికాదు. చాలామంది ఆలూ, బీర, కాకర వంటి కాయలను ఎక్కువగా చెక్కు తీసి వాడుతున్నారు. కానీ ఆ పొట్టు కింద పొరల్లోనూ బి-విటమిన్లు, పీచు, బీటాకెరటిన్ ఎక్కువగా ఉంటాయి. వాటిని కోల్పోకూడదు. ఇవి రోగ నిరోధక శక్తిని పెంచుతాయి.
- బీర, సొర, దోస, పొట్ల, క్యాప్సికం, చిక్కుడు వంటి కాయగూరల్లో గింజలు తీసేయటం సరికాదు. ఈ గింజల్లో మంచి ప్రోటీను, పీచు, ఒమేగా కొవ్వు ఆమ్లాలు ఉంటాయి. కాబట్టి గింజలను తియ్యకుండానే వండుకోవాలి.
- కూరగాయలను ఎక్కువ నీళ్లలో ఉడికించి, ఆ నీళ్లను వంచెయ్యటం కూడా సరికాదు. దానివల్ల ఫోలిక్ ఆమ్లం, కొన్ని రకాల ఖనిజాలు వృథాపోతాయి. కాబట్టి వీలైనంత వరకూ కాయగూరల్లోని నీరే సరిపోతుంది. ఒకవేళ చాలవనుకుంటే కొద్ది నీళ్లలోనే ఉండికించుకోవాలి. వంపటం మాత్రం వద్దు.
- దొండ, బెండ వంటి కూరలతో వేపుడు చేసుకోవాలనుకుంటే చాలామంది నేరుగా వాటిని బాండీలో వేసి చాలాసేపు వేపుతుంటారు. దీనికంటే కూడా ముందు కొద్దిసేపు మైక్రోవేవ్‌లో ఉంచి, మెత్తబడిన తర్వాత కొద్దినూనెలో వేపుకోవచ్చు. దానివల్ల పోషక నష్టం తగ్గుతుంది.
- మరికొందరు క్యాబేజీ, గోరుచిక్కుడు, చిక్కుడుకాయ వంటి వాటిని ముందు నీటిలో ఉడికించి.. ఆ నీటిని పారబోసి కూర వండుతుంటారు. దీంతోనూ పోషకాలు తగ్గిపోతాయి. పెద్ద మంటపై ఉడికించి, కరకరలాడేలా నూనెలో ఎక్కువసేపు వేయించినా పోషకాలు తగ్గుతాయి.
- ప్రతి కాయగూరకూ దానికంటూ ప్రత్యేకమైన రంగు, రుచి, సువాసన ఉంటాయి. వాటికంటూ ఒక రకమైన క్షార-ఆమ్ల స్వభావం ఉంటుంది. వీటివల్ల రుచి మాత్రమే కాదు, జీర్ణప్రక్రియ కూడా చక్కబడుతుంటుంది. కూరగాయలను ఎక్కువ సమయం వండటం, వాటిలో ఎక్కువెక్కువ మసాలాల వంటివి వెయ్యటం వల్ల వాటికి ఉండే సహజసిద్ధమైన రుచి, సువాసన పోతాయి. వాటివల్ల మనకు దక్కాల్సినంత లబ్ధి చేకూరదు.

62 గెటప్పుల్లో బాలయ్య



'దశావతారం' సినిమాలో కమల్ హాసన్ పది అవతారాల్లో కనిపిస్తేనే ఔరా అనుకున్నాం. నందమూరి బాలకృష్ణ ఇప్పుడు ఏకంగా 62 గెటప్పుల్లో కనిపించబోతున్నాడట. అలాగని ఆయన 62 పాత్రలు చేస్తున్నాడని అనుకునేరు. ఆయన చేయబోయేది ఒక పాత్రే. కానీ గెటప్పులు మాత్రం 62 ఉంటాయట. తన తండ్రి నందమూరి తారక రామారావు జీవిత కథతో తెరకెక్కబోయే సినిమా కోసమే ఈ ప్రయత్నం అంటున్నాడు బాలయ్య. గత రెండేళ్లుగా ఈ బయోపిక్ మీద పని చేస్తున్నామని.. ఎంతో పరిశోధన చేసి స్క్రిప్టు రెడీ చేశామని.. ఎన్టీఆర్ జీవితంలోని అన్ని కోణాలనూ ఈ సినిమాలో చూపిస్తామని బాలయ్య చెప్పాడు. ఇంకా ఈ బయోపిక్ గురించి బాలయ్య ఏమన్నాడంటే..

"బయోపిక్ అంటే ఒక వ్యక్తి జీవితంలోని అన్ని కోణాల్నీ చూపించాలి. నాన్న గారి జీవితంలో అందరికీ తెలిసిన కోణాలతో పాటు తెలియని కోణాల్నీ చూపిస్తున్నాం. ప్రతి ఒక్కరి జీవితంలో ఆత్మీయులు, బంధువులు, స్నేహితులతో పాటు శత్రువులూ ఉంటారు. నాన్న గారి జీవితంలో అలాంటి వ్యక్తులందరూ బయోపిక్‌లో కనిపిస్తారు. పుట్టినప్పటి నుంచి చివరి వరకు చరిత్ర మొత్తం ఇందులో చూపిస్తాం. ఆయన ఎదిగిన క్రమం.. చిన్నపుడు ఆయన ఆలోచన ధోరణి ఎలా ఉండేది.. ఆయన్ని ఏయే విషయాలు ప్రభావితం చేశాయి.. ఇవన్నీ సినిమాలో ఉంటాయి. నేను 62 గెటప్పుల్లో కనిపించబోతున్నా. అవేంటన్నది ఇప్పుడే చెప్పను. బాలయ్యగా నా పాత్ర కూడా ఇందులో ఉంటుంది. కానీ నేనుండేది ఒకట్రెండు సన్నివేశాల్లో మాత్రమే" అని బాలయ్య అన్నాడు.

పృథ్వీరాజ్ చేయాల్సిన హిందీ సినిమాలో విక్రమ్

విక్రమ్ హీరోగా హిందీలో ఓ చిత్రం తెరకెక్కబోతోంది. 'మహావీర్ కర్ణ' అనే టైటిల్‌తో తెరకెక్కబోతున్న ఈ చిత్రం తమిళ నటుడు చియాన్ విక్రమ్ నటించబోతున్నారు. సూర్యకిరణాలతో సూర్యుడు ఉదయిస్తాడు అని ట్యాగ్‌తో మహావీర్ కర్ణగా విక్రమ్ కనిపించబోతున్నారు. ఈ చిత్రాన్ని న్యూయార్క్‌కి చెందిన యునైటెడ్ ఫిల్మ్ కింగ్‌డమ్ సంస్థ నిర్మించనుంది. ఈ చిత్రానికి దర్శకుడు ఆర్. ఎస్. విమల్. అయితే ఈ చిత్రాన్ని ఇంతకుముందు నటుడు పృథ్వీరాజ్‌తో చేయాలని ప్రారంభించి కూడా బడ్జెట్ కారణాల దృష్ట్యా ఆపివేశారు. ఈసారి మాత్రం 'మహావీర్ కర్ణ' విషయంలో అలాంటి ప్రాబ్లమ్స్ ఏవీ తలెత్తకుండా పక్కా ప్లానింగ్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు.



చిరు టైటిల్‌తో మంచు లక్ష్మీ



స్టార్ వారసురాలిగా వెండితెరకు పరిచయం అయిన మంచు లక్ష్మీ నటిగా, నిర్మాతగా దూసుకుపోతున్నారు. విలక్షణ పాత్రలతో ఆకట్టుకుంటున్న లక్ష్మీ త్వరలో ఓ థ్రిల్లర్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానుంది. రాజమౌళి దగ్గర దర్శకత్వ శాఖలో పనిచేసిన విజయ్‌ని డైరెక్టర్ గా పరిచయం చేస్తూ తెరకెక్కిస్తున్న ఈ సినిమాకు 'వేట' అనే టైటిల్ ను పరిశీలిస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి హీరోగా తెరకెక్కిన సూపర్ హిట్ సినిమా టైటిల్ వేట. ఇప్పుడే అదే టైటిల్, రేసీ స్క్రీన్ ప్లేతో థ్రిల్లర్ జానర్ లో తెరకెక్కతున్న ఈ సినిమాను మంచు లక్ష్మీ స్వయంగా నిర్మిస్తున్నారు.

'మహాభారతం కన్నా బాహుబలి బెటర్'



ఇటీవల కాలంలో బాలీవుడ్ లో సెన్సార్ వివాదాలు ఎక్కువవుతున్నాయి. తాజాగా ఓ స్టార్ హీరో సినిమాకు కూడా సెన్సార్ బోర్డ్ నుంచి సమస్యలు ఎదురయ్యాయి. సైఫ్ అలీ ఖాన్ హీరోగా తెరకెక్కిన కళాకాండీ సినిమాకు సెన్సార్ బోర్డ్ సభ్యులు ఏకంగా 72 కట్స్ సూచించారు. దీంతో రివ్యూ కమిటీని ఆశ్రయించిన సైఫ్ సింగిల్ కట్ తో సినిమాకు సెన్సార్ సర్టిఫికెట్ సాధించాడు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన సైఫ్ అలీఖాన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. సెన్సార్ సభ్యుల తీరును తప్పుపట్టిన ఈ స్టార్ హీరో సెన్సార్ బోర్డ్‌లో రాజకీయ ప్రమేయం ఎక్కువైందని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో మహాభారతం లాంటి సినిమాను తీయటం కన్నా బాహుబలి లాంటి కల్పిత కథలతో సినిమాలు తీయటం బెటర్ అన్నారు. 'ప్రేక్షకుల కూడా చాలా సన్నితంగా ప్రవర్తిస్తున్నారు. ప్రతీ విషయాన్ని మతానికి నమ్మకాలకు ముడిపెట్టి చూస్తున్నారు, ప్రేక్షకులతో పాటు సెన్సార్ బోర్డ్ సభ్యులకు నిజానికి, కల్పనకు తేడా తెలియటం లేదు' అని విమర్శించారు. అక్షత్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన కళాకాండి సినిమాలో అక్షయ్ ఒబెరాయ్, కునాల్ రాయ్ కపూర్, దీపక్ దోబ్రియాల్, విజయ్ రాజ్, శోభితా దూళిపాల కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రానుంది.

సంక్రాంతికి మరో నందమూరి హీరో



ఈ సారి పొంగల్ రేస్ ఫుల్ మజా ఇచ్చేస్తున్న సంగతి ఒప్పేసుకోవాలి. ఒకవైపు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అజ్ఞాతవాసి.. మరోవైపు నందమూరి బాలకృష్ణ నటించిన జైసింహా ఇదే పండుగకు థియేటర్లలోకి వచ్చేస్తున్నాయి. ఇక సూర్య నటించిన గ్యాంగ్.. రాజ్ తరుణ్ రంగుల రాట్నం కూడా పోటీలోనే ఉన్నాయి.

ఇలాంటి సమయంలో ఇంకో సినిమా అంటే రిస్కే కానీ.. ఇది థియేటర్లలోకి వచ్చే వ్యవహారం కాదు. నందమూరి కళ్యాణ్ రామ్ నటిస్తోన్న 15వ చిత్రానికి.. టైటిల్ అనౌన్స్ చేస్తారట. జనవరి 8వ తేదీ ఉదయం 10.15కు టైటిల్ గ్లింప్స్ విడుదల చేస్తామని మేకర్స్ అనౌన్స్ చేశారు. ఇది కంప్లీట్ గా లవ్ థీమ్ తో ఉంటుందని చెప్పేశారు మేకర్స్. టెక్నికల్ టీం డీటైల్స్ చూస్తే.. ప్రేమ కథను అద్భుతంగా చూపించబోతున్నారనే సంగతి అర్థమవుతుంది. సిద్దార్థ్- నిత్యామీనన్ నటించిన 180వంటి మూవీని తెరకెక్కించిన దర్శకుడు జయేంద్ర.. ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాడు. తమన్నా హీరోయిన్ గా నటిస్తుండగా.. ఇందులో ఈమె ఆర్జే కేరక్టర్ చేస్తోందని తెలుస్తోంది. ఓ లవ్ ప్రోగ్రామ్ హోస్ట్ చేయడం.. అక్కడి నుంచి ప్రేమలో పడడం.. అందమైన కథను హృద్యంగా చూపడం అనే థీమ్ తో మూవీ సాగుతుందట. ఈ మూవీకి పీసీ శ్రీరామ్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నాడు. నందమూరి కళ్యాణ్ రామ్ నుంచి లవ్ థీమ్ తో వస్తున్న మూవీ కావడంతో.. ఆసక్తి బాగానే జనరేట్ అవుతోంది.



హ్యాట్రిక్ హిట్ కోసం 'ఆచారి అమెరికా యాత్ర'

మంచు విష్ణుహీరోగా జి.నాగేశ్వరరెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన మరో కామెడీ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఆచారి అమెరికా యాత్ర. బ్రహ్మానందం కీలక పాత్రలో నటిస్తున్న ఈ సినిమాలో ప్రగ్యా జైస్వాల్ హీరోయిన్ గా అలరించనుంది. సింగం 3 ఫేం అనూప్ సింగ్ థాకూర్ ప్రతినాయక పాత్రలో నటిస్తున్న ఈ సినిమాను పద్మజ పిక్చర్స్ బ్యానర్ పై కీర్తీ చౌదరి, కిట్టులు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ సినిమా ప్రమోషన్‌ను స్టార్ట్ చేశారు చిత్రయూనిట్. ఇప్పటికే ఫస్ట్ లుక్ పోస్టర్స్‌తో ఆకట్టుకున్న ఆచారి అమెరికా యాత్ర యూనిట్, తాజాగా ఆసక్తికరమైన టీజర్ ను రిలీజ్ చేశారు. కామెడీ, రొమాన్స్, యాక్షన్ లతో రూపొందించిన ఈ సినిమా మంచు విష్ణు జి.నాగేశ్వర రెడ్డిలకు హ్యాట్రిక్ సక్సెస్ అందిస్తుందన్న నమ్మకంతో ఉన్నారు చిత్రయూనిట్.

రకుల్‌తో పాటు 5000 మంది డ్యాన్స్ చేస్తారట!



రకుల్ ప్రీత్ సింగ్, సిద్దార్థ్ మల్హోత్రా జంటగా నటిస్తున్న చిత్రం 'అయ్యారీ'. నీరజ్ పాండే ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవల విడుదలైన ఈ సినిమా ట్రైలర్‌కు విశేష స్పందన లభిస్తోంది. కాగా..ఈ సినిమాలో 'కోయి కహానీ షురూ తో కర్...' అనే పాటను చిత్రిస్తున్నారు. ఇందులో రకుల్.. ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా 5000 మంది విద్యార్థులతో కలిసి డ్యాన్స్ చేయబోతు న్నారు. ఈ విషయాన్ని చిత్రబృందం సోషల్‌మీడియా ద్వారా వెల్లడించింది. ఇద్దరు సైనికాధికారుల మధ్య జరిగిన సంఘటనల నేపథ్యంలో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. అనుపమ్ ఖేర్, నసీరు ద్దిన్ షా, మనోజ్ బాజ్‌పాయ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. గణతంత్ర్య దినోత్స వం సందర్భంగా ఈ సినిమాను 26న విడుదల చేయనున్నారు. బాలీవుడ్‌లో రకుల్ నటిస్తున్న రెండో సినిమా ఇది. 2014లో వచ్చిన 'యారియా' సినిమాతో రకుల్ బాలీవుడ్‌కు పరిచయమయ్యారు. ఈ సినిమా తర్వాత రకుల్‌కు తెలుగులో వరుస అవకాశాలు వరించాయి.

సచిన్ కుమార్తెకు ఫోన్‌లో వేధింపులు

పశ్చిమబెంగాల్‌లో యువకుని అరెస్టు



ముంబై : ప్రముఖ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ కుమార్తె సారాటెండూల్కర్‌ను వేధిస్తున్న 32 ఏళ్ల వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. సచిన్ నివాసానికి ఫోన్ కాల్స్ చేస్తూ సారాపై అసభ్య పదజాలంతో వేధింపులకు పాల్పడ్డాడు. సారాటెండూల్కర్‌ను కిడ్నాప్ చేస్తానంటూ బెదిరించినట్లుగా కూడా ఆ వ్యక్తి ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. అయితే అతని మానసిక స్థితి సరిగా లేదని కొన్ని టీవీ చానల్స్ పేర్కొన్నాయి. అయితే ఆ విషయం ఇంకా నిర్ధారించబడలేదు. ఆ వ్యక్తిని దేవ్‌కుమార్ మైత్తిగా గుర్తించారు. అతను కళాశాల విద్యను సగంలోనే మానేసినట్లుగా మరొక టీవీ చానల్ పేర్కొంది. సచిన్ నివాసంలోని ల్యాండ్‌లైన్ నెంబర్‌కు ఫోన్ చేశాడు. కనీసం 20 సార్లు ఫోన్ చేశాడని, వివాహం చేసుకోవాలని కూడా కోరినట్లు ఆరోపణలు వస్తున్నాయి. సారా ఫిర్యాదు చేసిన తర్వాత పోలీసులు చర్యలు చేపట్టారు. ఇదిలాఉండగా ఆ వ్యక్తికి సచిన్ ల్యాండ్‌లైన్ నెంబరు ఎలా లభించిందనే విషయంపై పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. అతనిని పశ్చిమబెంగాల్‌లో అరెస్టు చేశారు. త్వరలో ముంబై కోర్టు ముందు ప్రవేశపెట్టవచ్చని భావిస్తున్నారు.

కాశ్మీర్‌లోయలో గజగజ



శ్రీనగర్ : లడఖ్ రీజియన్‌తో సహా కాశ్మీర్ లోయలోని శ్రీనగర్ ఇతర అనేక ప్రాంతాలలో రాత్రి ఉష్ణోగ్రత గణనీయంగా పడిపోయింది. అనేక ప్రాంతాలు చలికి గజగజలాడుతున్నాయి. రాత్రి ఉష్ణోగ్రత అనేక చోట్ల చాలా తక్కువగా నమోదవుతోంది. ఏ రోజుకారోజు ఈ శీతాకాలంలో ఇదే అత్యధిక అత్యల్ప ఉష్ణోగ్రతగా నమోదవుతోంది. ఈ వారం కూడా పొడి వాతావరణమే ఉంటుందని వాతావరణ కార్యాలయం తెలిపింది. కాశ్మీర్ లోయ, లడఖ్ రీజియన్‌లో రాత్రి ఉష్ణోగ్రత గణనీయంగా పడిపోయింది. కొన్ని ప్రాంతాలలో రాత్రి ఉష్ణోగ్రత అనేక డిగ్రీలు తగ్గిపోయిందని ఇక్కడి వాతావరణ శాఖ కార్యాలయం అధికారి తెలిపారు. జమ్మూ-కాశ్మీర్ వేసవి రాజధాని శ్రీనగర్‌లో రాత్రి కనిష్ఠ ఉష్ణోగ్రత 6 డిగ్రీల సెల్సియస్ పడిపోయింది. అంతకుముందు రోజు రాత్రి నమోదైన దాదాపు 5 డిగ్రీల సెల్సియస్ నుంచి మైనస్ 1.2 డిగ్రీల సెల్సియస్‌కు శనివారం రాత్రి ఉష్ణోగ్రత పడిపోయింది. లోయలోని ఇతర ప్రాంతాలలో కూడా ఇదే విధంగా రాత్రి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని తెలిపారు.



నలుగురు వెయిట్ లిఫ్టర్లు దుర్మరణం

ఢిల్లీ సమీపంలో కారు ప్రమాదం

న్యూఢిల్లీ : రోడ్డు ప్రమాదంలో నలుగురు జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టర్లు దుర్మరణం పాలయ్యారు. ప్రపంచ ఛాంపియన్‌తో సహా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మరణించిన వారిలోని తికంచంద్(27), యోగేష్(24), హరీష్ రాయ్(20), సౌరభ్(18) లుగా పోలీసులు ధ్రువీకరించారు. క్రీడాకారులు ప్రయాణిస్తున్న కారు ఢిల్లీ-హర్యానా సరిహద్దు అలీపూర్ గ్రామ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో ప్రమాదానికి గురైంది. ఢిల్లీ-పాని పట్ ఒకటో నెంబరు జాతీయ రహదారిపై ఈ దుర్ఘటన జరిగింది. నలుగురు వెయిట్ లిఫ్టర్లు మరణించగా 2017లో దేశంలో నిర్వహించిన వెయిట్ లిఫ్టింగ్ ఛాంపి యన్‌షిప్‌లో బంగారు పతకం గెలుచు కున్న సాక్షం యాదవ్‌తోపాటు మరో వెయిట్ లిఫ్టర్ తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. గాయపడిన సాక్షం యాదవ్, మరో వెయిట్ లిఫ్టర్‌ను చికిత్స నిమిత్తం న్యూఢిల్లీకి చెందిన షాలిమార్‌లోని మ్యాక్స్ ఆస్పత్రికి తరలించారు. క్రీడాకారులు ప్రయాణిస్తున్న కారు తొలుత డివైడర్‌ను ఢీకొట్టి తర్వాత ఒక విద్యుత్ స్థంభాన్ని బలంగా గుద్దుకుంది. దీంతో కారు పైకప్పు ఎగిరిపోయింది. ఈ ప్రాంతంలో దట్టమైన పొగ మంచు కుమ్ముకుని ఉన్నప్పటికీ డ్రైవర్ కారును వేగంగా నడిపాడని పోలీసు అధికారి ఒకరు తెలిపారు. ఈ వెయిట్ లిఫ్టర్లు పానిపట్ నుంచి ఢిల్లీకి వెళుతున్నారు.

డీఎంకేకు రజనీ గుబులు..!

- వచ్చే ఎన్నికల్లో సూపర్‌స్టార్ ప్రభావంపై ఆందోళన
- ఈసారి గెలవకపోతే కష్టమే
- నేతల మధనం

చెన్నై : రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న డీఎంకేలో అప్పుడే గుబులు మొదలైంది. సూపర్‌స్టార్ రాజకీయ ప్రవేశ ప్రకటన తర్వాత సమీకరణాలు వేగంగా మారుతుండటమే దీనికి కారణం. ఇప్పటికే అధికారపార్టీ జాగ్రత్తపడి వచ్చే ఎన్నికలకు ఎలా సన్నద్ధం కావాలో ప్రణాళిక రచించుకునే పనిలో పడింది. అందుకు తగినట్లు ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి, ఉపముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం ఉమ్మడిగా కీలక నిర్ణయాలతో దూసుకుపోతున్నారు. లోపల ఎలా ఉన్నా రజనీకాంత్ రాకతో తమకెలాంటి ప్రమాదంలేదని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో డీఎంకేలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. రజనీ రాజకీయ ప్రవేశంపై అన్నివిధాలుగా ఆందోళన వ్యక్తం చేస్తోంది. రాష్ట్రంలో ఆధ్యాత్మిక రాజకీయాలకు చోటులేదని రజనీకాంత్‌ను ఉద్దేశించి ఇప్పటికే ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు స్టాలిన్ వ్యాఖ్యానించారు. డీఎంకేకు చెందిన ఇతర నాయకులు కూడా రజనీ రాకను వ్యతిరేకిస్తున్నారు. తాజాగా ఆ పార్టీ పత్రిక 'మురసొలి'లో కూడా రజనీకాంత్ పేరు ప్రస్తావించకుండానే ఆంధ్రప్రదేశ్‌లో గతంలో మెగాస్టార్ చిరంజీవి ఎలా పార్టీ పెట్టారు? అధికారంలోకి రాకపోగా... దాని ఫలితంగా టీడీపీకి నష్టం కలగడం వంటి అంశాలను ప్రస్తావించారు. 2011, 2016 వరుస ఎన్నికల్లో ఓటమి చవిచూసిన డీఎంకే వచ్చే ఎన్నికల్లో తప్పక గెలవాల్సిన పరిస్థితి. ఈసారి అధికారంలోకి రాకపోతే పార్టీ శ్రేణులను కాపాడుకోవడం కష్టంగా మారే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో రజనీకాంత్ రాజకీయాల్లోకి రావడాన్ని డీఎంకే జీర్ణించుకోలేపోతోంది. 2011లో విజయకాంత్ వల్ల నష్టపోయామని, వచ్చే ఎన్నికల్లో రజనీకాంత్ వల్ల మరోసారి ప్రమాదముందని పార్టీ శ్రేణులు అంచనా వేస్తున్నాయి. అందుకే ఎంజీఆర్ పార్టీ నుంచి వెళ్లినప్పుడు ఎలా స్పందించారో.... రజనీకాంత్ ప్రవేశంపై కూడా అలానే డీఎంకే నేతలు స్పందిస్తున్నారు.



చెన్నైలో ఇటీవల కరుణానిధిని కలుసుకున్న రజనీకాంత్, పక్కన స్టాలిన్ (ఫైల్ ఫొటో)

రాజకీయ తుపాను...

రాజకీయాల్లోకి ప్రవేశిస్తున్నట్లు సూపర్‌స్టార్ రజనీకాంత్ ప్రకటన చేసి వారం పూర్తి అయిందో... లేదో... అప్పుడే రాష్ట్రంలో రాజకీయ తుపాను మొదలైంది. అన్ని పార్టీలు జాగ్రత్త పడుతున్నాయి. సొంతపత్రిక, టీవీ ఛానల్ పెట్టుకుని అన్నాడీఎంకేను ముందుకు తీసుకెళ్లాలని, అదే సమయంలో బలమైన నేతలుగా ఎదగాలని ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి, ఉపముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం సిద్ధమవుతున్నారు. మరోవైపు ఆ పార్టీని హస్తగతం చేసుకోవాలని ఆర్కేనగర్ ఎమ్మెల్యే టీటీవీ దినకరన్ పావులు కదుపుతున్నారు. ఈ క్రమంలో ఆ రెండు వర్గాలు ఒక్కటవడం, పార్టీలో టీటీవీ దినకరన్ కీలక నాయకుడిగా మారతారనే ప్రచారం కూడా జోరుగా సాగుతోంది. అధికారంలో ఉంది కాబట్టి ఆ పార్టీకి ఇప్పటికిప్పుడు పెద్దగా నష్టం లేదు. డీఎంకేది మాత్రం దయనీయ పరిస్థితి. ఇప్పటికే వరసగా రెండుసార్లు అధికారానికి దూరమై... వచ్చే ఎన్నికల్లో గెలుస్తామనే ఆశతో ఉంది. తద్వారా స్టాలిన్ ముఖ్యమంత్రి అవుతారని ఆ పార్టీ శ్రేణులు ఎంతో నమ్మకంతో ఉన్నాయి. ఈ సమయంలో రాజకీయాల్లోకి వస్తున్నానని సూపర్‌స్టార్ చేసిన ప్రకటన రాష్ట్రంలో తుపాను రేపింది. ఆయన రాకపై రాష్ట్రంలో భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ... ఇంకా పార్టీ ప్రకటన, సంస్థాగత నిర్మాణం, వచ్చే శాసనసభ ఎన్నికలకు ముందు రాష్ట్రంలో ఆయన అనుసరించే విధానాలు తదితరాలు రజనీ రాజకీయ గమ్యాన్ని నిర్దేశించే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

నాడు ఎంజీఆర్... నేడు రజనీపై...

వెండితెరపై ఒక వెలుగు వెలిగిన ఎంజీఆర్ రాష్ట్ర రాజకీయాలను శాసించారు. రెండు రంగాల్లోనూ ముఖ్యభూమిక పోషించారు. ఆరంభంలో కాంగ్రెస్ అభిమాని అయిన ఆయన 1953 వరకు ఆ పార్టీలో సభ్యుడిగా ఉన్నారు. అనంతరం అన్నాదురై స్థాపించిన డీఎంకేలోకి వచ్చారు. అన్నాదురై మరణం తర్వాత కరుణానిధి ఆ పార్టీ అధ్యక్షుడు అయ్యారు. అనంతరం ఆయన పెద్ద కుమారుడు ఎంకే ముత్తు, ఇతర కుటుంబ సభ్యులను తీసుకొచ్చి కుటుంబ పార్టీగా తయారు చేస్తున్నారని ఆరోపిస్తూ బయటకొచ్చి 1972లో అన్నాడీఎంకేను స్థాపించారు. ఈ సందర్భంగా ఎంజీఆర్‌కు ఉన్న పేరు, అభిమానాన్ని దృష్టిలో పెట్టుకుని భవిష్యత్తులో ప్రధాన పోటీదారు అవుతారని గుర్తించిన డీఎంకే తీవ్ర స్థాయిలో ఎంజీఆర్‌పై విమర్శలు చేసింది. అదే తరహాలో రజనీకాంత్ విషయంలోనూ వ్యాఖ్యలు చేస్తోందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఎంజీఆర్ బయటకు వెళ్లినప్పటి పరిణామాలు, ఆంధ్రాలో చిరంజీవి రాజకీయాలు, రాష్ట్రంలో పరిస్థితులపై డీఎంకే క్షుణ్ణంగా పరిశీలన మొదలు పెట్టిందని చెబుతున్నారు. 2021లో జరగనున్న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వరకు కార్యకర్తల్లో నమ్మకం నింపడం, తమకు అధికారం ఎందుకివ్వాలో ప్రజలకు తెలియజేసేలా పథకరచనకు సిద్ధపడుతున్నట్లు అంచనా వేస్తున్నారు. మొత్తం మీద రెండు దశాబ్దాల తర్వాత రజనీకాంత్ మౌనం వీడి స్పష్టమైన ప్రకటన చేయడంతో రాష్ట్రంలో బలమైన ఓటుబ్యాంకు ఉన్న పార్టీ, దేశ రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషించిన డీఎంకేకు కలవరపాటులో ఉందనే విషయం మాత్రం స్పష్టమైంది.

శాంతిపునరుద్ధరణలో విఫలం

కేంద్రంపై చిదంబరం విమర్శ



న్యూఢిల్లీ : కాశ్మీర్‌లోయలో శాంతిని పునరుద్ధరించడంలో కేంద్రం ఘోరంగా విఫలమైందని కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి పి. చిదంబరం విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ట్విట్టర్‌లో వరుస ట్వీట్లు చేశారు. కాశ్మీర్‌పై ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఏమిటని చిదంబరం ప్రశ్నించారు. ఎటువంటి ఫలితాలు చూపకుండా ఆ చర్యలు ఎందుకు విఫలమయ్యాయని ప్రశ్నించారు. "ఎప్పటికప్పుడు ఈ విషయమై మేము ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూనే ఉన్నాం. జమ్మూ-కాశ్మీర్‌లో నెలకొన్న ఆందోళనకర పరిస్థితులను తొలగించాలని విజ్ఞప్తి చేశాం. చివరిసారిగా డిసెంబరు 30-31 రాత్రి కూడా గుర్తుచేశాం. పుల్వామా జిల్లా లెథ్‌పోరాలో సీఆర్‌పీఎఫ్ శిక్షణా కేంద్రంపై తీవ్రవాదులు దాడి చేసి ఐదుగురు సీఆర్‌పీఎఫ్ సిబ్బందిని పొట్టన బెట్టుకుని, ముగ్గురిని గాయపరిచినప్పుడు కూడా కేంద్రానికి మేము గుర్తుచేశాం" అని చిదంబరం తెలిపారు. కాశ్మీర్ సమస్యపై దినేశ్వర్ శర్మని మధ్యవర్తిగా నియమించడంపై చిదంబరం వ్యాఖ్యానిస్తూ, ఎన్నికల ముందు జిమ్మిక్కుగా అభివర్ణిస్తూ ఈ సమస్యతో సంబంధం ఉన్న పలువురు ఈ చర్యను త్రోసిపుచ్చారని తెలిపారు. "గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రభుత్వం దినేశ్వర్ శర్మను ప్రత్యేక ప్రతినిధి (ఎస్ఆర్)గా నియమించింది. కానీ, ఆయన విధులను మాత్రం స్పష్టం చేయలేదు. తరువాత, తనను కలుసుకునేందుకు సుముఖత వ్యక్తం చేసిన వారందరితో ఎస్ఆర్ మాట్లాడుతారని తెలిపారు. ఆ విధంగా చెప్పడం ద్వారా తప్పించుకున్నది" అని చిదంబరం ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

ప్రజలను పిచ్చోళ్లను చేస్తున్న బీజేపీ

- పార్టీ పటిష్టత కోసం రథయాత్ర
- పొత్తుల కోసం ప్రతిపక్షాలతో మాట్లాడతాం
- ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్



లక్నో : ఉత్తరప్రదేశ్‌లోని బీజేపీ ప్రభుత్వంపై సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ నిప్పులు చెరిగారు. యోగీ ప్రభుత్వం ప్రజలను పిచ్చి వాళ్లను చేస్తోందని మండిపడ్డారు. సమయం వృథా చేయకుండా కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఎక్కువ నిధులు వచ్చేలా ప్రయత్నించాలని డిమాండు చేశారు. రానున్న రోజుల్లో ఎస్పీని జాతీయ పార్టీగా రూపుదిద్దడానికి ప్రయత్నిస్తానని అఖిలేష్ చెప్పారు. పార్టీ పటిష్టత కోసం అవసరమైతే రథయాత్ర చేపడతానన్నారు. 'బీజేపీ ప్రభుత్వం ప్రజలను వెర్రివాళ్లను చేస్తోంది. సమయాన్ని వృథా చేయ డానికి బదులు వార్షిక బడ్జెట్‌లో రాష్ట్రానికి పెద్ద ఎత్తున నిధులు నిధులు కేటాయించాలి' అని ఆయన డిమాండు చేశారు. లక్నోకు బుల్లెట్ రైలు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఆగ్రా-లక్నో ఎక్స్‌ప్రెస్ పొడవునా బుల్లెట్ రైలు నడపాలని విన్నవించారు. అఖిలేష్ ఆదివారం ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. ఈవీఎం సమస్యపై చర్చించడానికి నిన్న భావసారూప్యత గల ప్రతిపక్ష పార్టీలతో సమావేశం గురించి ప్రశ్నించగా లోక్‌సభ ఎన్నికలకు ముందే గోరఖ్‌పూర్, ఫుల్పూరు ఉపఎన్నికలకు బ్యాలెట్ పత్రాలు ఉపయోగించాలని తాము డిమాండు చేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో ఇతర పార్టీలతో సంకీర్ణం, పొత్తుల అవకాశాల గురించి ప్రస్తావిస్తూ ఇతర పార్టీలతో దీనిపై చర్చిస్తామని అఖిలేష్ చెప్పారు. మెయిన్‌పురి లోక్‌సభ సీటు నుంచి పోటీ చేస్తానని ములాయంసింగ్ యాదవ్ చేసిన ప్రకటనపై స్పందిస్తూ 'పార్టీ యావత్తూ ఆయన వెనుక ఉంటుంది. ములాయం ఎక్కడ నుంచి పోటీ చేయాలని కోరుకుంటే అక్కడ నుంచి పోటీ చేయవచ్చు. తేజ్ ప్రతాప్ ఎక్కడి నుంచి పోటీ చేస్తారో నాకు తెలుసు' అని అఖిలేష్ చెప్పారు. ప్రస్తుతం మెయిన్‌పురికి తేజ్‌ప్రతాప్ యాదవ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. చలికాలమొచ్చినా చిన్నారులకు ఇంకా స్వెటర్లు పంపిణీ చేయలేదని బీజేపీ ప్రభుత్వాన్ని నిందించారు. జానేశ్వర్ మిశ్రా పార్కు ప్రవేశానికి టికెట్టు పెట్టడాన్ని, ఆగ్రా ఎక్స్‌ప్రెస్‌వేపై టోల్ పెట్టడాన్ని అఖిలేష్ వ్యతిరేకించారు.

లాలుకు సంఘీభావం

గడ్డి కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న ఆర్‌జేడీ అధినేత లాలు ప్రసాద్‌కు అఖిలేష్ సంఘీభావం తెలిపారు. బీజేపీ ఆయనకు అన్యాయం చేసిందని ఆరోపించారు. లాలుకు శిక్షపై విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన పైవిధంగా స్పందించారు. బీజేపీ బృందంలో చేరకపోతే లాలు తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవడం తప్పదని ఎస్పీ జాతీయ ప్రధాన కార్యదర్శి రామశంకర్ విద్యార్థి జోస్యం చెప్పారు. నయానో..భయానో ప్రత్యర్థులను ఎన్‌డీఏ గూటికి తెచ్చుకోవడానికి బీజేపీ ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని నిందించారు. లాలూ బీజేపీ కుట్రకు బలయ్యారు. లాలు బీజేపీకి సన్నిహితమైతే...ఆయన జైలులో ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదని చెప్పారు. లాలుకు హైకోర్టులో న్యాయం జరిగి తీరుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. బీజేపీని ఓడించడానికి ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని అఖిలేష్ స్పష్టంచేశారు.

బ్యూరోక్రాట్లపై ఖర్చెంత?

- వివరాల అంచనాకు యంత్రాంగమేది?
- ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల వల్ల పెరిగే ఆదాయమెంత?
- అంచనాలు ఎందుకివ్వడం లేదు
- మూడు నెలల్లో వివరాలివ్వండి
- కేంద్రంపై పార్లమెంటరీ అంచనాల కమిటీ ఆగ్రహం

న్యూఢిల్లీ : అఖిల భారత సర్వీసు అధికారుల వేతనమెంత? భత్యాలెంత? వీటికి సంబంధించిన వివరాలు ఎందుకు నమోదు చేయడం లేదు? అసలు ఈ వివరాలను అంచనా వేయడానికి సమర్థవంతమైన యంత్రాంగాన్ని ఎందుకు ఏర్పాటు చేయలేదు? అని పార్లమెంటరీ అంచనాల కమిటీ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసింది. ఐఏఎస్, ఐపీఎస్, ఇతర అధికారుల వేతనాలు, భత్యాలపై చేస్తున్న ఖర్చుకు సంబంధించిన వివరాలు వెల్లడించనందుకుగాను కేంద్ర ప్రభుత్వంపై పార్లమెంటరీ కమిటీ తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వెలిబుచ్చింది. దీనికి సంబంధించి పార్లమెంటరీ అంచనాల కమిటీ ఇటీవల నివేదిక ఇచ్చింది. దేశ వృద్ధి కోసం అఖిల భారత సేవలు-ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్‌ల నుంచి అధికారుల సేవలను అంచనా వేయడానికి సమర్థవంతమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కమిటీ సూచించింది.

'కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల తరపున పనిచేస్తున్న ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్‌ల వేతనాలు, భత్యాలపై వెచ్చించే మొత్తం వ్యయం వివరాలు అందజేయకపోవడంపై కమిటీ (ప్రభుత్వానికి) అసంతృప్తి వ్యక్తం చేసింది' అని బీజేపీ నాయకుడు మురళీ మనోహర్ జోషి నాయకత్వంలోని పార్లమెంటరీ కమిటీ తెలిపింది. దీనికి సంబంధించిన వ్యయం వివరాలను మూడు నెలల్లోగా కమిటీకి అందజేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. అఖిల భారత సర్వీసుల భాగస్వామ్యం, వ్యయాల అంచనాకు ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నం చేయకపోవడాన్ని తప్పుబట్టింది. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్‌లపై వ్యయాన్ని అంచనా వేయడానికి కనీసం ఓ యంత్రాంగం కూడా లేకపోవడం శోచనీయమని కమిటీ నిందించింది. కేంద్ర సర్వీసుల అధికారుల పని విధానం వల్ల జీడీపీకి ఎంత మేరకు ప్రయోజనం కలిగిందో తెలియడం లేదని వ్యాఖ్యానించింది. అఖిలభారత సర్వీసుల అధికారులు ప్రజలకు పూర్తి జవాబుదారీగా ఉండాల్సిన అవసరం ఉందని కమిటీ అభిప్రాయపడింది. ప్రజల సాధకబాధకాలను, మంచిచెడులను వారు పట్టించుకోవాలని సూచించింది. ప్రజల ఆకాంక్షల మేరకు ఆ అధికారులు పనిచేస్తున్నారా? లేదా? అని ప్రశ్నించింది. ప్రభుత్వాలు చేపట్టే ప్రాజెక్టులు, కార్యక్రమాలు, విధాన నిర్ణయాలను ఎంత మేరకు అమలు చేస్తున్నారని అడిగింది. వేతనాలు, భత్యాల రూపంలో తీసుకుంటున్న ప్రభుత్వ సొమ్ముకు అనుగుణంగా వారు పనిచేస్తున్నారా? అని నిలదీసింది. ప్రజల సమస్యలు పరిష్కరించడం, ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లడం వంటి అంశాలలో వారి భాగస్వామ్యమెంత అని కమిటీ కడిగేసింది. పార్లమెంటరీ అంచనాల కమిటీ ఇటీవల తన నివేదికను లోక్‌సభకు సమర్పించింది. ఈ మొత్తం అంచనా కోసం అవసరమైతే ఐఐఎం, ఐఐటీ వంటి ప్రధాన సంస్థల నుంచి నిపుణులను తీసుకోవాలని కమిటీ సిఫార్సు చేసింది. కనీసం ఔట్‌సోర్సింగ్ విధానం ద్వారానైనా నిపుణులను ఏర్పాటు చేసుకోవాలని కమిటీ సభ్యులు సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులకు వెచ్చించే మొత్తం సొమ్ములో కేవలం అఖిల భారత సర్వీసు అధికారులకు ఎక్కువ మొత్తం ఖర్చవుతుందని, అది వేతనాలు, భత్యాల రూపంలో చెల్లిస్తున్నారని నివేదిక తెలిపింది. వీటితోపాటు కార్యాలయాలు, మౌలిక సదుపాయాలు వంటి ఇతర ఖర్చులకు అదనంగా ఉన్నాయని పేర్కొన్నది. 1951 నాటికి మొత్తం ఐఏఎస్ అధికారుల సంఖ్య 1232 ఉండగా 1981 నాటికి అది 4,599కి చేరింది. 2016లో మంజూరు చేసిన పోస్టులతో సంఖ్య 6,396కి పెరిగింది. 2017 జనవరి 1 నాటికి ఐపీఎస్‌లు 4,863, ఐఎఫ్ఎస్‌లు 3,152 మంది ఉన్నారు.

హజ్ ఆఫీస్‌కు కాషాయ రంగు

వెల్లువెత్తిన విమర్శలు • 24 గంటల్లో మళ్లీ పాత రంగు

లక్నో : ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలోని హజ్ సమితి కార్యాలయం ప్రహారి గోడకు వేసిన రంగుపై వివాదం రేగింది. దీంతో ఒక్కరోజులోనే ఆ గోడ రంగు మార్చి తిరిగి పాత రంగు వేశారు. రాష్ట్ర శాసనసభ భవనానికి ఎదురుగా ఉన్న హజ్ సమితి కార్యాలయం ప్రహారి గోడకు రాత్రికి రాత్రే కాషాయ రంగు వేశారు. సచివాలయ భవంతికి వేసిన రంగునే ఈ గోడకు కూడా వేశారు. అయితే ముస్లింలకు చెందిన కార్యాలయానికి కాషాయ రంగు వేయడంపై విపక్ష నేతలు, ముస్లిం మతపెద్దల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో హజ్ కమిటీ కార్యదర్శి ఆర్పీ సింగ్ వెంటనే చర్యలు చేపట్టారు. ఆ గోడ రంగును పూర్వపు రంగులోకి మార్చారు. దీనంతటికీ కాంట్రాక్టరే కారణమని, అతడిపై కఠినచర్యలు తీసుకుంటామని ప్రభుత్వం పేర్కొంది. హజ్ కార్యాలయానికి కాషాయ రంగు వేయగానే అక్కడి ముస్లిం మత పెద్దలు మండిపడ్డారు. 'ఏంటిది.. బీజేపీ కాషాయం రంగు వేసింది. భవిష్యత్‌లో ఎస్పీ ఆకుపచ్చ, బీఎస్పీ నీలం రంగు వేస్తాయి. ఇవి రాజకీయ రంగులు. వీటిని హజ్ కార్యాలయాలకు వేయడం ఏమిటి? ఇలాంటివి నివారించాలి' అని ఆల్ ఇండియా షియా పర్సనల్ లా బోర్డు ప్రతినిధి యాసూబ్ అబ్బాస్ మండిపడ్డారు. 'కాషాయం రంగు ఓ రాజకీయ పార్టీకి చెందినది. హజ్ యాత్రికులు కూడా కాషాయ రంగు దుస్తులు వేసుకోవాలని వారు కోరుకుంటున్నారా?' అని మరో ముస్లిం మతపెద్ద ఖాజీ మౌలానా ప్రశ్నించారు. విపక్షాలు కూడా ప్రభుత్వ చర్యపై మండిపడ్డాయి. రంగులు మార్చే పార్టీగా బీజేపీకి పేరుందని ఎస్పీ నేత సునీల్ సింగ్ ఆరోపించారు. అన్ని వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తడంతో ప్రభుత్వం వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టింది. హజ్ కార్యాలయం గోడకు శుక్రవారం కాషాయ రంగు వేయగా... 24 గంటల్లోనే అంటే శనివారమే పాత రంగులోకి మార్చివేశారు.

నియోజకవర్గాల పర్యటనలో గోవా సీఎం

పనాజీ(గోవా) : నియోజకవర్గాల వారిగా గోవా అంతటా పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకొని, పరిష్కారామార్గాన్ని కనుగొనేందుకు సిద్ధమైయారు గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్. తన పర్యటనల్లో భాగంగా ముఖ్యమంత్రి ఉత్తర గోవాలోని సంఖలిం ప్రాంతాన్ని గత నెలలోనే సందర్శించారు. జనవరి 13 నుంచి మిగతా అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. గోవాలో మొత్తం 40 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి.

అత్యాచార కేసు విచారణకు జిల్లా జడ్జి

భువనేశ్వర్(ఒడిశా) : కొరాపుట్ జిల్లా కుందులిలో జరిగిన గిరిజన బాలిక సామూహిక అత్యాచారం కేసును విచారించేందుకు ఒడిశా ప్రభుత్వం జిల్లా జడ్జిని నియమించింది. కుందలిలోని మార్కెట్ నుంచి వస్తున్న 14 ఏళ్ల 9 తరగతి విద్యార్థినిపై గత ఏడాది అక్టోబరు 10న యూనిఫారం ధరించి ఉన్న నలుగురు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. అయితే కేసును విచారించిన అనంతరం పోలీసులు అత్యాచారం జరగలేదన్నారు.

మయన్మార్-భారత సరిహద్దుల్లో భూకంపం

న్యూఢిల్లీ : మయన్మార్-భారత్ సరిహద్దు ప్రాంతంలో ఆదివారం మధ్యాహ్నం భూకంపం సంభవించింది. భూకంప తీవ్రత రిచ్టర్ స్కేల్‌పై 6.0గా నమోదైంది. మధ్యాహ్నం 12:17 నిమిషాలకు భూమిలో దాదాపు 35కిలోమీటర్ల లోతులో భూకంపం సంభవించినట్టు జాతీయ సిస్మోలాజీ కేంద్రం(ఎన్‌సీఎస్) తెలిపింది. భూకంప ప్రభావం భారత సరిహద్దులోని మణిపూర్‌లో కనిపించింది.

హెరాయిన్ పట్టివేత : ముగ్గురి అరెస్టు

బల్‌రాంపూర్(ఉత్తరప్రదేశ్) : హసువాదోల్ గ్రామంలో రూ.20 లక్షల విలువైన హెరాయిన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ముగ్గురిని అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో ఓ మహిళ కూడా ఉందని పోలీసులు తెలిపారు. రాష్ట్ర పోలీసు, క్రైం బ్రాంచ్ అధికారులు సంయుక్తంగా జరిపిన దాడుల్లో వీరిని అరెస్టు చేసినట్లు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ప్రమోద్ కుమార్ పేర్కొన్నారు. పట్టుబడిన వారి నుంచి రూ.2 లక్షల నగదును కూడా స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

లాలూ శిక్షపై శత్రుఘ్న సిన్హా స్పందన

న్యూఢిల్లీ : ఆర్జేడీ ఛీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్‌కు శిక్ష విధిస్తూ సీబీఐ ప్రత్యేక కోర్టు ఇచ్చిన తీర్పుపై బీజేపీ నేత, నటుడు శత్రుఘ్నసిన్హా అనూహ్య రీతిలో స్పందించారు. కోర్టు తీర్పు తనను నిరాశపరచిందని సిన్హా వ్యాఖ్యానించారు. లాలూ జనాకర్షణ కలిగిన నేత అని, శిక్ష నుంచి తగిన ఉపశమనం పొందేందుకు ఆయన హైకోర్టును ఆశ్రయించాలని సూచించారు. ఈ అంశాన్ని రాజకీయ కోణంలో చూడరాదన్నారు.

అకాడమి తరలింపు ప్రతిపాదనపై మోడీకి లేఖ

తిరువనంతపురం(కేరళ) : కేరళలోని కన్నూర్ జిల్లాలో ఉన్న కోస్ట్‌గార్డ్ అకాడెమిని కర్ణాటకలోని మంగళూరుకి తరలించే ప్రతిపాదనపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయ్ ప్రధాని నరేంద్ర మోడీకి ఘాటైన లేఖ రాశారు. కేంద్ర నిర్ణయం న్యాయబద్ధంగా లేదని, కేరళ ప్రజల మనోభావాలను దెబ్బ తీసేదిగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం తరలింపును వెంటనే ఆపాలంటూ పినరయి విజయ్ లేఖ రాశారని ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపింది.

ఎయిర్‌పోర్ట్‌లో బంగారం స్వాధీనం

కొచ్చి(కేరళ) : దుబాయ్ నుంచి కొచ్చి ఎయిర్‌పోర్ట్‌కు వచ్చిన ఓ ప్రయాణికుడి నుంచి బంగారపు కడ్డీలను కస్టమ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కడ్డీల విలువ రూ. 32 లక్షలు ఉంటుందని వారు తెలిపారు. దుబాయ్ నుంచి ఇండిగో ఫ్లైట్‌లో కొచ్చికి వచ్చిన ఈ ప్రయాణికుడి నుంచి 1.049 గ్రాముల బరువున్న 9 బంగారు కడ్డీలు స్వాధీనం చేసుకున్నట్టు కస్టమ్స్ కమిషనర్ సుమీత్ కుమార్ వెల్లడించారు. కేసు నమోదు చేసి, విచారణ చేపట్టినట్టు ఆయన పేర్కొన్నారు.

యూపీలో అల్లర్లు : ఆరుగురికి గాయాలు

ముజఫర్‌నగర్(ఉత్తరప్రదేశ్) : యూపీలోని భూమా గ్రామంలో చిన్న కారణానికి రెండు వర్గాల మధ్య జరిగిన కోట్లాటలో ఆరుగురు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. ఇరుగుపొరుగు వారైన సత్యబీర్, సుభాష్‌కు చెత్త పారవేసే విషయంపై మొదలైన స్వల్ప వివాదం హింసాయుతంగా మారింది. ఇరువర్గాలు రాళ్లు, కర్రలతో దాడులకు పాల్పడ్డారని పోలీసు ఉన్నతాధికారి అరవింద్ కుమార్ పేర్కొన్నారు. ఈ ఘటనలో ఆరుగురు గాయపడ్డారని, చికిత్స కోసం వారిని ఆసుపత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్టు వారు పేర్కొన్నారు.

4వ రోజుకు రవాణా యూనియన్ల సమ్మె

చెన్నై(తమిళనాడు) : వేతనాన్ని పెంచాలంటూ కొన్ని రవాణా యూనియన్లు ఆరంభించిన సమ్మె ఆదివారం 4వ రోజుకు చేరింది. సమ్మె వల్ల అనేక మంది ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. కొన్ని ప్రైవేటు బస్సులు తిరుగుతున్నా, ప్రయాణిలకు ఇబ్బందులు మాత్రం తప్పటం లేదు. అయితే రాష్ట్ర రవాణా సంస్థ ఆధీనంలో నడుస్తున్న 67 శాతం ప్రభుత్వ బస్సులు రాష్ట్ర వ్యాప్తంగా శనివారం నుంచి రోడ్లపై తిరుగుతున్నాయని తమిళనాడు ప్రభుత్వం పేర్కొంది.

చలి గుప్పిట్లో పంజాబ్, హర్యానా

చండీగఢ్(పంజాబ్,హర్యానా): గత వారం నుంచి పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో చలి మరింత పెరిగింది. రెండు రాష్ట్రల్లోని దాదాపు అన్ని ప్రాంతాల్లో సగటున 2 నుంచి 5 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. పంజాబ్‌లోని ఆదంపూర్‌లో ఉష్ణోగ్రతలు రోజు రోజుకు మరింతగా క్షీణిస్తున్నాయి. ఆదంపూర్‌లో రికార్డు స్థాయిలో 0.7 డిగ్రీల నమోదైయాయి. రెండు రాష్ట్రాల్లో ఇదే అత్యల్ప ఉష్ణోగ్రతని వాతావరణ విభాగం పేర్కొంది. హర్యానాలోని నర్నౌల్‌లో 1.5 డిగ్రీల నమోదైంది. ఉమ్మడి రాజధాని చండీగఢ్‌లో 5.8 డిగ్రీలు, హిస్సార్‌లో 2.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

ఎక్సైజ్ అధికారులపై గ్రామస్తుల దాడి

బెర్హాంపూర్ (ఒడిశా) : అక్రమంగా దేశీయ మద్యాన్ని తయారు చేస్తున్న కొందరు వ్యక్తులను పట్టుకునేందుకు ఎక్సైజ్ అధికారులు ప్రయత్నించగా, ప్రతిగా గ్రామస్తులు ఎక్సైజ్ అధికారులపై దాడికి దిగిన సంఘటన ఇది. ఒడిశాలోని గంజాం జిల్లాలో మసనీబాడి గ్రామంలో నిందితులను పట్టుకునేందుకు వెళ్లిన ఎక్సైజ్ అధికారులపై గ్రామస్తులు దాడులకు దిగారని పోలీసులు తెలిపారు. గ్రామస్తుల దాడుల్లో ఐదుగురు అధికారులు గాయపడ్డారని వారు వెల్లడించారు.

ఏటీఎం మోసగాళ్ల అరెస్టు

ముంబై(మహారాష్ట్ర) : నగదు డ్రా చేయడానికి ఏటీఎం సెంటర్లకు వచ్చే వారి దృష్టిని మరల్చి,నగదును తస్కరించే ఇద్దరు అన్నదమ్ములను పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఏటీఎం మెషీన్ల వద్ద నగదు డ్రా చేసేందుకు వచ్చిన వారి నుంచి చాకచక్యంగా పిన్ నంబర్‌ను గమనించి, వారిని మాటల్లో పెట్టి, దృష్టి మరలిస్తారని పోలీసులు వెల్లడించారు. అనంతరం వారి కార్డులు పని చేయడం లేదంటూ తమ వద్ద ఉన్న కార్డులను ఇచ్చి, మోసాలకు పాల్పడుతుంటారని పోలీసులు తెలిపారు.

లోక్‌సభ ఉప ఎన్నికకు బీజేపీ అభ్యర్థులు వీరే..

న్యూఢిల్లీ : రాజస్థాన్‌లో అజ్మీర్, ఆల్వార్ లోక్‌సభ నియోజకవర్గాలకు ఈ నెల 29న జరగనున్న ఉప ఎన్నికలకు బీజేపీ అభ్యర్థులను ప్రకటించింది. ఆల్వార్‌కు రాజస్థాన్‌లో మంత్రిగా ఉన్న జస్వంత్ సింగ్ యాదవ్, అజ్మీర్‌కు రాంస్వరూప్ లాంబా అభ్యర్థిత్వాన్ని కేంద్రం ఖరారు చేసింది. రాం స్వరూప్ లాంబా కేంద్ర మాజీ మంత్రి సన్వర్ లాల్ జట్ కుమారుడు. రాజస్థాన్‌లోని మండల్‌గఢ్, నావోపారా అసెంబ్లీ నియోజకవర్గాలకు కూడా అదే రోజున ఉప ఎన్నికలు జరగనున్నాయి.

విశాలాంధ్ర
విజయవాడ, సోమవారం 08, జనవరి 2018



ఏయూ జట్టుకు భారీ విజయం

విశాలాంధ్ర - విజయనగరం : ఆంధ్ర విశ్వవిద్యాలయం, రఘు ఇంజనీరింగ్ కళాశాల సంయుక్తంగా నిర్వహిస్తున్న సౌత్‌జోన్ బాలుర క్రికెట్ పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. విజయనగరం జిల్లాలోని రఘు ఇంజనీరింగ్ కళాశాల, ఎంవీజీఆర్ విజ్జి, రైల్వే మైదానాలలో ఆదివారం కోలాహలములా సాగాయి. ఏయూ క్రీడా విభాగం సంచాలకులు ఆచార్య ఎం.విజయ మోహన్, రఘు విద్యాసంస్థల చైర్మన్ కలిదిండి రఘు పర్యవేక్షించారు. రఘు ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో జరిగిన తొలిపోటీలో జైన్ యూనివర్సిటీ(బెంగళూరు) జట్టు వీఈఎల్ఎస్ వర్సిటీ(చెన్నయ్) జట్టుపై 87 పరుగుల భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. జైన్ వర్సిటీ 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 141 పరుగులు చేయగా వీఈఎల్ఎల్ వర్సిటీ 16 ఓవర్లలో 54 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జైన్ యూనివర్సిటీ క్రీడాకారుడు శరత్ శ్రీనివాస్ 53 బంతుల్లో 54 పరుగులు చేయగా, బౌలర్ ప్రణవ్‌భాటియా నాలుగు ఓవర్లలో ఏడు పరుగులిచ్చి నాలుగు వికెట్లు తీశాడు. రఘు ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌లో కలసలింగం విశ్వవిద్యాలయం (తమిళనాడు)పై జేఎస్టీయూకే 91 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది. జేఎస్టీయూకే 22.5 ఓవర్లలో 161 పరుగులకు ఆలౌట్ కాగా, కలసలింగం వర్సిటీ 22.1 ఓవర్లలో 70 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఎంవీజీఆర్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో అన్నా వర్సిటీ(చెన్నయ్)పై కృష్ణ వర్సిటీ ఐదు వికెట్లతో విజయం సాధించింది. అన్నా వర్సిటీ ఆరు వికెట్లు కోల్పోయి 143 పరుగులు చేయగా, కృష్ణా వర్సిటీ 17.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 147 పరుగులు సాధించింది. నిఖిల్ నాయుడు 30 బంతుల్లో 54 పరుగులు చేశారు. అన్నా యూనివర్సిటీ క్రీడాకారులు జీకే శ్యామ్ 36 బంతుల్లో 57 పరుగులు చేశారు. విజ్జిమైదానంలో జరిగిన మ్యాచ్‌లో కువెంపు యూనివర్సిటీ(షిమోగా) మధురైకామరాజ్ వర్సిటీ(మదురై)పై 32 పరుగులతో గెలుపొందింది. కువెంపు వర్సిటీ 25 ఓవర్లలో రెండు వికెట్లకు 168 పరుగులు చేయగా, మధురై కామరాజ్ వర్సిటీ 9 వికెట్లు కోల్పోయి 25 ఓవర్లలో 136 పరుగులు చేసింది. గుల్బర్గా యూనివర్సిటీ(కర్ణాటక), ఆచార్య నాగార్జున వర్సిటీ(గుంటూరు) మధ్య జరిగిన మ్యాచ్‌లో గుల్బర్గ విశ్వవిద్యాలయం 17.3 ఓవర్లలో 104 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం ఆచార్య నాగార్జున వర్సిటీ జట్టు 14.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 105 పరుగులు చేసింది. ఆరు వికెట్లతో విజయం సాధించింది. పోర్ట్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో అమ్రిత విశ్వవిద్యాపీఠం(తమిళనాడు), విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంపై 10 పరుగులతో విజయం సాధించింది. అమ్రిత వర్సిటీ 20 ఓవర్లలో 99 పరుగులు చేయగా, విక్రమ సింహపురి వర్సిటీ 16.4 ఓవర్లలో 89 పరుగులకు ఆలౌట్ అయ్యింది. విజ్ఞాన్ విశ్వవిద్యాలయం(గుంటూరు), భారత్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్‌కు మధ్య జరిగిన మ్యాచ్‌లో భారత్ ఇనిస్టిట్యూట్ 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 110 పరుగులు చేసింది. విజ్ఞాన్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 107 పరుగులకు ఆలౌట్ అయ్యింది. మ్యాచ్ చివరి బంతి వరకు ఉత్కంఠగా సాగింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం కర్ణాటక కేంద్రీయ విశ్వవిద్యాలయంపై 105 పరుగుల భారీ విజయాన్ని అందుకుంది. ఏయూ 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 179 పరుగులు చేసింది. అన్వర్ 33 బంతుల్లో 51 పరుగులు చేశారు. యువీవి వర్మ 34 బంతుల్లో 53 పరుగులు చేసి, బౌలింగ్‌లో సైతం నాలుగు ఓవర్లలో 17 పరుగులిచ్చి 3 వికెట్ల తీసారు. ఏయూ జట్టు క్రీడాకారుడు తేజశ్వి నాలుగు ఓవర్లకు 16 పరుగులిచ్చి మూడు వికెట్లు రాబట్టారు. పీఈఎస్ యూనివర్సిటీ(తమిళనాడు), డాక్టర్ ఎంజీఆర్ యూనివర్సిటీ(తమిళనాడు) మధ్య జరిగిన మ్యాచ్‌లో పీఎస్ వర్సిటీ విజయం సాధించింది. 25 ఓవర్లలో పీఎస్ 8 వికెట్లు కోల్పోయి 218 భారీ స్కోర్ చేసింది. డాక్టర్ ఎం.జి.ఆర్ యూనివర్సిటీ కేవలం 11.4 ఓవర్లలో 35 పరుగులకు ఆలౌట్ అయ్యింది. తుముకుర్ యూనివర్సిటీ(తుముకూర్), మౌలానా అజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంకు మధ్య జరిగిన మ్యాచ్‌లో తుముకూరు యూనివర్సిటీ 19.5 ఓవర్లలో 129 పరుగులకు ఆలౌట్‌కాగా, మౌలానా అజాద్ జాతీయ ఉర్దూ వర్సిటీ 16.3 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 131 పరుగులు చేసింది. ఎనిమిది వికెట్లతో విజయం సాధించింది.


యాదవుల కార్పొరేషన్ ఏర్పాటుచేయాలి

విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : యాదవులకు ప్రభుత్వం వెంటనే ఫైనాన్స్ కార్పొరేషన్‌న ఏర్పాటు చేసి ప్రతి ఏడాది బడ్జెట్‌లో రూ. వెయ్యి కోట్లు కేటాయించాలని కోరుతూ అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ ధర్నా చౌక్ వద్ద ఒక రోజు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షలను ఉద్దేశించి అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఎర్రాకుల తులసీరామ్ యాదవ్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం యాదవుల పట్ల పక్షపాతంతో వ్యవహరిస్తుందన్నారు. జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు పెంచాలని చట్టసభల్లోను, ప్రైవేటు రంగాల్లోను రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజధాని ప్రాంతంలో 10 ఎకరాల విస్తీర్ణంలో ఆంధ్రప్రదేశ్ యాదవ భవనాన్ని ప్రభుత్వం నిర్మించి ఇవ్వడంతో పాటు ప్రతిజిల్లాలో యాదవ హాస్టల్స్‌ను నిర్మించాలని కోరారు. దీక్షలో అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకట సత్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకు మల్లికార్జున యాదవ్, నగర కన్వీనర్ గుంటుబోయిన(బోను) కళ్యాణ్ యాదవ్, జాతీయ అధ్యక్షులు పి.యం.మాలకొండయ్య యాదవ్, కోశాధికారి అలా బాలయ్య యాదవ్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి తట్టి అర్జునరావు యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకట నారాయణ యాదవ్ పాల్గొన్నారు.

సంఘీభావం తెలిపిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

యాదవుల సంక్షేమానికి ప్రభుత్వం వెంటనే ఫైనాన్స్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్నా చౌక్ వద్ద యాదవులు చేస్తున్న నిరాహార దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి సీపీఐ తరపున పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ బీసీలలో అత్యధికంగా యాదవులు ఉన్నారని వారి సంక్షేమం కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఏడాదికి రూ.1000 కోట్లు కేటాయించడం చంద్రబాబుకు పెద్ద విషయం కాదన్నారు. గతంలో బ్రాహ్మణ, కాపు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి నిధులు కేటాయించిన ప్రభుత్వం, యాదవులకు కూడా ఏర్పాటు చేయాలన్నారు.

బరితెగించిన పందెంరాయుళ్ళు



విశాలాంధ్ర - ఉండి : పశ్చిమగోదావరిజిల్లా ఉండి మండలంలోని పాందువ్వ ఖండ్రిక గూడెంలో ఆదివారం కోడి పందెం రాయుళ్లు రెచ్చిపోయారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఆరు గంటలవరకు పెద్ద ఎత్తున కోడిపందాలు నిర్వహించారు. చుట్టు ప్రక్కల గ్రామాలనుండి వందలాది సంఖ్యలో పందెం రాయుళ్ళు తరలివచ్చారు. దీంతో పండగ వాతావరణం నెలకొంది. లక్షలాదిరూపాయలు చేతులుమారినట్లు సమాచారం. లోపల పందేలు రూ. 10 వేల నుండి రూ. 50 వేల వరకు జరుగుతుంటే బయట పందేలు రూ.లక్షలమీద జరిగాయి. ఇప్పటికే జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్ కోడిపందాల విషయంలో రాజీపడేది లేదని చెప్పినప్పటికీ, జిల్లా కలెక్టర్ కాటంనేని భాస్కర్ గ్రామాల్లో రెవెన్యూ ఉద్యోగులను బాధితులను చేస్తామంటూ హెచ్చరికలు జారీ చేసిన పందెలు కొనసాగడం గమనార్హం. తాజాగా పోలీస్, రెవెన్యూ యంత్రాంగం కలిసి గ్రామాల్లో ఎక్కడైనా కోడిపందాలు, పేకాట, గుండాట, జూదం ఆటలు నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మైక్ ప్రచారం చేశారు. ఇంత జరిగినా కూడా పందెంరాయుళ్లు విచ్చలవిడిగా పందాలు వేశారు. దీనికి కారణం ప్రతి సంవత్సరం సంక్రాంతికి ముందు ఇప్పటిలాగే హెచ్చరికలు జారీ అవుతున్నాయని, సంక్రాంతి వచ్చేసరికి ప్రతీ ఏటా యథాతథంగా జరుగుతున్నాయనే ధీమాతోనే ఇలా జరుగుతున్నాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. సంప్రదాయ ముసుగులో జరుగుతున్న కోడిపందాలు, గుండాట, పేకాట తదితర జూదాలతో వందలసంఖ్యలో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, మరికొంతమంది నిరాశ్రయులవుతున్నారనే ఉద్దేశ్యంతో జూదాన్ని అరికట్టేందుకు హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను పందెంరాయుళ్ళు టేకిటీజీగా తీసుకుంటున్నారు.

నేటి నుండి సయ్యద్ ముస్తాక్ ఆలీ టీ-20 టోర్నీ

విశాలాంధ్ర - విశాఖపట్నం స్పోర్ట్స్ : దేశ క్రికెట్‌లో స్థానం దక్కించుకునేందుకు అనువైన టోర్నీగా చెప్పుకునే సయ్యద్ ముస్తాక్ అలీ టీ-20 టోర్నీలు సోమవారం నుంచి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ అధికారులు నిర్వహించనున్నట్టు ఏసీఏ సెక్రెటరీ సిహెచ్.అరుణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ జోన్‌లెవల్ లోని ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో ప్రతిభ కనబర్చిన ఆటగాళ్లు ఆయా రాష్ట్రాల తరపున ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దక్షిణ భారత్‌లోని ఆంధ్రాప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, గోవా జట్టు తలపడే టోర్నీని వీక్షించేందుకు ఐపీఎల్ ఫ్రాంచైజీలు రానున్నట్టు చెప్పారు. విశాఖపట్నం, విజయనగరం, చింతలవలసలోని మూడు వేదికల్లో జరిగే 15 మ్యాచ్‌ల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఐపీఎల్‌లో తీసుకునేందుకు వీలు ఉందన్నారు. 8, 9, 11, 12, 14 తేదీల్లో విశాఖలో రోజుకు రెండు మ్యాచ్‌లు, విజయనగరం, చింతలవలసలో ఒక్కోటి చొప్పున నిర్వాహించనున్నారు. టికెట్ లేకుండా మ్యాచ్‌లు చూసే అవకాశం కల్పిస్తున్నట్టు చెప్పారు

ఐపీఎల్ రేసులో స్టార్ ఆటగాళ్లు..

టోర్నీలో పాల్గొన్న ఆటగాళ్లు ప్రతిభ ఆధారంగా ఐపీఎల్ ఫ్రాంచైజీలు వీరిని వేలంలో కొనుగోలు చేసే అవకాశాలు ఉన్నందున స్టార్ ఆటగాళ్లు బరిలో దిగుతున్నారు. కర్ణాటక, తమిళనాడు, హైదరాబాద్ ఆటగాళ్లు ఇప్పటికే అంతర్జాతీయ క్రీడాల్లో మెరిసిన వాళ్లే కావడం విశేషం. కర్ణాటక తరపున మనీష్‌పాండే, కరుణ్ నైర్, స్టూవార్ట్ బిన్నీ, వినయ్ కుమార్, మయాంక్ అగార్వల్, హైదరాబాద్ తరపున అంబటి రాయుడు, ప్రజ్ఞాన్ ఓజా, మహమ్మద్ సీరాజ్, తమిళనాడు తరపున దినేష్‌కార్తీక్, అభినవ్ ముకుంద్, వాషింగ్టన్ సుందర్, ఆంధ్రా తరపున హనుమవిహారీ, విశాఖ కుర్రాడు రిక్కి భూయ్ తదితరులు పాల్గొంటున్నారు.



విమానయాన రంగంలో భారత్ మూడవ స్థానం

- తిరుపతి నుంచి మూడు ప్రదేశాలకు 'ఇండిగో' సర్వీసులు
- కేంద్రమంత్రి అశోక్‌గజపతిరాజు



విశాలాంధ్ర - రేణిగుంట : విమానయాన రంగంలో దేశీయ సర్వీసుల విస్తరణలో ప్రపంచంలోనే భారత్ మూడవ స్థానంలో ఉందని కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి అశోక్‌గజపతిరాజు అన్నారు. ఆదివారం ఉదయం తిరుమల శ్రీవారి దర్శనానంతరం తిరుపతి విమానాశ్రయం చేరుకున్న ఆయన ఇండిగో విమాన సర్వీసులను ప్రారంభించారు. బోర్డింగ్ కౌంటర్ వద్ద మొదటి ప్రయాణికునిగా హైదరాబాద్‌కు ఇండిగో ప్రెసిడెంట్ ఆదిత్య ఘోష్ నుంచి టికెట్టు పొందారు. ఈ సందర్భం గా ఏర్పాటు చేసిన సమావేశంలో అశోక్‌గజపతి రాజు మాట్లాడుతూ భారత విమానయానరంగం అభివృద్ధి పథంలో వెళ్తోంద న్నారు. గత 70 సంవత్సరాల కాలంలో దేశంలో 75 ప్రాంతాల కనెక్టివిటీ ఉండగా ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో మూడేళ్ళ కాలంలో మరో 80 కొత్త ప్రదేశాలకు విస్తరించామన్నారు. దేశవ్యాప్తంగా ప్రాంతీయ కనెక్టివిటీ పెరుగు తోందన్నారు. నేటి నుంచి ప్రతిరోజూ తిరుపతి నుంచి హైదరాబాద్‌కు 10.50, 17.20, 20.55 గంటల సమయాల్లో, హైదరాబాద్ నుంచి తిరుపతికి 6.25, 12.40, 19.40 గంటల సమయాల్లో, తిరుపతి నుంచి బెంగుళూరుకు 8.10, 14.25 గంటల సమయాల్లో, బెంగుళూరు నుంచి తిరుపతికి 9.30, 15.40 గంటల సమయాల్లో ఇండిగో సర్వీసులు అందుబాటులో ఉంటాయ న్నారు. ఇండిగో ప్రెసిడెంట్ ఆదిత్యఘోష్ మాట్లాడుతూ ఇండిగో సంస్థ ప్రపంచ దేశాలతోపాటు మనదేశంతో కలుపుకుని రోజుకు 1000 సర్వీసులు 47 ప్రాంతాలకు విమానాలు నడుస్తు న్నాయన్నారు. రాష్ట్రంలో మరో వారంలోపు రాజమండ్రి, మార్చి నాటికి విజయవాడ నుంచి సర్వీసులను ప్రారంభిస్తామన్నారు. ప్రస్తుత టికెట్ ధర బెంగుళూరుకు రూ.1,500, హైదరాబాద్‌కు 3,500గా ఉందన్నారు. చిత్తూరు, తిరుపతి పార్లమెంటు సభ్యులు డాక్టర్ ఎన్.శివ ప్రసాద్, వరప్రసాద్ మాట్లాడుతూ ఇండిగో సంస్థ ప్రయాణికుల సంక్షేమంలో రాజీలేని సేవలందిస్తోందన్నారు. కడప, నెల్లూరు, చిత్తూరు జిల్లాలకు చెందిన ఎక్కువ మంది దుబాయ్, సింగపూర్ ప్రాంతాల్లో ఉన్నందున ఈ విమానాశ్రయం నుంచి అంతర్జాతీయ విమానాలు నడపాలని కోరారు. దీనికి ఆదిత్యఘోష్ స్పందిస్తూ కనెక్టివిటీ ఇవ్వబోతున్నామన్నారు. ఎమ్మెల్సీ గాలి ముద్దు కృష్ణమనాయుడు మాట్లాడుతూ విమానాశ్రయం చుట్టుపక్కల అభివృద్ధికి తుడా ఖర్చు చేసిన నిధులు రూ.7.5 కోట్లను కేంద్రం నుంచి తిరిగి ఇప్పించాలని కేంద్రమంత్రిని కోరారు. తిరుపతి విమానాశ్రయ డైరెక్టర్ పుల్ల హెచ్ మాట్లాడుతూ ఈ వేసవికల్లా 44 విమాన సర్వీసులను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. తుడా ఛైర్మన్ నరసింహయాదవ్, సబ్‌కలెక్టర్ నిశాంత్‌కుమార్, విమానాశ్రయ డీజీఎం రవిశంకర్, ఆపరేషన్స్ ఎస్.ఆర్. బాబిడోరిన్, సీఎస్‌వో ఎన్.దేవేంద్రన్, ఏజీఎం లక్ష్మీనారాయ ణ, ఇండిగో తిరుపతి మేనేజర్ విన్ని బజాజ్, డీఎస్పీ నంజుండప్ప పాల్గొన్నారు.

వస్త్ర వ్యాపారులతో అధికారుల కుమ్మక్కు

విశాలాంధ్ర-ఆమదాలవలస : సంక్రాంతి పండగ నేపథ్యంలో ఒడిశా నుంచి అనేక రకాల వస్త్రాలను శ్రీకాకుళం జిల్లా వ్యాపారులు పెద్దఎత్తున దిగుమతి చేసుకుంటున్నారు. సేల్‌ట్యాక్స్ కట్టకుండా వ్యాపారం చేస్తున్నా అడగాల్సిన సంబంధిత అధికారులు వ్యాపారులతో కుమ్మక్కు అయ్యారనే విమర్శలు వినవస్తున్నాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారం వస్త్ర వ్యాపారులు మూడు నెలలకొసారి త్రైమాసిక సుంకాన్ని ప్రభుత్వానికి ముందుగా చెల్లించాలి. దిగుమతి చేసుకోవాల్సి వస్తే అధికారుల నుంచి అనుమతులు పొందాల్సి ఉన్నప్పటికీ పట్టించుకోకుండా రాత్రివేళల్లో ఒడిశా నుంచి వస్త్రాలు రైలుమార్గం గుండా దిగుమతి చేసుకొని గ్రామాలకు తరలిస్తున్నారు. ఇది తెలిసినా వాణిజ్య పన్నులశాఖ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.. పట్టణంలో వస్త్రదుకాణదారులు సిండికేట్‌గా మారి అధికారులకు ముడుపులుగా చెల్లిస్తూ అక్రమ వ్యాపారం కొనసాగిస్తున్నారని చిరువ్యాపారులు ఆరోపిస్తున్నారు.

ట్రాఫిక్ ఆదాయం రూ.10 కోట్లు

- గత ఏడాది 29,947 మందిపై కేసులు
- 441 మందికి జైలు
- చలానాల పేరిట సామాన్యులపై వడ్డన

విశాలాంధ్ర - విశాఖపట్నం : ప్రభుత్వం సామాన్యులపై నిబంధనల పేరుతో ట్రాఫిక్ పోలీసులతో అక్రమ వసూళ్లకు పాల్పడుతోంది. మహానగరంలో దాదాపు 5లక్షలకు పైగా వాహనాలు ఉన్నందున ప్రతి వాహనం నుంచి నెలలో ఒక్కసారైనా సిగ్నల్ దాటారంటూ లేదా మితిమీరిన వేగం పేరిట చలానాలు నేరుగా ఇంటికి, సెల్‌ఫోన్‌కు సమాచారం అందించడంతో వాహనదారులు భయాందోళన చెంది వందలాది రూపాయలు మీసేవా కేంద్రాల్లో చెల్లించాల్సిన దుస్థితి నెలకొంది. గత ఏడాది 29,947మందిపై కేసులు నమోదు చేయగా ఇందులో 441 మందిని జైలుకు పంపించారు. హెల్మెట్ కేసుతో పాటు సెల్‌ఫోన్ డ్రైవింగ్, వివిధ నిబంధనల పేరిట సామాన్యులపై చలానా వడ్డనలు పోలీసులు వడ్డిస్తూనే ఉన్నారు. వాటి పేరిట గత ఏడాది 2017లో అక్షరాల రూ. 10కోట్లు విశాఖ పోలీసులు వసూలు చేసి ప్రభుత్వ ఖాతాకు జమచేశారు. ప్రభుత్వం లోపాయికారిగా పోలీసులకు ఆదేశాలు జారీ చేసి ప్రజలపై చలానాల పేరిట అధిక మొత్తంలో వడ్డనలు వసూలు చేయాలని హుకుం జారీ చేసినట్లు సమాచారం. అనేక మంది పోలీసులు టార్గెట్‌లు తీసుకొని మరి కేసులకు వెనుకాడడంలేదు. మరో పక్క నో పార్కింగ్ పేరిట రోడ్లపై నిలిపే వాహనదారులకు 4,5 రోజుల్లో చలానాలు వచ్చేస్తున్నాయి. దీంతో దిక్కు తోచని వాహనదారులు లబోదిబోమంటూ అపరాధ రుసుము కట్టాల్సిన దుస్థితి నెలకొంది. మహానగరంలో రోడ్డు ఎక్కాలంటే వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. మరో పక్క వాణిజ్య సంస్థలు, పార్కింగ్ సదుపాయం కల్పించాల్సి ఉన్నప్పటికీ వాటిని తుంగలో తొక్కి పార్కింగ్ లేకపోవడంతో రోడ్లపైనే పార్కింగ్ చేయడంతో చలానాల బారిన పడాల్సిన పరిస్థితి నెలకొంది. వీటితో పాటు జాతీయ రహదారి, ప్రధాన జంక్షన్లు తీవ్ర ట్రాఫిక్ రద్దీ మయం తప్పకపోవడంతో అనేక మంది పోలీసులు అటుగా వచ్చిన వాహనాల నెంబర్లను సేకరించి నేరుగా వాహనదారుల ఇళ్లకు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించారంటూ అపరాధ రుసుములు రావడం వాహనదారులకు ఆందోళన కలిగిస్తున్నది.

జన్మభూమిని బహిష్కరించిన పంచాయతీలు

విశాలాంధ్ర - సీతంపేట: శ్రీకాకుళం జిల్లా సీతంపేట మండలం కుడ్డపల్లి, మండ పంచాయతీల ప్రజలు ఆదివారం జన్మభూమి కార్యక్రమాన్ని బహిష్కరించారు. బోయవాల్మీకులను ఎస్టీజాబితాలో చేర్చే నిర్ణయం విరమించుకునేవరకూ ప్రభుత్వ కార్యక్రమాలను జరగనివ్వబోమని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ప్రజలు తెలిపారు.

రాష్ట్రంలో సామాజిక న్యాయం లేదు

కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్



విశాలాంధ్ర - గుంటూరు (జిల్లాపరిషత్) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సామాజిక న్యాయం లేదని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. ఆదివారం గుంటూరులోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో 29 రాష్ట్రాలు ఉంటే 25 రాష్ట్రాల్లో సామాజిక న్యాయం పాటిస్తున్నారని 4 రాష్ట్రాల్లో సామాజిక న్యాయం పాటించటం లేదన్నారు. మద్రాస్ నుండి ఆంధ్రప్రదేశ్ విడిపోయిన నాటి నుంచి ఇప్పటి వరకూ రాష్ట్రంలో కేవలం రెండు సామాజిక వర్గాలకు చెందిన వారు మాత్రమే ముఖ్యమంత్రులుగా పరిపాలన చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఈ సామాజిక వర్గాల దాడులు పెరిగిపోతున్నాయని ఆయన మండిపడ్డారు. గతంలో కారంచేడు, చుండూరు గ్రామాలలో ఆ సామాజిక వర్గాల దాడులు, దౌర్జన్యాలు మరచి పోలేని మాయని మచ్చగా మిగిలిపోయాయన్నారు. ఆ సామాజిక వర్గాలకు చెందిన వారే న్యాయ స్థానాలలో ఉండటంతో న్యాయం జరగడంలేదని ఆరోపించారు. రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులపై ఆందోళన వ్యక్తం చేశారు. గరగపర్రులో అంబేద్కర్ విగ్రహం పెట్టడమే దళితులు చేసిన నేరమా అని ప్రశ్నించారు. పత్తిపాడు మండలం గొట్టిపాడులో దళితులపై జరిగిన దాడిని అందరూ ఖండించాల్సిన అవసరం వుందన్నారు. రెండు ఎకరాల రైతు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రూ.2 వేల కోట్లు సంపాదించారని అన్నారు. పోలవరం పూర్తి చేస్తా మరో 5 సంవత్సరాలు అధికారం ఇవ్వమని అడుగుతున్నాడని, రాజధాని పేరుతో అమరావతిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని విమర్శించారు. తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకొని వేల కోట్లు సంపాదించిన ప్రతిపక్షనేత జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేస్తూ, అధికారం ఇవ్వండని, అధికారంలోకి వస్తే అన్ని వర్గాలకు న్యాయం చేస్తామని చెబుతూ ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇస్తున్నారని మండి పడ్డారు. ఈ హామీలు అమలు చేయాలంటే దేశ బడ్జెట్ కూడా సరిపోదని ఎద్దేవాచేశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం, ప్రతిపక్షంలో ఉన్న వైసీపీలు కేంద్రంలో ఉన్న బీజేపీకి తొత్తులుగా మారాయన్నారు. రాష్ట్రంలో మార్పు కోరుకుంటున్న ప్రజలకు ప్రత్యామ్నాయాన్ని అందించడానికి ప్రయత్నం చేస్తున్నట్లు చింతా మోహన్ వెల్లడించారు. కాపులు, దళితులు తదితర అన్ని వర్గాలను కలుపుకుని ఐక్య కూటమిని ఏర్పాటు చేసి, అధికారాన్ని అందించాలనుకుంటున్నట్లు చెప్పారు. తద్వారా సామాజిక న్యాయం సాధించితీరుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు, దళిత నాయకులు మోజెస్, భాస్కరరావు, ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

వలస వెళ్ళిన వారికి చంద్రన్న కానుక దక్కేనా

- అందరికీ అందని కానుకలు
- కొన్ని డిపోల్లో అయిపోయాయంటున్న డీలర్లు

విశాలాంధ్ర - విశాఖపట్నం : చంద్రన్న సంక్రాంతి కానుకల్లో నాణ్యత మరోసారి చర్చనీయాంశమైంది. బెల్లం నీరుగారిపోగా, నెయ్యి మడ్డిలా కారుతుంది. కంది పప్పులో, సెనగపప్పులో రాళ్లు రావడంతో లబ్ధిదారులు లబో దిబోమంటున్నారు. ఇక పురుగులు పట్టిన గోధుమపిండి, సెనగపిండి అట్టలు కట్టి ప్యాకెట్లలో ఉన్నాయని అనేక మంది లబ్ధిదారులు అంటున్నారు. ఈ ఏడాది క్రిస్మస్, సంక్రాంతి కానుకల పేరిట రాష్ట్ర ప్రభుత్వం రూ. 450కోట్లు ఖర్చు చేసినప్పటికీ నాణ్యత ప్రమాణాలు పూర్తి స్థాయిలో పాటించకపోవడంతో విశాఖలో అనేక రేషన్ డిపోల్లో ఇదే పరిస్థితి నెలకొంది. మరికొన్ని డిపోల్లో కానుకలు అయిపోయాయంటూ డీలర్లు చేతులెత్తేస్తున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల కార్డుదారులు విశాఖలో ఉపాధి పనులకు వచ్చి నివాసముంటున్న నేపథ్యంలో గ్రామాల్లో చంద్రన్న సంక్రాంతి కానుకలు తీసుకోకుండా వలస వచ్చిన విశాఖలోనే ప్రతి నెల రేషన్ తీసుకుంటున్నప్పటికీ ప్రభుత్వం ఈసారి నగరంలో డిపోలకు కానుకల సంఖ్యను తగ్గించడం తో డీలర్లు ముందొచ్చే వారికే ఇచ్చి 6వ తేదీ నాటికే అనేక డిపోల్లో సరకులు అయిపోయాయంటూ చేతులెత్తేయడంతో గంటల తరబడి క్యూలో ఉండి నిరీక్షించిన కార్డుదారులకు నిరాశే ఎదురైంది. అనేక మంది వృద్ధులు ఉదయం 5గంటల నుంచే రేషన్ దుకాణాల వద్ద బారులు తీరిన పరిస్థితి నెలకొంది. నగరంలో 204 దుకాణంలో కార్డు దారులు డీలర్‌తో వాగ్వివాదానికి దిగారు. మరోపక్క సివిల్ సప్లయ్ అధికారులు కూడా వచ్చిన స్టాక్‌ను సప్లయ్ చేశామని, ఇప్పుడు అదనంగా కానుకల సంఖ్యను ఇవ్వలేమని చేతులెత్తేస్తున్నారు. దీంతో పండగపూట కానుకలు దొరకక నిరాశ చెందిన అనేకమంది తమ స్వగ్రామాలకు సంక్రాంతి ఇంకా వారం ఉన్నప్పటికీ చంద్రన్న కానుకల కోసం తరలివెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. డిమాండ్ ఉన్న చోట పూర్తిస్థాయిలో కానుకలు అందించడం లేదని విమర్శ వినపిస్తోంది.

నీరు జనరల్.. పేరు మినరల్

- నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు
- వాటర్ ప్లాంట్లపై కొరవడిన నిఘా
- జోరుగా కలుషిత నీటి వ్యాపారం
- పట్టించుకోని అధికారులు



విశాలాంధ్ర - కోటబొమ్మాళి : నీరు అందరికీ అవసరమే. అయితే తాగునీరు ఏ మాత్రం కలుషితమైనా అనారోగ్య పాలవ్వక తప్పదు. అటువంటి నీటిశుద్ధిపై శ్రీకాకుళం జిల్లాలో అడుగడుగునా నిర్లక్ష్యం అలముకుంది. కోటబొమ్మాళి మండలంలో మినరల్ వాటర్ ప్లాంట్ల యజమానులు కనీస నాణ్యతా ప్రమాణాలు కూడా పాటించకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. సాధారణ నీటినే ప్యాకెట్లు, క్యాన్‌లు, బాటిళ్లలో నింపి మినరల్ వాటర్‌గా వీధివీధినా విక్రయిస్తున్నారు. కోటబొమ్మాళిలో పదుల సంఖ్యలో వాటర్‌ప్లాంట్లు పుట్టుకొస్తున్నాయి. వీటిలో కొన్నింటికి మాత్రమే అనుమతులున్నాయి. లాభార్జనే ధ్యేయంగా ఈ వ్యాపారం కొనసాగుతున్నా అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. అధికారపార్టీ నేతల అండదండలతో నిబంధనలు బేఖాతరు చేయడం ప్రమాదకరంగా మారింది. ఆహార పదార్థాల తనిఖీ అధికారుల నుంచి అనుమతులు వచ్చిన తరువాతే మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుచేయాల్సి ఉన్నప్పటికీ అమలు కాని పరిస్థితి. ఉత్పత్తులపై బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ అనుమతులతో ఐఎస్ఐ మార్కు తప్పని సరిగా ఉండాలి.

అనారోగ్యాన్ని కొన్నట్టే

మినరల్ నీరు తాగేందుకు ప్రజలు ఎక్కువ మక్కువ చూపుతున్నారు. ఒక్కో కుటుంబం 20 లీటర్ల వాటర్ క్యాన్‌కు రూ.15 నుండి రూ.20 వరకూ ఖర్చుచేస్తుంది. రోజుకు సగటున 2 క్యాన్లు కొనుగోలు చేసినా నెలకు రూ.900 నుంచి రూ.1000 వరకూ ఖర్చుపెడుతున్నారు. నీటిలో నాణ్యత కొరవడడంతో డబ్బిచ్చి అనారోగ్యాలు కొనితెచ్చుకున్నట్టవుతోందని పలువురు వాపోతున్నారు. ఇటీవల కోటబొమ్మాళి మండలంలో వివిధ గ్రామాల్లో సరఫరా చేస్తున్న నీటి పరిశుభ్రతపై అనుమానాలు రావడం, డాక్టర్లు కూడా ఈ నీటివల్ల ప్రజలు రోగాలబారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేయడం ఇక్కడి పరిస్థితి అద్దం పడుతోంది.

తనిఖీలు లేవు

కోటబొమ్మాళి మండలంలో ఎక్కడ చూసినా వాటర్ ప్లాంట్లు దర్శనమిస్తున్నాయి. వీటిలో ఎన్నిటికి అనుమతులు ఉన్నాయనేది అనుమానమే. చారిటబుల్ ట్రస్ట్‌ల పేరుతో చాలా ప్లాంట్ల వ్యాపారం సాగుతోంది. చాలా వాటికి అధికార, ప్రజాప్రతినిధుల అండదండలు ఉన్నాయి. వారిచ్చే నెలవారీ మామూళ్లతో తనిఖీ చేయడంలేదు.

\- ఎస్. హేమసుందరరాజు, కోటబొమ్మాళి

నీరు దుర్వాసన వస్తుంది

వాటర్ ప్యాకెట్లలో నీరు చాలా సందర్భాల్లో వాసన వస్తుంది. వ్యాపారులను ప్రశ్నిస్తే మేము తయారుచేయడం లేదు.. ప్లాంట్ వాళ్ళు సరఫరా చేసిన ప్యాకెట్లనే అమ్ముతున్నామంటున్నారు.

అసలు అవి మినరల్ వాటరా లేక వడగట్టిన నీరా అనేది అర్థం కావడంలేదు. కొన్ని ప్యాకెట్లలో నలకలు వస్తున్నాయి.

\- టి. శంకర్, కొత్తపేట

ప్రకాశం జిల్లాలో ఇరువర్గాల ఘర్షణ

పలువురికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర - కందుకూరు : ప్రకాశం జిల్లా వలేటివారిపాలెం మండలంలోని చుండి గ్రామంలో ఆదివారం రాత్రి ఇరువర్గాల మధ్య ఘర్షణ ఉద్రిక్తతకు దారితీసింది. ఈ ఘర్షణలో ఇరువర్గాలకు చెందిన వారు ఆయుధాలతో దాడులు చేసుకోవడంతో పలువురి తలలకు తీవ్ర గాయాలు అయ్యాయి. మరొకరు కత్తి పోటుకు గురయ్యారు. పేకాటలో తీసుకున్న అప్పు తిరిగి చెల్లించాలని కోరటంతో ఇరువురు మధ్య మాటలు పెరిగి ఘర్షణకు దారితీసినట్లు తెలుస్తోంది. ఈ ఘర్షణ వర్గ పోరుగా మారి రాళ్ళు, కర్రలతో, కత్తులతో కొట్టుకోవడంతో గ్రామస్తులు భయంతో వణికిపోయారు. అరుపులు, కేకలతో ఆ ప్రాంతమంతా గందరగోళంగా మారింది. ఈ ఘర్షణలో వీరయ్య, మాల్యాద్రి తలలకు తీవ్రగాయాలు అయ్యాయి. అశోక్ అనే వ్యక్తికి కత్తి పోటుతో పోటుతోపాటు మరికొందరికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న వలేటివారిపాలెం ఎస్సై వి.సుబ్బారావు హుటాహుటిన అక్కడకు చేరుకుని ఘర్షణ అదుపు చేసేందుకు యత్నించినా సద్దుమణగలేదు. దీంతో కందుకూరు డీఎస్పీ కె.ప్రకాశరావు, కందుకూరు సీఐ కె.నరసింహారావుకు సమాచారం అందించారు. డీఎస్పీ, సీఐ, గుడ్లూరు ఎస్సై ఉస్సం వేమన, కందుకూరు రూరల్ ఎస్సై శాంతి భద్రతలు పర్యవేక్షిస్తున్నారు. క్షతగ్రాతులను కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.



ప్రభుత్వానిదే బాధ్యత : జేవీఎస్ఎన్

విశాలాంధ్ర బ్యూరో-విజయనగరం :రాష్ట్రవ్యాప్తంగా దళితులపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి ధ్వజమెత్తారు. జరుగుతున్న దాడులకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆయన డిమాండు చేశారు. విజయనగరం జిల్లా డెంకాడ మండలం మోదవలస బాధితులను ఆయన ఆదివారం పరామర్శించారు. జిల్లా కేంద్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఓదార్చారు. వారికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. మోదవలస గ్రామాన్ని సందర్శించారు. పెత్తందారులు ధ్వంసం చేసిన ఇంటిని పరిశీలించారు. అధికార పార్టీ పెద్దలు కబ్జాచేసేందుకు ప్రయత్నిస్తున్న దళితవాడలో పర్యటించారు. అక్కడి దళితులతో మాట్లాడి వారు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల దళితులపై వరుసగా దాడులు హెచ్చుమీరిపోయాయని, దాడులకు పాల్పడిన వారికి ప్రభుత్వం అండగా నిలుస్తుండటం, వారిపై చర్యలు తీసుకోవడానికి వెనుకాడుతుండటమే దీనికి కారణమన్నారు. దీని ఫలితమే విశాఖ జిల్లా జెర్రిపోతులపాలెం, గరగపర్రు తదితర సంఘటనలని పేర్కొన్నారు. రెండు జాతీయ రహదారులకు కూతవేటు దూరంలో ఉన్న మోదవలస దళితవాడను కబ్జాచేసి, దానిని రియల్ ఎస్టేట్‌గా మార్చుకొనేందుకే అధికార పార్టీ పెద్దలు, వారి అనుచరులు దళితులపై దాడులకు పాల్పడ్డారని, భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. నిందితులను అరెస్టు చేయాలని, బాధితులను రక్షణ కల్పించి, వారిని ఆదుకోవాలని డిమాండు చేశారు. మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి ఏ.విమల, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.కామేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఒమ్మి రమణ, దళిత హక్కుల పోరాటసమితి జిల్లా ప్రధాన కార్యదర్శి గోక రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేట్ల చేతిలో కేంద్రం కీలుబొమ్మ

ఏఐబీఈఏ ప్రధాన కార్యదర్శి వెంకటాచలం విమర్శ

విశాలాంధ్ర ప్రతినిధి-విజయవాడ : బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థల చేతిలో కీలుబొమ్మగా మారి బ్యాంకింగ్ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతోందని ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్(ఏఐబీఈఏ) ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటాచలం విమర్శించారు. ప్రైవేటీకరణ పేరుతో బ్యాంకులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందన్నారు. నగరంలోని కేడీసీసీబీ ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బ్యాంకులపై మాత్రమే ప్రజలకు నమ్మకం ఉందన్నారు. అందువల్లే రూ.110 లక్షల కోట్లను డిపాజిట్ల రూపంలో ప్రభుత్వ బ్యాంకుల్లో దాచుకున్నారని వివరించారు. అయినా నేటికీ దేశంలో 30 కోట్ల మందికి బ్యాంక్ ఖాతాలు లేవని తెలిపారు. ఈ నేపథ్యంలో బ్యాంకులను ప్రజలకు మరింత చేరువ చేసి వారికి ఆర్థిక ప్రయోజనం కల్పించాలని తాము కోరుతున్నామని, అయితే కేంద్రం ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని చెప్పారు. వ్యవసాయ రంగానికి ప్రభుత్వ బ్యాంకులు మాత్రమే రుణాలు ఇస్తాయని గుర్తు చేశారు. మహిళలు, చిరువ్యాపారులు ఆర్థికంగా ఎదిగేందుకు తోడ్పాటునందిస్తాయని, విద్యార్థులకు చేయూతనిస్తాయని ఆయన వివరించారు. కార్పొరేట్ సంస్థలకు బ్యాంకింగ్ కార్యకలాపాల కోసం లైసెన్స్‌లు ఇవ్వడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఎన్డీఏ ప్రభుత్వ విధానాలు బ్యాంకులు, ప్రజలకు చేటు చేసేవిగా, కార్పొరేట్ సంస్థలు, డిఫాల్టర్లకు మేలు చేసే విధంగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యాంకులకు 35 బడా కంపెనీలు రూ.7 లక్షల కోట్లు ఎగ్గొట్టాయని, వాటిని వసూలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కానీ ప్రజలు కష్టపడి బ్యాంకుల్లో దాచుకున్న సొమ్ముకు రక్షణ లేకుండా చేసేందుకు ఎఫ్ఆర్‌డీఐ బిల్లును సిద్ధం చేశారని చెప్పారు. ఈ బిల్లును తాము వ్యతిరేకించడం వల్ల కొన్ని సవరణలు తీసుకొచ్చారని, ప్రభుత్వ బ్యాంకుల్లోని డిపాజిట్లకు ఎఫ్ఆర్‌డీఐ వర్తించదని చెబుతున్నారని వివరించారు. ఈ బిల్లును పూర్తిగా రద్దు చేసి మొండి బకాయిదారులపై క్రిమినల్ చర్యలు తీసుకుని డబ్బులు తిరిగి వసూలు చేసి బ్యాంకింగ్ రంగాన్ని పటిష్టపరిచి ప్రజలకు మరింత చేరువచేయాలని డిమాండు చేశారు. ఈ మేరకు దేశ వ్యాప్త ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. ఏఐబీఈఏ కార్యదర్శి బీఎస్ రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వ బ్యాంకులకు సంబంధించి 23 డిమాండ్లు పరిష్కరించాలని దేశవ్యాప్తంగా ఐదు కోట్ల మందితో సంతకాలు సేకరిస్తామని తెలిపారు. కార్పొరేట్ సంస్థలకు వేల కోట్ల రూపాయల రుణాలు ఇచ్చి వసూలు చేసుకోలేకపోయిన ఎస్‌బీఐ ప్రజల అకౌంట్లలో మినిమం బ్యాలెన్స్ లేదనే సాకుతో రూ.1,800 కోట్లు అక్రమంగా గుంజుకోవడం బాధాకరమన్నారు. ఇటువంటి అనైతిక విధానాలపై తాము పోరాటం చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ఏఐబీఈఏ నాయకులు మాధవరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హెచ్1బీ వీసాలపై

కేంద్రం జోక్యం అవశ్యం

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : హెచ్1బీ వీసాల జారీని కట్టుదిట్టం చేయాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయంపై ప్రధాని నరేంద్ర మోడీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబునాయుడు జోక్యం చేసుకోవాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ డిమాండు చేశారు. ట్రంప్ తీసుకున్న నిర్ణయం వల్ల దేశానికి చెందిన సుమారు 15 లక్షల మంది హెచ్1బీ వీసాదారులు ఇబ్బందిపడతారన్నారు. పాకిస్థాన్‌కు అమెరికా సహాయాన్ని నిలిపివేయటాన్ని బీజేపీ తమ ఘనతగా చెప్పుకుంటోందని, మరీ హెచ్1బీ వీసాల విషయంలో మోడీ ఎందుకు స్పందించ టంలేదని ప్రశ్నించారు. విజయవాడలో మూడు రోజుల పాటు జరగనున్న సీపీఐ జాతీయ సమితి సమావేశాల్లో పాల్గొ నేందుకు వచ్చిన నారాయణ, ఇక్కడి సీపీఐ రాష్ట్ర కార్యాల యం దాసరి భవన్‌లో ఆదివారం విలేకరులు సమావేశంలో మాట్లాడారు. హెచ్1బీ వీసాల విషయంలో తక్షణమే కేంద్రం జోక్యం చేసుకోవాలన్నారు. అమెరికాలో నైపుణ్యం కలిగిన ఉద్యోగాలకు వెళ్లే వారిలో రాష్ట్రానికి చెందిన యువతే అధికంగా ఉన్నందున సీఎం చంద్రబాబు కూడా స్పందించా ల్సిన అవసరం ఉందన్నారు. విజయవాడలో మూడు రోజులపాటు జరగనున్న సీపీఐ జాతీయ సమితి సమావేశా లలో భవిష్యత్ రాజకీయ విధానంపై ముసాయిదాను రూపొం దించనున్నట్లు చెప్పారు. పుదుచ్చేరి మహాసభలో తీర్మా నాలు, దేశంలో నెలకొన్న పలు అంశాలపై సమితి సమా వేశాలలో చర్చించనున్నట్లు తెలిపారు. ఎన్నికల సంవ త్సరంలో భవిష్యత్ రాజకీయాలపై ప్రణాళికను కూడా రూపొందించనున్నట్లు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ-ఎన్‌డీఏ పాలన పూర్తిగా వివాదస్పదంగా మారిందన్నారు. సీబీఐ, ఎన్ని కల సంఘం, గవర్నర్ వ్యవస్థను మోడీ ప్రభుత్వం తన గుప్పి ట్లో పెట్టుకుని ఆడిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ వ్యవస్థనే పూర్తిగా మార్చేయటంతో దేశం ప్రమాదంలో పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ, మోడీని ప్రశ్నిస్తే జైలుకేసని, సలామ్ కొట్టిన వారితో దోస్తీ చేసేందుకే కేంద్రం మొగ్గు చూపుతోందని విమర్శించారు. ఒక రకంగా దేశంలో బీజేపీ బ్లాక్‌మెయిలింగ్ రాజకీయాలకు పాల్పడుతోందని చెప్పారు. రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబుకు ప్రధాని అపాయింట్‌మెంట్ ఇప్పించేందుకు ఇద్దరు కేంద్ర మంత్రులు, పది మంది ఎంపీలు మోడీని బతిమలాడటం రాజకీయ బానిసత్వంగా నారాయణ వ్యాఖ్యానించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై సీపీఐ బృందం నేరుగా ప్రధానిని కలిసినపుడు, ఒకపుడు ఇద్దరు ప్రధానులను ఎంపిక చేయటమే కాకుండా మోడీతో సన్నిహిత సంబంధాలున్న చంద్రబాబుకు అపాయింట్‌మెంట్ దొరకకపోవటం శోచనీయమన్నారు. దేశంలో బీజేపీని ఓడించటం సీపీఐ లేదా వామపక్షాల వల్ల సాధ్యంకాదని నారాయణ చెప్పారు. దేశంలో ప్రజాసామ్య వ్యవస్థను పరిరక్షించేందుకు వామపక్ష, ప్రజాస్వామ్య, లౌకిక వేదికను ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు చెప్పారు. రాజకీయ విధానాల పరంగా కలిసొచ్చే అన్ని పార్టీలు ఇందులో చేరవచ్చన్నారు. కాంగ్రెస్ పార్టీ నూటికి నూరుశాతం లౌకిక పార్టీయేనని, అయితే త్రిపుర, కేరళలో ఆ పార్టీతో తాము తలపడుతున్నందున పొత్తు ఉండదని స్పష్టం చేశారు. మతోన్మాదంతో దేశాన్ని విభజించేందుకు బీజేపీ కుట్ర పన్నుతోందని, అందుకే వామపక్ష, ప్రజాస్వామ్య, లౌకిక వేదికను ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు చెప్పారు. ఈ వేదిక ఏర్పాటును విజయవాడ నుంచే ప్రారంభించాలని పార్టీ భావిస్తోందని, దీనిపై కూడా జాతీయ సమితి సమావేశాల్లో చర్చించనున్నట్లు తెలిపారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ, పక్కన దోనేపూడి శంకర్, రామకృష్ణ, అక్కినేని వనజ

అగ్రి వర్సిటీ, శాస్త్రవేత్తల అవశ్యంపై స్పష్టత ఇవ్వండి : రామకృష్ణ

రాష్ట్రంలో వ్యవసాయ యూనివర్సిటీ, శాస్త్రవేత్తల అవశ్యంపై సీఎం చంద్రబాబు స్పష్టత ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండు చేశారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రకృతి సేద్యంపై నిర్వహిస్తున్న సదస్సులో పాలేకర్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలోనే ఈ స్పష్టత అవసరమన్నారు. వ్యవసాయ యూనివర్సిటీ అవసరంలేదని, శాస్త్రవేత్తలు దండగ అనటాన్ని ఆయన ఖండించారు. ఇక దుర్గగుడిలో తాంత్రిక పూజలు జరగటం శోచనీయమన్నారు. జనవరి ఒకటో తేదీన ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేయవద్దంటూ ఉత్తర్వులు ఇచ్చిన బీజేపీ మంత్రి మాణిక్యాలరావును తక్షణమే మంత్రివర్గం నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండు చేశారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై ఈ నెల 12, 13 తేదీలలో జరిగే పార్టీ రాష్ట్ర సమితి సమావేశాలలో చర్చించనున్నట్లు రామకృష్ణ తెలిపారు. విలేకరుల సమావేశంలో పార్టీ కృష్ణాజిల్లా, విజయవాడ నగర కార్యదర్శులు అక్కినేని వనజ, దోనేపూడి శంకర్ పాల్గొన్నారు.

మహిళల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకే

సాధికారమిత్ర వ్యవస్థ ఏర్పాటు : సీఎం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : మహిళల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకే సాధికారమిత్ర ఏర్పాటు చేశామని సీఎం చంద్రబాబు చెప్పారు. వాటి పనితీరు సంతృప్తి కరంగా ఉందన్నారు. పట్టణాల్లో సాధికార మిత్ర వ్యవస్థ మరింత పటిష్టం చేయాలని ఆదేశించారు. ఆదివారం తన నివాసం నుంచి జన్మభూమి-మా వూరు 6వ రోజు నిర్వహణపై టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామసభల్లో ప్రసంగిస్తున్న విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం ప్రతిబింబిస్తోందని, భవిష్యత్ పట్ల అచంచల నమ్మకం కనిపిస్తోందని, వారిలో ఆ స్ఫూర్తిని మరింత పెంచాలన్నారు. ప్రజల్లో సంతృప్తి, సమాజంలో సంతోషం మనందరి లక్ష్యం కావాలన్నారు. రోజురోజుకూ జన్మభూమి కార్యక్రమాలు సమర్థంగా జరుగుతున్నాయని, వీటిని మరింత బలోపేతం చేయాలన్నారు. సమర్థంగా పనిచేసిన వారికి శాఖాపరంగా అవార్డులు ఇస్తామని, బాగా పనిచేసిన ప్రభుత్వ సిబ్బంది, ప్రజా ప్రతినిధులను 11,12 తేదీలలో సత్కరించాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. 5వరోజైన శనివారం జన్మభూమి నిర్వహణలో రాజమండ్రి అర్బన్, రాజమండ్రి రూరల్, విశాఖ అర్బన్, విశాఖ రూరల్, కాకినాడ తదితర మండలాలు ముందున్నాయని ప్రశంసించారు. అదే విధంగా రామచంద్రాపురం, బుద్ధమర్రి, అన్నవరం, గుడివాడ, పెద్దాపురం, వినుకొండ, రంపచోడవరం, ఐ.పోలవరం తదితర గ్రామాలు ముందున్నాయన్నారు. చంద్రన్న బీమా పట్ల 70 శాతం సంతృప్తి వ్యక్తమైందని, జన్మభూమి కమిటీల పనితీరుపై 63% సంతృప్తి వచ్చిందన్నారు. మొత్తంగా జన్మభూమి పట్ల ప్రజల్లో 93% సంతృప్తి వ్యక్తం కావడంపై సంతోషం వ్యక్తం చేశారు. సాధికార మిత్రల పనితీరు 58%బాగుందని వెల్లడైందంటూ దీనిని తమ పనితీరు ద్వారా మరింత పెంచుకోవాలన్నారు. ఇప్పటివరకు 6,15,124 ఫిర్యాదులు అందాయని, వాటిలో 3,22,912 ఫిర్యాదులు (52%) అప్ లోడ్ చేశారని ముఖ్యమంత్రి తెలిపారు. ఇప్పటివరకు వీటిలో 70,380 ఫిర్యాదులను పరిష్కరించినట్లు చెప్పారు. ఫిర్యాదులు అప్ లోడ్ చేయడం 30%నుంచి 52%కు పెరగడం పట్ల సంతృప్తి ప్రకటించారు. కర్నూలు, చిత్తూరు, విజయనగరం, ప్రకాశం జిల్లాలలో ఫిర్యాదుల అప్ లోడింగ్ మరింత వేగం పుంజుకోవాలన్నారు. రియల్ టైం ప్రాతిపదికన ఫిర్యాదుల అప్ లోడింగ్, పరిష్కారం చేయాలన్నారు. 14వేలమంది డిజిటల్ అసిస్టెంట్ల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తన పని ఏమైందని ఎవరైనా ఆధార్ నెంబర్ చెబితే ఆ అర్జీ ఏ దశలో ఉందో చెప్పే స్థాయిలో ఉండాలన్నారు. ప్రభుత్వ పథకాల లబ్ది కోసం కుటుంబాలు వేరుపడటం మంచిదికాదు. ఒకే ఇంట్లో ఉంటూ కార్డులు, పెన్షన్లు, ఇళ్ల కోసం విడిపోవడం బాధాకరం. తల్లిదండ్రులను బాగా చూసుకునేవారికే సింగపూర్‌లో ఇళ్లు, ప్రభుత్వ లబ్ది. అదేవిధంగా మనవద్ద కూడా ఉమ్మడి కుటుంబంగా ఉండేవారికే ప్రభుత్వ పథకాల ద్వారా అధిక లబ్ది కలిగించే అంశం పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. కలిసివుంటే ప్రభుత్వం నుంచి మరిన్ని వీలైన మేళ్లు కలిగిస్తామనే భరోసా ప్రజల్లో కల్పించాలన్నారు. కుటుంబాల పరంగా కాకుండా కుటుంబ సభ్యుల పరంగా ఇకపై పండుగ కానుకలు ఇచ్చే అంశం పరిశీలించాలన్నారు.

ఆదివారం 'జన్మభూమి' వద్దు..

● 'విద్యాశాఖ'దే ప్రధాన భూమిక ● చిన్నారుల చదువులపై తల్లిదండ్రుల ఆందోళన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా జన్మభూమి సభల నిర్వహణను ప్రభుత్వం ఓ జాతరలా మార్చింది. విద్యాశాఖకు పూర్తిగా బాధ్యతను అప్పగించింది. ఉపాధ్యాయ, విద్యార్థిలోకాన్ని సభలకు తరలించాలని ఆదేశించింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా విద్యాశాఖ ఉన్నతాధికారులు ఉరుకులు పరుగులు తీస్తున్నారు. ఆదివారం సైతం జన్మభూమి సభలకు ఉపాధ్యాయులు, విద్యార్థుల్ని తరలించడంపై నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ వైఖర్ని ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు తూర్పారబడుతున్నాయి. విద్యార్థుల భవితతో టీడీపీ సర్కారు చెలగాటమాడుతోంది. చదువుల కంటే..జన్మభూమి సభలే ముఖ్యమనే ధోరణితో ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ప్రభుత్వ ఆదేశాలతో ఉన్నతాధికారుల నుంచి ప్రధానోపాధ్యాయుల వరకూ జన్మభూమి సభల నిర్వహణపై దృష్టి కేంద్రీకరించారు. ఈ సభలకు హాజరుకాని విద్యార్థులకు టీసీలు ఇస్తామంటూ హెచ్ఎంలు వ్యాఖ్యానించడం వివాదస్పదంగా మారింది. గ్రామాల్లోని జన్మభూమి కమిటీ సభ్యుల దూకుడుతో ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. ఈ నెల 2 నుంచి 11వ తేదీ వరకూ 'మా ఊరు-జన్మభూమి' సభలకు ఉపాధ్యాయులు, విద్యార్థులు తరలిరావాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. ఈనెల 12 నుంచి 21వరకూ ప్రభుత్వం సంక్రాంతి సెలవులు ప్రకటించింది. పనిదినాల్లో ఎక్కడిక్కడే జన్మభూమి సభలకు ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరవుతున్నారు. జన్మభూమి పేరుతో వేలాది మంది ఉపాధ్యాయులను నోడల్ ఆఫీసర్లుగా నియమించారు. పీఈటీలను జన్మభూమి సభలకు పూర్తిగా కేటాయించారు. దీంతో పాఠశాలల్లో వ్యాయామ తరగతులు నిలిచిపోయాయి. జన్మభూమికి వచ్చిన చిన్నారులతో మరుగుదొడ్ల సర్వేలు, ర్యాలీలు నిర్వహించడం వివాదస్పదంగా మారింది.

జన్మభూమి పేరిట 'కార్పొరేట్' తరగతులు

జన్మభూమి సభల పేరుతో ఆదివారమూ కార్పొరేట్ విద్యా సంస్థలు తరగతులను యథాతథంగా నిర్వహించాయి. కొందరు విద్యార్థులను జన్మభూమి సభలకు పంపి, టెన్త్, ఇంటర్ వారికి తరగతులు, అదనపు స్టడీ అవర్లను విరుద్ధంగా నిర్వహించారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులకు విరుద్ధంగా కార్పొరేట్ యాజమాన్యం వ్యవహరి స్తోందని తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ఈ సభలకు ఉపాధ్యాయులు, విద్యార్థుల్ని మినహాయించాలని వారు కోరుతున్నారు.

ఆనందాల ఆదివారాలపై విమర్శలు

విద్యార్థుల పరీక్షల సమయంలో ఆనందాల ఆదివారం నిర్వహణపైనా విమర్శలు నెలకొన్నాయి. విజయవాడ బందరురోడ్డుపై నిర్వహించిన ఆనందాల ఆదివారంతో ట్రాఫిక్ స్తంభించింది. బందరురోడ్డుపై వివిధ ప్రాంతాలకు కొద్దిసేపు రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకూ వాహనాలను ఇతర ప్రాంతాల మీదుగా దారిమళ్లించారు. ప్రభుత్వ చర్యల్ని ప్రజలు తూర్పారబట్టారు.

కోలాహలంగా పక్షుల పండుగ

● ప్రారంభించిన మంత్రులు నారాయణ, సోమిరెడ్డి ● భారీగా తరలివచ్చిన విద్యార్థులు, పర్యాటకులు



విశాలాంధ్ర-నెల్లూరు బ్యూరో : నెల్లూరు జిల్లాలో ఫ్లెమింగో పక్షుల పండుగ ఆదివారం అట్టహాసంగా ప్రారంభమైంది. రాష్ట్ర పండుగ అయిన పక్షుల పండుగకు ప్రభుత్వం 5.5 కోట్ల రూపాయలు విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ నిధులతో స్టాల్స్ ఏర్పాటు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పండుగను అధికారికంగా మంత్రులు నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సూళ్లూరుపేటలో ప్రారంభించారు. పులికాట్ సరస్సు సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలంలో విస్తరించి ఉంది. అందువల్ల మూడు మండలాల పరిధిలో పక్షుల పండుగను నిర్వహిస్తారు. దొరవారిసత్రం మండలంలోని నేలపట్టులో పక్షుల రక్షిత కేంద్రం ఉంది. పులికాట్ సరస్సు ఒడ్డున ఉన్న పక్షుల కేంద్రానికి విదేశీ విహంగాలు వచ్చి చేరుతాయి.

తడలో పులికాట్ సరస్సుపై బోటు షికారు ఉంటుంది. సూళ్లూరుపేటలో స్టాళ్ల ఏర్పాటుతో పాటు ప్రతి రోజూ సాయంత్రం సినీనటులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. 7 నుంచి 9వ తేదీ వరకు మూడు రోజుల పాటు పక్షుల పండుగ నిర్వహిస్తారు. ఆదివారం సెలవు రోజు కావడంతో విద్యార్థులు, పలు గ్రామాల ప్రజలే కాకుండా పక్క రాష్ట్రాల నుంచి పర్యాటకులు విచ్చేసి నేలపట్టు పక్షుల కేంద్రంలోని విహంగాలను వీక్షించారు. పిల్లలకు ఆహ్లాదకరంగా పర్యావరణ కేంద్రం వద్ద చిల్డ్రన్స్ పార్కును ఏర్పాటు చేశారు. సూళ్లూరు పేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఫ్లెమింగో ఫెస్టివల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ 12 సంవత్స రాల నుంచి ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించుకుంటున్నామని, నైజీరియా తదితర దేశాల నుంచి పక్షులు ఇక్కడకు చేరుకుని ఆహ్లాదపరచడం గొప్పవిషయమన్నారు. కాళంగి నదికి సముద్రం నుండి ఉప్పు నీరు చేరకుండా ఉండేందుకు శాశ్వత ప్రాతిపదికన తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీనికి అయ్యే ఖర్చులో రూ.50 లక్షలు షార్ కేంద్రం అందజేయనుందని, మిగిలినది రాష్ట్ర ప్రభుత్వం ద్వారా చెల్లించి పనులు పూర్తి చేస్తామన్నారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ మాట్లాడుతూ 6 వేల కి.మీ. పైచిలుకు దూరం నుంచి పక్షులు అక్కడికి చేరుకొని, సంతాన ఉత్పత్తి అనంతరం తిరిగి వెళ్లడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, జేసీ ఏఎండీ ఇంతియాజ్, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, సంయుక్త కలెక్టరు-2 వెంకటసుబ్బారెడ్డి, శ్రీసిటి ఎండీ సన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ డెలివరీలో దోపిడీ

సిలిండర్‌పై అదనంగా రూ.20 నుంచి రూ.40 వసూలు : ప్రజలపై అదనపు భారం



విశాలాంధ్ర అమరావతి: రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు ప్రభుత్వం దీపం పథకాన్ని ప్రవేశ పెట్టి వంటగ్యాస్‌ను అందిస్తోంది. అయితే దీపం కనెక్షన్ల లబ్ధిదారుల సిలిండర్లు ఖాళీ అయిన వెంటనే మరో సిలిండర్ తెచ్చుకోవడం ఇబ్బందిగా మారింది. మండల కేంద్రాల్లో సంబంధిత గ్యాస్ ఏజెన్సీలు లేక పోవడంతో దగ్గరలోని పట్టణ కేంద్రాల్లోని ఏజెన్సీ కేంద్రాల నుంచి సిలిండర్‌ను తీసుకెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. వాస్తవానికి దీపం కనెక్షన్లు ఉన్న వారికి ఏజెన్సీ ఉచితంగా గ్యాస్ సిలిండర్‌ను డోరు డెలివరీ చేయాల్సి ఉండగా రూ.30 నుంచి రూ.40 వసూలు చేస్తున్నారు. కొన్ని ఏజెన్సీలు మండల కేంద్రాలకు వారంలో ఒక సారి సిలిండర్లను సరఫరా చేస్తూ అత్యవసరం ఉన్న వారి నుంచి అదనపు డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. 2016 జూలైలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అనంతరం ప్రభుత్వ రంగ ఆయిల్ సంస్థలు గ్యాస్ సిలిండర్ ధరలను 16 నెలల్లో 19 సార్లు పెంచాయి. దీంతో సామాన్యులపై తీవ్రభారం పడుతోంది. గత అక్టోబర్‌లో సబ్సిడీ సిలిండర్ ధర రూ.714 ఉండగా నవంబర్ నుంచి రూ.808కి చేరింది. సిలిండర్ అసలు ధర రూ.769.52 కాగా జీఎస్టీతో కలిపి రూ.808 తీసుకోవాల్సి ఉన్నా ఇంటికి తెచ్చే సిలిండర్‌ను డెలివరీ చేసే సమయంలో రూ.820 నుంచి రూ.840 వరకు వసూలు చేస్తున్నారు.

రవాణాకు అదనంగా చెల్లించాలని ఏజెన్సీలు డెలివరీ సిబ్బందితో బలవంతపు వసూళ్లకు పాల్పడుతూ వినియోగదారులను దోపిడీ చేస్తున్నాయి. ఈ విషయం అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. గ్యాస్ ఏజెన్సీల్లో సబ్సిడీగ్యాస్ వినియోగదారుల సంఖ్య ఎక్కువగానే ఉంది. గ్యాస్ ఏజెన్సీలు లేని చోట గ్రామాల్లోనైతే రూ.100కు పైగా అదనంగా వసూలు చేస్తున్నారు. మార్కెట్ ధర ప్రకారం సిలిండర్ ధర రూ.769.52 ఉంటే ట్రాన్స్‌పోర్టు, డెలివరీ ఛార్జీలు కలిపి రూ.808కి అమ్ముకోవాలని అధికారుల నుంచి ఆదేశాలు ఉన్నప్పటికీ గ్యాస్ బుకింగ్ తర్వాత వచ్చే బిల్లుపై డెలివరీ ఛార్జీలు ఒక్కో సిలిండర్‌పై రూ.20 నుంచి రూ.30 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. దీనిపై ప్రశ్నించిన వారి గ్యాస్ సిలిండర్‌ను ఇంటి బయటే పడేసి వెళ్లిన సందర్భాలు ఉన్నాయి. గ్యాస్ ఏజెన్సీలు 5 కి.మీల వరకు వినియోగదారునికి ఉచితంగా ఇంటికి సిలిండర్ తీసుకెళ్లి ఇవ్వాలి. 5కి.మీల కంటే ఎక్కువ దూరం ఉంటే రూ.15 వరకు అదనంగా వసూలు చేయాలి. ఎంత దూరం ఉన్న ఇంత కంటే ఎక్కువ వసూలు చేయవద్దన్న నిబంధనలను ఏజెన్సీలు గాలికొదిలేశాయి. వినియోగదారుడు గ్యాస్ కోసం గోదాంకు వెళ్తే క్యాష్ అండ్ క్యారీ కింద ధరలో రాయితీ ఇచ్చి నిబంధన ప్రకారం సిలిండర్ ధరలో రూ.20 వరకు తగ్గించి తీసుకోవాలి. కాని గ్యాస్ గోదాంకు వెళ్లిన వారిపై సైతం సిలిండర్ ధరలో తేడా లేకుండా తీసుకొని ఏజెన్సీలు దోపిడి చేస్తున్నాయి. గ్యాస్‌తో పాటు తెచ్చే బిల్లుపై ఉండే ధరను మాత్రమే వినియోగదారుల నుంచి కంపెనీ బాయ్‌లు వసూలు చేయాలి. అదనంగా డబ్బులు వసూలు చేసేవారిపై చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరికలు జారీ చేసినా అమలుకావటం లేదు.

జీఎస్ అల్లాయ్ కొలిమి ప్రమాదంలో

నాలుగుకు చేరిన మృతుల సంఖ్య

● మృతులు, తీవ్రంగా గాయపడినవారికి రూ.5 లక్షల పరిహారం

● స్వల్పంగా గాయపడిన వారికి రూ.2 లక్షలు

● సమగ్ర విచారణకు సీఎం చంద్రబాబు ఆదేశం



విశాలాంధ్రబ్యూరో-అమరావతి: విజయవాడ శివార్లలోని గన్నవరం మండలం సూరంపల్లిలోని జీఎస్ అల్లాయ్ కాస్టింగ్ ప్రైవేటు లిమిటెడ్ విద్యుత్ కొలిమిలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన వారి సంఖ్య నాలుగుకు చేరింది. శనివారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతి చెందగా, ఆదివారం ఉదయం ఒడిశాకు చెందిన సత్యనారాయణ, ఆటోనగర్ ప్రాంతానికి ముజాహిత్ అహ్మద్ మృతి చెందారు. గొల్లపూడిలోని ఆంధ్రా ఆసుపత్రిలో ఎండీ జబ్బార్ (బీహార్), రమేష్, రమేష్ నాయక్ (ఒడిషా), బాబా ప్రసాద్ (అమలాపురం), ఉమాశంకర్ భరత్ (బీహార్) చికిత్స పొందుతున్నారు. వీరిలో జబ్బార్, రమేష్, రమేష్ నాయక్‌లకు ప్రమాదంలో 70 శాతంపైగా కాలిన గాయాలవడంతో వారి పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదంపై సీఎం చంద్రబాబు సమగ్ర విచారణకు ఆదేశించారు. కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్ విజయకృష్ణన్‌ను ప్రభుత్వం విచారణాధికారిగా నియమించింది. గొల్లపూడి ఆంధ్రా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు, వారి బంధువులను సీఎం చంద్రబాబు ఆదివారం పరామర్శించారు. ఐసీయూలో చికిత్స పొందుతున్న బాధితుల గురించి ఆంధ్రా ఆసుపత్రి ఎండీ డాక్టర్ రమణమూర్తిని అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో మృతి చెందిన, తీవ్రంగా గాయాలైన కుటుంబాలకు రూ.5 లక్షల స్వల్ప గాయాలతో చికిత్స పొందుతున్న వారికి రూ.2 లక్షల నష్టపరిహారాన్ని ప్రకటించారు. జీఎస్ అల్లాయ్ కంపెనీ మృతులకు రూ.2 లక్షల నష్టపరిహారాన్ని ప్రకటించిందని, చంద్రన్న బీమాలో మరో రూ.5 లక్షలు వస్తుందని సీఎం తెలిపారు. క్షతగాత్రులు కోలుకునేంత వరకు మెరుగైన వైద్యం అందజేయనున్నట్లు తెలిపారు. మృతి చెందిన కుటుంబాలకు చంద్రబాబు సంతాపం తెలియజేశారు. 1,400 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత గల విద్యుత్ కొలిమిలో పని చేస్తున్న కార్మికులకు నైపుణ్యం లేకపోవటంతో ద్రవరూపంలోని ఇనుము చిమ్మిందని, దీనివల్ల ప్రమాదం ఏర్పడినట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. అయినప్పటికీ ప్రమాదం జరగటం దురదృష్టకరమని, ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేయిస్తున్నామని వివరించారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వపరంగా ఆదుకుంటామని చంద్రబాబు హామీ ఇచ్చారు. సీఎం వెంట వైద్య ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కంపెనీ యాజమాన్యంపై సీఎం సీరియస్...

సూరంపల్లిలోని జీఎస్ అల్లాయ్ కాస్టింగ్ ప్రైవేటు లిమిటెడ్‌లో భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం, అగ్ని ప్రమాద నిరోధకాలు లేకపోవటంపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారని సమాచారం. 15 ఏళ్లుగా కొన్ని అనుమతులు లేకుండానే కర్మాగారాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక అందింది. దీనికితోడు విద్యుత్ కొలిమి ప్రాంతంలో ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులను తక్కువ జీతానికే ఉద్యోగంలో పెట్టుకున్నారని, పందలాది కుటుంబాలు ఆ కంపెనీపై ఆధారపడి ఉన్నట్లు అధికారులు నివేదించారు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఫైర్, ఫ్యాక్టరీస్ శాఖలను ముఖ్యమంత్రి అదేశించారు. సీఎం ఆదేశాలతో రెవెన్యూ, పోలీసు,ఫైర్, ఫ్యాక్టరీస్ అధికారులు ఆదివారం సూరంపల్లిలోని కర్మాగారంలో విచారణను ప్రారంభించారు. ఈస్ట్‌జోన్ ఏసీపీ విజయభాస్కర్ ఆధ్వర్యంలో గన్నవరం, ఉంగుటూరు, కంకిపాడు, తోట్లవల్లూరు, పమిడిముక్కల పోలీస్ స్టేషన్ల అధికారులు కంపెనీలో విచారణను చేపట్టి, లోపలికి ఎవరినీ అనుమతించకుండా గేట్లను మూసేశారు.



ఉత్సాహంగా మారథాన్

ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

విశాలాంధ్ర - విజయవాడ(కృష్ణలంక):

గడిచిన మూడేళ్లలో అమరావతి మారథాన్ రన్‌కు మంచి గుర్తింపు వచ్చిందని, రానున్న రోజుల్లో ప్రపంచంలోనే మంచి గుర్తింపు వస్తుందని ఆశిస్తున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. ఆదివారం స్థానిక ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద ఏర్పాటు చేసిన అమరావతి మారథాన్ రన్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ మారథాన్ రన్‌లో పాల్గొన్న చాలా మందికి అవార్డు రావడం అభినందనీయమని, రాని వారికి మరోసారి వస్తుందని, దానికి ముందు మంచి ఆరోగ్యం వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ మారథాన్ నిర్వహిస్తామని కొందరు నాదృష్టికి తీసుకురాగానే ప్రోత్సహించినట్లు తెలిపారు. అమరావతిలో మారథాన్‌ను అమరావతితో పాటు విశాఖపట్నం, తిరుపతి కూడా నిర్వహించినందుకు నిర్వాహకులను అభినందిస్తున్నామని తెలిపారు. అమరావతిలో మారథాన్ 7వేల మంది పాల్గొనడం మంచి పరిణామమని, దీనిలో అంతర్జాతీయ, జాతీయ ప్రముఖులు పాల్గొనడం వల్ల తక్కువ కాలంలోనే మంచి ఆదరణ లభించనుందని తెలిపారు. జన్మభూమి-మాఊరులో క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యక్తి రోజులో ఒక గంట సమయం ఆటలకు కేటాయించాలని, వయస్సుతో సంబంధం లేకుండా రోజూ వ్యాయామం చేయాలని సూచించారు. అమరావతి కేంద్రంగా ఒలిపింక్ నిర్వహించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా 21 కే, 10 కే, 5 కే రన్‌లో గెలుపొందిన వారికి రూ.20 లక్షల ప్రైజ్ మనీని సీఎం అందజేశారు. 10 కే రన్ పురుషుల విభాగంలో విజయ్ కుమార్, రమేష్, జయదేవ్‌లకు, మహిళా విభాగంలో సౌజన్య, ప్రియదర్శిని, శివానీ, కీర్తికలకు, 21 కే రన్ పురుషుల విభాగంలో లింగన్న, వెంకటేశ్వరరావు, బాబురావు, మహేంద్ర, మహిళా విభాగంలో ఉషారాణి తదితరులు, 21 కే రన్ సీనియర్ పరుషుల విభాగంలో మహ్మద్, శ్రీనివాస్‌రెడ్డి, సునీల్, శ్రీకాంత్‌లకు, 10 కే రన్ సీనియర్ విభాగం పరుషులలో పార్థసారధి, బాబురావు, ఈశ్వరరావు, సూర్యలకు చెక్‌లు, జియో ఫోన్‌లు అందజేశారు. విజయవాడ మేయర్ కోనేరు శ్రీధర్, మహిళా కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పి.అనురాధ, క్రీడలు శాఖ ముఖ్యకార్యదర్శి ఎల్‌వీ సుబ్రహ్మణ్యం, కలెక్టర్ బి. లక్ష్మీకాంతం, విజయవాడ మున్సిపల్ కమిషనర్ జే.నివాస్, ఏపీఎన్‌ఆర్‌టీ అధ్యక్షులు వేమూరు రవి తదితరులు పాల్గొన్నారు.



సీఎస్‌కేలోకి గంభీర్..?

హైదరాబాద్:

ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో వరుస ఓటములతో సతమతం అవుతున్న కోల్‌కతా నైట్ రైడర్స్‌ను తన అసమాన దూకుడు.. చక్కని వ్యూహాలతో రెండుసార్లు విజేతగా నిలిపిన క్రికెటర్ గౌతమ్ గంభీర్. ఇన్నాళ్లూ వెన్నెముకలా నిలిచిన గౌతీని తన వద్ద అట్టి పెట్టుకోకుండా వదిలేసింది ఆ జట్టు యాజమాన్యం. రూ.21 కోట్లతో వెస్టిండీస్ ద్వయం సునీల్ నరైన్, అంద్రూ రసెల్‌ను రీటెయిన్ చేసింది. కోల్‌కతా వదిలేసిన గంభీర్‌ను వేలంలో ధోనీ సారథ్యంలోని చెన్నై సూపర్ కింగ్స్ కొనుగోలు చేయనుందా! అనే సందేహాలు కలుగుతున్నాయి కొందరికి! ఓ అభిమాని ఇదే అభిప్రాయం వ్యక్తం చేశాడు. వికాస్ కోఠారీ అనే వ్యక్తి 'ఐపీఎల్ వేలంలో ఈసారి గౌతమ్ గంభీర్‌ను చెన్నై సూపర్ కింగ్స్ తీసుకుంటుందని నాకు గాఢంగా అనిపిస్తోంది' అని ట్వీటర్‌లో పోస్ట్ చేశాడు. దానికి చెన్నై విచిత్రంగా బదులిచ్చింది. రెండు ఎమిటోకాన్స్‌ను ఉంచింది. ఇప్పుడీ విషయం వైరల్‌గా మారింది. వయసు మీద పడిందని గంభీర్‌ను షారుఖ్ వదిలేసినట్టు అందరూ భావిస్తున్నారు. ఐతే వేలంలో రైట్ టు మ్యాచ్ ద్వారా తక్కువ ధరకు సొంతం చేసుకోవాలన్నది వారి అసలు వ్యూహంగా కనిపిస్తోంది. అన్నీ అనుకూలిస్తే తన మాతృభూమి ఢిల్లీకి ప్రాతినిధ్యం వహిస్తున్న ఢిల్లీ డేర్ డెవిల్స్‌కు ఆడాలన్న కోరికను గతంలో గంభీర్ బయటపెట్టిన సంగతి తెలిసిందే.

నీరు బదులు బీరు..!



కేప్‌టౌన్:

దక్షిణాఫ్రికాతో తొలి టెస్ట్ ఆడుతున్న భారత జట్టును నీటి కష్టాలు ఇబ్బందులు పెడుతున్నాయి. ప్రస్తుతం కేప్‌టౌన్‌లో అత్యంత దారుణ దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. నగరంలో నీటికొరత తీవ్రంగా ఉంది. దీంతో భారత క్రికెటర్లు వినియోగించే నీటిపై అధికా రులు ఆంక్షలు విధించారు. షవర్ కింద రెండు నిమిషాలు మాత్రమే స్నానం చేయాలని క్రికెటర్లకు అధికారులు స్పష్టం చేశారు. అలాగే టబ్ బాత్‌ను పూర్తిగా నిషేధించారు. ప్రస్తుతం కేప్‌టౌన్‌లో ఉష్ణోగ్రత చాలా ఎక్కువగా ఉంది. దీని నుంచి ఉపశమనం పొందేందుకు తాగే నీటిపైనా అధికారులు ఆంక్షాలు విధించారు. 'తాగేందుకు కావాల్సిన స్థాయిలో నీరు ఇవ్వలేం.. కానీ ఎంత కావాలన్నా బీరు అందిస్తాం. ఒక వాటర్ బాటిల్ బదులు.. 10 బీర్లు ఇస్తామ'ని అధికారులు చెప్పడంతో.. షాక్ తినడం క్రికెటర్ల వంతైంది. ఇదిలావుంటే.. పిచ్ క్యూరింగ్, గ్రౌండ్ సిబ్బంది అవసరాల కోసం రోజుకు 87 లీటర్ల నీటిని మాత్రమే అధికారులు సరఫరా చేస్తున్నారు. పిచ్‌పై పచ్చికను కాపాడేందుకు కూడా ఈ నీరు సరిపోదని క్యూరేటర్ చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అవుట్ ఫీల్డ్ పూర్తిగా పొడిబారి పిచ్ స్పిన్‌కు అనుకూలించే అవకాశం ఉందని క్యూరేటర్ అన్నారు.

కోహ్లి అవుట్‌తో మనస్తాపం.. వ్యక్తి ఆత్మహత్యాయత్నం..!



భోపాల్:

తమ అభిమాన క్రికెటర్, టీమిండియా సారథి విరాట్ కోహ్లి దక్షిణాఫ్రికాతో జరుగుతున్న తొలి టెస్టులో 5 పరుగులకే ఔటవడంతో ఇప్పటికే నెటిజన్లు ట్విటర్ వేదికగా చురకలు వేస్తున్నారు. అయితే.. ఇక్కడ ఓ వ్యక్తి మాత్రం మనస్థాపం చెంది ఏకంగా ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టాడు. మధ్యప్రదేశ్‌లోని రత్లాం జిల్లాలో ఈ ఘటన జరిగింది. 65ఏళ్ల రైల్వే మాజీ ఉద్యోగి బాబులాల్ భైర్వా జనవరి 5న కేప్‌టౌన్ వేదికగా జరుగుతోన్న భారత్-దక్షిణాఫ్రికా తొలి టెస్టు మ్యాచ్‌ను వీక్షిస్తున్నాడు. ఈ మ్యాచ్‌లో కోహ్లి 5 పరుగులకే ఔటయ్యాడు. తన అభిమాన క్రికెటర్ అత్యంత స్వల్ప స్కోరుకే ఔటవడంతో మనస్థాపానికి గురైన భైర్వా గదిలోకి వెళ్లి కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. మంటలకు తట్టుకోలేక అతడు పెడుతున్న కేకలు విని వెంటనే కుటుంబసభ్యులు రక్షించారు. తీవ్రంగా గాయాలైన భైర్వాను దగ్గర్లోని ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. అతడి తలకు, ముఖం, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం భైర్వా పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. విరాట్ కోహ్లి ఔటవడంతోనే మనస్థాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు అతడు వెల్లడించినట్టు అక్కడి పోలీస్ అధికారి పీఎస్.అల్వా తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


హెచ్‌సీఏలో తారాస్థాయి విభేదాలు..!



హైదరాబాద్:

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) నిర్వహించిన సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నేత వీ హనుమంతరావు సహనం కోల్పోయారు. మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌ను హెచ్‌సీఏ సమావేశానికి అనుమతించకపోవడంతో ఆగ్రహించిన వీహెచ్.. సమావేశంలో మైక్‌ను నేలకేసి కొట్టారు. హెచ్‌సీఏ కార్యాలయంలో ఆదివారం హెచ్‌సీఏ ప్రత్యేక సాధారణ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన అజారుద్దీన్‌ను సిబ్బంది అడ్డుకోవడంతో వీహెచ్ ఆగ్రహంగా స్పందించారు. ఇదేమైనా టీఆర్‌ఎస్ మీటింగ్ అనుకుంటున్నావా.. అని టీఆర్‌ఎస్ నేత, హెచ్‌సీఏ ప్రెసిడెంట్ వివేక్‌పై మండిపడ్డారు. ఈ సందర్భంగా వివేక్ స్పందిస్తూ..లోథా కమిటీ ఆదేశాల అమలు కోసం ఈ మీటింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు. మీటింగ్‌లో ఇంతకుముందు అమలైన 16 అంశాలపై చర్చ జరిగిందన్నారు. తెలంగాణ క్రికెట్ అసోసియేషన్(టీసీఏ)కు అజారుద్దీన్ మద్దతిస్తున్నారని తెలిసిందని, అందుకే అనుమతి ఇవ్వలేదని తెలిపారు. అజారుద్దీన్ పై తమకు చాలా గౌరవం ఉందన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌లో నిధులు లేవని, అండర్-14 నిర్వహించడానికి కూడా నిధులు లేకపోతే ఇతరుల దగ్గర నుంచి నిధులు తెచ్చి నిర్వహించామని తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు హెచ్‌సీఏ లోథా సిఫార్సులన్నింటినీ అమలు చేస్తోందని వివేక్ చెప్పారు. హనుమంతరావు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని ఆరోపించారు. టీసీఏ వాళ్ల పని వాళ్లు చూసుకుంటే బాగుంటుందని సలహా ఇచ్చారు. అజారుద్దీన్ తెలంగాణ క్రికెట్ అసోషియేషన్‌కి బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంటున్నారని వార్తలు వచ్చినందుకు ఆయన్ని మీటింగ్‌కు రానివ్వలేదని వివేక్ స్పష్టం చేశారు.

మూడోరోజు ఆట వర్షార్పణం



కేప్‌టౌన్:

టీమిండియా-దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరుగుతున్న తొలి టెస్టుకు వర్షం ఆటంకంగా మారింది. ఆదివారం కేప్‌టౌన్‌లో భారీవర్షం పడటంతో మూడోరోజు ఆట నిర్వహించడం సాధ్య పడలేదు. పలుమార్లు వర్షం అంతరాయం కల్గించడంతో ఆటను రద్దు చేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. తొలుత మ్యాచ్ ఆరంభ సమయంలో భారీ వర్షం పడింది. ఆపై కాసేపు వర్షం ఆగినప్పటికీ మరొకసారి పడింది. దాంతో మ్యాచ్ జరిగే అవకాశం లేకపోడంతో మూడో రోజు ఆట ఒక్క బంతి కూడా పడకుండానే వర్షార్పణం అయ్యింది. కేప్‌టౌన్‌లోని మ్యాచ్ జరిగే న్యూలాండ్స్ స్టేడియానికి సంబంధించి డ్రైనేజ్ వసతులు మెరుగ్గా ఉన్నప్పటికీ పదే పదే వర్షం కురువడంతో చేసేది ఏమీ లేకపోయింది. శనివారం రెండో రోజు ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా తన రెండో ఇన్నింగ్స్‌లో రెండు వికెట్లు కోల్పోయి 65 పరుగులు చేసింది. ప్రస్తుతం ఆమ్లా (4 బ్యాటింగ్), నైట్‌వాచ్‌మన్ రబడ (2 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఓవరాల్‌గా సఫారీ జట్టు 142 పరుగుల ఆధిక్యంలో ఉంది. టీమిండియా తన తొలి ఇన్నింగ్స్‌లో 209 పరుగులకు ఆలౌటైంది.

పాండ్య డబుల్ యాక్షన్... : మంజ్రేకర్



ముంబై:

యువ క్రికెటర్ హర్దిక్ పాండ్యపై భారత మాజీ ఆటగాడు సంజయ్ మంజ్రేకర్ ట్విట్టర్‌లో ప్రశంసల వర్షం కురిపించాడు. హర్దిక్‌ను బాలీవుడ్ బిగ్‌బి అమితాబ్‌తో పోల్చారు. తన సినిమాల్లో అమితాబ్ ఎలాగైతే రెండు పాత్రలను అవలీలగా పోషిస్తారో అలాగే మైదానంలో పాండ్య కూడా ద్విపాత్రాభినయం చేస్తాడని అన్నాడు. కేప్‌టౌన్‌లో జరిగిన మొదటి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 286 పరుగులు చేసింది. బ్యాటింగ్ ప్రారంభించిన భారత్ 76 పరుగులకు 5 వికెట్లను కోల్పోయి కష్టాల్లో ఉన్న సమయంలో పాండ్య తన బ్యాంటింగ్‌తో అందరికీ సమాధానం తెలిపాడు. పాండ్య చేసిన బ్యాంటింగ్‌తో భారత్ ఆధిక్యంలోకి వచ్చింది. 95 బంతుల్లో 93 పరుగులు చేసి భారత్‌ను 200 మార్కును అందుకునేట్లు చేశాడంటూ పొగడ్తలతో ముంచేత్తాడు.

దిగ్గజాల సరసన కుక్



సిడ్నీ:

ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ అలెస్టర్ కుక్ తన టెస్టు కెరీర్‌లో మరో మైలురాయిని చేరుకున్నాడు. 12వేల టెస్టు పరుగులు సాధించిన క్లబ్‌లో కుక్ తాజాగా చేరిపోయాడు. యాషెస్ సిరీస్‌లో భాగంగా ఆసీస్‌తో జరుగుతున్న చివరిదైన ఐదో టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో కుక్ 10 పరుగుల్ని చేయడం ద్వారా పన్నెండు వేల టెస్టు పరుగుల్ని సాధించాడు. తద్వారా 12 వేలు, అంతకుపైగా పరుగులు సాధించిన దిగ్గజ క్రికెటర్లు సచిన్ టెండూల్కర్(15,921), రికీ పాంటింగ్ (13,378), జాక్వస్ కల్లిస్(13,289), కుమార సంగక్కార(12,400)ల సరసన కుక్ స్థానం సంపాదించాడు. యాషెస్ సిరీస్ నాలుగో టెస్టులో కుక్ అజేయంగా 244 పరుగులు సాధించాడు. దాంతో ఒక టెస్టు మ్యాచ్‌లో ఓపెనర్‌గా ఇన్నింగ్స్ ఆరంభించి కడవరకూ అజేయంగా నిలవడమే కాకుండా అత్యధిక వ్యక్తిగత స్కోరును సాధించి రికార్డు పుస్తకాల్లోకి ఎక్కాడు. తద్వారా 45 ఏళ్ల రికార్డును కుక్ బ్రేక్ చేశాడు. అంతకుముందు 1972లో న్యూజిలాండ్ ఓపెనర్ గ్లెన్ టర్నర్స్(223 నాటౌట్) ఓపె నర్‌గా అత్యధిక వ్యక్తిగత స్కోరు నమోదు చేయగా, ఆపై దాన్ని కుక్ సవరించాడు. ఇదిలా ఉంచితే, చివరిటెస్టు తొలి ఇన్నింగ్స్‌ను ఆస్ట్రేలియా 649/7 వద్ద డిక్లేర్ చేసింది. అటు తరువాత రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లండ్ నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి నాలుగు వికెట్లు కోల్పోయి 93పరుగులు చేసింది.

ప్రజానాయకుడు అప్పలనాయుడు

సంస్మరణ సభలో సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర ప్రతినిధి-విజయవాడ:

కమ్యూనిస్టు పార్టీ నాయకుడు, మాజీ కార్పొరేటర్ ఇజ్జాడ అప్పలనాయుడు ప్రజా నాయకుడని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ కొనియాడారు. ఇజ్జాడ అప్పలనాయుడు సంస్మరణ సభ ఆదివారం విశాలాంధ్ర రోడ్డులోని శాతవాహన కళాశాల మైదానంలో జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీలకు అతీతంగా నాయకులు పాల్గొని అప్పలనాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. సీపీఐ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్ అధ్యక్షతన జరిగిన సభలో డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ మార్క్సిజం స్పిరిట్‌ను అర్థం చేసుకున్న అప్పలనాయుడు తుది వరకు పార్టీ నాయకుడిగా ఎనలేని సేవలు అందించారని పేర్కొన్నారు. ఆయన సమాజాన్ని పూర్తిగా చదివారని, అందువల్లే ప్రజా నాయకుడిగా ఎదిగారని చెప్పారు. సీపీఐ కేంద్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ ఈడ్పుగంటి నాగేశ్వరరావు మాట్లాడుతూ తనకు 1960 నుంచి అప్పలనాయుడుతో అనుబంధం ఉందని చెప్పారు. చలసాని వెంకటరత్నం మార్గదర్శకత్వంలో అప్పల నాయుడు ఇక్కడ పేదలకు ఇళ్లు ఏర్పాటు చేయించారని, పోలీసుల దాడులు, కేసులను తట్టుకుని పోరాడి పేదలకు ఇళ్లు ఏర్పాటు చేయించారని వివరించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జల్లి విల్సన్ మాట్లాడుతూ ఇళ్లు, ఇళ్ల పట్టాల సాధన కోసం ఆయన విశేష కృషి చేశారని కొని యాడారు. సీపీఐ జిల్లా కార్యదర్శి అక్కినేని వనజ మాట్లా డుతూ తాను విద్యార్థి దశలో ఉన్నప్పటి నుంచి అప్పల నాయుడితో అనుబంధం ఉందని గుర్తుచేసుకున్నారు. ఆయన వారసత్వాన్ని కుటుంబ సభ్యులు కొనసాగించాలని, జనం కోసం జీవించాలని సూచించారు.



అప్పలనాయుడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నారాయణ, ఈడ్పుగంటి. చిత్రంలో దోనేపూడి శంకర్ తదితరులు



సభలో ప్రసంగిస్తున్న నారాయణ. చిత్రంలో జల్లి విల్సన్, బొండా ఉమ, నాజర్‌వలి, సుబ్బరాజు, శంకర్, కాశీనాథ్ తదితరులు

ఎమ్మెల్యే బొండా ఉమా మాట్లాడుతూ అప్పల నాయుడుతో కమ్యూనిస్టు పార్టీ అంటే పేదల అభ్యున్నతి కోసం పాటుపడేవని గుర్తింపు పొందాయన్నారు. ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవానీ మాట్లాడుతూ అప్పలనాయుడు మహిళా పక్షపాతి అని కొనియడారు. మాజీ ఎమ్మెల్యే కె.సుబ్బరాజు, మాజీ ఎమ్మెల్యే నాసర్ వలీ, విశాలాంధ్ర పూర్వ సంపాదకుడు సి.రాఘవాచారి, టీడీపీనేత దేవినేని అవినాష్, సీపీఎం నగర కార్యదర్శి దోనేపూడి కాశీనాథ్, విజయవాడ బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జవ్వాది సూర్యనారాయణ (రుద్రయ్య), అప్పలనాయుడు కోడలు, మాజీ కార్పొరేటర్ ఇజ్జాడ లక్ష్మి, మాజీ మేయర్ తాడి శకుం తల, కాంగ్రెస్ నాయకుడు నర హరిశెట్టి నరసింహారావు, సీపీఐ సీనియర్ నాయకుడు పసుపులేటి వెంకయ్య ప్రసంగిం చారు. సీపీఐ నగర సహాయ కార్య దర్శి జి.కోటేశ్వరరావు మాజీ కార్పొరేటర్లు వై.చలపతిరావు, కునుకు రాజశేఖర్, సీపీఐ నేతలు లంక దుర్గారావు, అప్పరబోతు రాము, 6వ డివిజన్ కార్యదర్శి పడాల కనకారావు, విజయవాడ బులియన్ మర్చంట్స్ అసో సియేషన్ కార్యదర్శి ఎస్‌ఆర్ నాయుడు, గౌరవాధ్యక్షుడు వెంక టేశ్వర్లు, అప్పలనాయుడు అల్లుడు డాక్టర్ కృష్ణమూర్తి, చంద్ర ప్రసాద్, కుటుంబ సభ్యులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

విగ్రహం ఏర్పాటుకు తీర్మానం

నాలుగుసార్లు కార్పొరేటర్‌గా పనిచేసిన ప్రజానేత ఇజ్జాడ అప్పలనాయుడు కాంస్య విగ్రహాన్ని నగ రంలో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ఒక పాఠశాలకు ఆయన పేరు పెట్టాలని దోనేపూడి శంకర్ ఈ సభలో తీర్మానం ప్రవేశపెట్టగా, హాజరైన ప్రతి ఒక్కరూ హర్షధ్వా నాల మధ్య ఆమోదం తెలిపారు.

నివాళులర్పించిన ప్రముఖులు

అప్పలనాయుడు చిత్రపటం వద్ద సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ, వైసీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి బొప్పన భవకుమార్, స్థానిక సీపీఐ నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.